

ఆంధ్రభూమి



www.andhrabhoomi.net

సంపుటి 59 సంచిక 97 | హైదరాబాద్ సిటీ | హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, రాజమహేంద్రవరం, అనంతపురం, కరీంనగర్, నెల్లూరు | ఆదివారం 6 జనవరి, 2019 | 20 పేజీలు (అదనంగా 16 పేజీల ఆదివారం అనుబంధం ఉచితం) | ధర: రూ.3.00

శుభోదయం

కలియుగం - 5120
శాలివాహన శకం - 1940
శ్రీ చాంద్రమాన విలంబ నామ సంవత్సరం
దక్షిణాయనం, హేమంతఋతువు, పుష్యమాసం
తిథి: శుద్ధ పాడ్యమి పూర్తి
నక్షత్రం: పూర్వాషాఢ సా.4.55
వర్జ్యం: రా.1.41 నుండి 3.26 వరకు
దుర్ముహూర్తం: సా.04.24 నుండి 05.12 వరకు
రాహుకాలం: సా.4.30 నుండి 6.00 వరకు



విజయ్ మాల్యా పరారైన ఆర్థిక నేరస్థుడే

ప్రకటించిన పీఎంఎల్ ప్రత్యేక కోర్టు

న్యూఢిల్లీ, జనవరి 5: బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగవేసి బ్రిటన్ చెక్కేసిన కింగ్ ఫిషర్ అధినేత విజయ్ మాల్యాను 'పరారైన ఆర్థిక నేరస్థుడి'గా ఢిల్లీ కోర్టు శనివారం ప్రకటించింది. మనీ లాండరింగ్ సహా అనేక కేసుల్లో ఉన్న మాల్యా ఆస్తులను కోర్టు ఇంతకు ముందే జప్తు చేసింది. ఆస్తుల జప్తుపై స్టే ఇవ్వాలన్న మాల్యా అభ్యర్థనను కోర్టు తోసిపుచ్చింది. ఢిల్లీలోని మనీలాండరింగ్ నిరోధక కోర్టు పరారైన ఆర్థిక నేరస్థుల చట్టం-2018 కింద తీర్పును వెలువరించింది. అతని ఆస్తుల స్వాధీనానికి ప్రత్యేక కోర్టు అనుమతించింది. పలు బ్యాంకులకు వేల కోట్ల రూపాయలు ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన మాల్యాను పరారైన - మిగతా 6వ పేజీలో

17న కొత్త అసెంబ్లీ



అదేరోజు ఎమ్మెల్యేల ప్రమాణం

- 18న స్పీకర్ ఎన్నిక, బీఏసీ భేటీ
- 19న గవర్నర్ ప్రసంగం
- మంత్రివర్గ విస్తరణపై ఊహాగానాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: రాష్ట్ర అసెంబ్లీ ఈ నెల 17న కొలువుదీరనున్నది. అదే రోజున ఉదయం 11.30 గంటలకు ప్రొటెం స్పీకర్ ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఎమ్మెల్యేలతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. తొలుత సభా నాయకుడైన ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావుతో ప్రమాణం చేయిస్తారు. తర్వాత హోం మంత్రి మహమూద్ అలీ ప్రమాణం చేస్తారు. వరుసగా ప్రధాన ప్రతిపక్ష నేత, సీనియర్ సభ్యులతో ప్రమాణం చేయిస్తారు. అనంతరం ఇంగ్లీషు అక్షర క్రమం ప్రకారం ఒక్కో ఎమ్మెల్యేలను పిలుస్తారు. ఆ ఎమ్మెల్యే స్పీకర్ పోడియం ముందుకు వచ్చి ప్రమాణం చేస్తారు. ఎమ్మెల్యేలు తమ ఇష్టం వచ్చిన భాషలో ప్రమాణం చేయవచ్చు. ఒక్కో ఎమ్మెల్యేకు 2 నిమిషాల సమయం పడుతుందని అంచనా. ఇలాఉండగా ప్రొటెం స్పీకర్ ముంతాజ్ ఖాన్ సభ వాయిదా వేయడానికి ముందు సభలో స్పీకర్ ఎన్నికకు సంబంధించి షెడ్యూలును ప్రకటిస్తారు. అదే రోజున స్పీకర్ ఎన్నికకు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎమ్మెల్యేల ప్రమాణం పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు కౌన్సిల్ ఆవరణ (జూబ్లీహాలు లాన్)లో మధ్యాహ్నం విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారు.

18న స్పీకర్ ఎన్నిక

18న ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కాగానే ప్రొటెం స్పీకర్ ముంతాజ్ ఖాన్ - మిగతా 6వ పేజీలో

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: అసెంబ్లీ ప్రొటెం స్పీకర్‌గా మజ్లిస్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఈ నెల 16న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. రాష్ట్ర గవర్నర్ నరసింహన్ రాజ్‌భవన్‌లో ఉదయం 5 గంటలకు - మిగతా 6వ పేజీలో

మే 3 నుంచి ఎమ్సెట్

- 8 నుంచి అగ్రికల్చర్ ఎంట్రన్స్
- 23న ఐసెట్.. 26న లాసెట్
- షెడ్యూల్ ప్రకటించిన ఉన్నత విద్యామండలి
- ఏపీలోనూ పరీక్షా కేంద్రాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: తెలంగాణలో యూజీ, పీజీ వృత్తి, సాంకేతిక విద్యా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఆన్‌లైన్ పరీక్షల షెడ్యూలును రాష్ట్ర ఉన్నత విద్యా మండలి శనివారం ప్రకటించింది. హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ టీ పాపిరెడ్డి, కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ లింబాద్రి, ప్రొఫెసర్ వెంకటరమణ 'సెట్'ల వివరాలు వెల్లడించారు. ఇంజనీరింగ్ యూజీలో చేరేందుకు నిర్వహించే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షను మే 3వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మే 6వ తేదీ వరకూ జరిగే ఈ ప్రవేశపరీక్షను ఉదయం, సాయంత్రం రెండు షిఫ్ట్‌లుగా నిర్వహిస్తారు. ఎమ్సెట్ నిర్వహణ బాధ్యతను - మిగతా 6వ పేజీలో



శనివారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కే. తారక రామారావు

తెలంగాణపై సవతి ప్రేమ

- కేంద్రంపై నిప్పులు చెరిగిన కేటీఆర్
- నోటితో పొగిడి, నొసటితో వెక్కిరిస్తారా?
- నీతి ఆయోగ్ సిఫార్సు చేసినా నిధులు ఇవ్వరేం
- ఇలాగైతే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పరాభవమే

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: కేంద్ర ప్రభుత్వం తీరు చూస్తుంటే నోటితో పొగిడి, నొసటితో వెక్కిరిస్తున్నట్టు ఉందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు విమర్శించారు. రాష్ట్రంపై కేంద్ర ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ పథకాలను ప్రధాని నరేంద్ర మోదీతో సహా కేంద్ర మంత్రులు, వివిధ రాష్ట్రాల మంత్రులూ ప్రశంసించారని ఆయన శనివారం విలేఖరుల సమావేశంలో గుర్తు చేశారు. మిషన్ భగరథ పథకానికి హడ్కో రెండు సార్లు అవార్డులు ఇచ్చిందని, స్కోచ్ కూడా అవార్డు దక్కిందని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని మోదీ గజ్వేల్‌లో మిషన్ భగీరథను ప్రారంభించారని, అదే విషయాన్ని 'మన్ కీ బాత్'లో కూడా ప్రశంసించారని ఆయన చెప్పారు. కాగా నీతి అయోగ్ రూ.24 వేల కోట్లు విడుదల చేయాలని సిఫార్సు చేస్తే కేంద్ర జల వనరుల శాఖ మంత్రి అర్జున్ మేఘవాలే పార్లమెంట్‌లో మోకాలొడ్డారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

ఓడిపోతే సహాయం చేయరా?

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 103 స్థానాల్లో కనీసం డిపాజిట్లు దక్కక, ఘోరంగా ఓటమి చవి చూసినందున నిధులు విడుదల చేయడం లేదన్న అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ ఉనికి లేనందున సహాయం చేయడం ఎందుకని కేంద్రం భావిస్తుందేమోనని ఆయన వ్యాఖ్యానించారు. ఆంధ్ర ప్రదేశ్‌లో పోలవరం ప్రాజెక్టుకు 95 శాతం నిధులు విడుదల చేస్తున్న కేంద్రం, తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు కల్పించడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. టీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో కేంద్రం వైఖరిని ఎండగడతారని ఆయన చెప్పారు. చిల్లర రాజకీయాలు చేస్తున్న బీజేపీకి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు - మిగతా 6వ పేజీలో



గాంధీభవన్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో ఉత్తమ్, కుంతియా, భట్టి తదితరులు

ఓటమి బాధ్యత అందరిదీ

సమీక్షలో కాంగ్రెస్ నేతల ఏకాభిప్రాయం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమికి ఏ ఒక్కరో బాధ్యత వహించాల్సిన అవసరం లేదని, సమిష్టిగా అందరమూ బాధ్యత వహిద్దాం అని కాంగ్రెస్ పార్టీ నాయకులు అభిప్రాయపడ్డారు. కూటమి ఓటమికి గల కారణాలపై అన్వేషిస్తున్న కాంగ్రెస్ శనివారం నల్లగొండ, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూలు తదితర పార్లమెంటు నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమీక్ష నిర్వహించింది. టీ.పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ ఆర్‌సీ కుంతియా, లోక్‌సభ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, పోటీ చేసిన అభ్యర్థులు హాజరయ్యారు. ఓటమికి దారి తీసిన కారణాలపై ప్రధానంగా చర్చించారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ జాప్యంపై ప్రధానంగా చర్చ జరిగింది. జాప్యం చేయడం వల్ల ఏ నియోజకవర్గం పొత్తులో వెళుతుందో, అభ్యర్థి ఎవరో చివరి వరకు తెలియకపోవడం, కొన్ని నియోజకవర్గాల్లో నామినేషన్ల దాఖలుకు గడువు ముగిసే సమయం వరకూ అభ్యర్థి ఎవరో తెలియక కార్యకర్తల్లో అయోమయం నెలకొందన్నారు. పైగా టీఆర్ఎస్ ఇచ్చిన హామీలు ప్రజలను ఆకర్షించాయని, రైతు బంధు పథకం బాగా దెబ్బతీసిందని కొందరు అన్నారు. టీడీపీతో పొత్తుపై భిన్నాభిప్రాయాలు వెలువడ్డాయి. ఆదివారం ఏఐసీసీ కార్యదర్శి బోసురాజుగా ఉన్న హైదరాబాద్, సికింద్రాబాద్, చేవెళ్ళ, మెదక్, మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లపై సమీక్ష జరుగుతుంది.

ఇలాఉండగా టీ.పీసీసీ ప్రధాన కార్యదర్శి గూడురు నారాయణ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఎన్నికల్లో అవకతవకలకు పాల్పడి టీఆర్ఎస్ విజయానికి సీఇవో రజత్ కుమార్ సహాయం అందించారని విమర్శించారు. దీనిపై కేంద్ర ఎన్నికల కమిషన్ సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు.

గ్రామాలకు రూ.1500 కోట్లు

ఆదర్శంగా తెలంగాణ పంచాయతీలు

ఆంధ్రభూమితో ఎస్ఎఫ్‌సీ చైర్మన్ రాజేశంగౌడ్



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: తెలంగాణలోని గ్రామ పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే తమ ఉద్దేశమని తెలంగాణ రాష్ట్ర ఆర్థిక కమిషన్ (ఎస్ఎఫ్‌సీ) చైర్మన్ జీ రాజేశంగౌడ్ స్పష్టం చేశారు. తెలంగాణ తొలి ఎస్ఎఫ్‌సీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి ఏడాది కావస్తున్న సందర్భంగా శనివారం ఆంధ్రభూమి ప్రతినిధికి సచివాలయంలో ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. గ్రామ పంచాయతీలు స్వయంశక్తిగా ఎదగాల్సిన అవసరం ఉందని, అంతవరకు వాటికి ప్రభుత్వం సాయం చేయాలన్నారు. పంచాయతీ వ్యవస్థను బలోపేతం చేయడానికి ఎస్ఎఫ్‌సీ శక్తివంతన లేకుండా కృషి చేస్తుందన్నారు. పంచాయతీరాజ్ రంగంలో తనకు ఉన్న అనుభవం ఆర్థిక కమిషన్ నివేదిక రూపొందించడంలో తోడ్పడుతుందని భావిస్తున్నాని అన్నారు. పంచాయతీ వ్యవస్థలో అనుభవం ఉన్న చెన్నయ్య ఎస్ఎఫ్‌సీ సభ్యుడిగా, సమర్థుడైన ఐఏఎస్ అధికారి సురేష్ చంద్ర మెంబర్ సెక్రటరీగా పనిచేయడం హర్షణీయమన్నారు. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు వివిధ రూపాల్లో నిధులు సమకూరుతున్నాయని రాజేశంగౌడ్ తెలిపారు. పంచాయతీలు సొంతంగా వసూలుచేసే ఇంటిపన్ను, కోలాగ్రం (వివిధ పదార్థాలను వేలం ద్వారా అమ్మడం వల్ల వచ్చే నిధులు), ప్రకటనలు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే గ్రాంట్‌ల వల్ల ఆదాయం సమకూరుతోందన్నారు. పన్నుల వసూలు విధానంలో మౌలికమైన మార్పులు చేయడం వల్ల పంచాయతీలకు ఆదాయం పెరిగే అంశాలపై తాను దృష్టి కేంద్రీకరించానని తెలిపారు. గ్రామాల్లో పరిస్థితిపై అధ్యయనం చేసే బాధ్యతను సెంటర్ ఫర్ ఎకనమిక్ అండ్ సోషియల్ స్టడీస్ (సెస్) కు అప్పగించామని, ఈ సంస్థకు 25 లక్షల రూపాయలు కూడా ఖర్చుకోసం ఇచ్చామని రాజేశంగౌడ్ తెలిపారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో పరిస్థితిపై అధ్యయనం చేసి నివేదిక రూపొందించే బాధ్యతను అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కి) కి అప్పచెప్పి, 20 లక్షల రూపాయలు స్టడీ ఖర్చుకోసం ఇచ్చామన్నారు. ఈ రెండు సంస్థలు కూలంకషంగా స్థానిక సంస్థల ఆదాయం, వ్యయం, ప్రజల అవసరాలు, ఆదాయం పెంచుకునే మార్గాలు తదితరాలపై పరిశీలన చేస్తున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం 2018-19 సంవత్సరానికి పంచాయతీలకు 1500 కోట్ల రూపాయలు, మున్సిపాలిటీలకు 1000 కోట్ల రూపాయలు కేటాయించిందని రాజేశంగౌడ్ తెలిపారు. ఇది కాకుండా కేంద్ర ప్రభుత్వం కూడా వివిధ పథకాల కింద పంచాయతీలు, మున్సిపాలిటీలకు నిధులు సమకూరుస్తోందని వివరించారు. తాజాగా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రకారం పంచాయతీలపై ఆర్థిక భారం తగ్గుతోందన్నారు. ఇప్పటి వరకు ప్రజలకు తాగునీటి సరఫరా చేసే బాధ్యత పంచాయతీలపై ఉండేదని, దీనికోసం చాలా శ్రమకోర్చి, నిధులు కోట్ల రూపాయల్లో వ్యయం చేయాల్సి వచ్చేదన్నారు. ఇప్పుడు మిషన్ భగీరథ ద్వారా రాష్ట్ర ప్రభుత్వమే తాగునీటి సరఫరా చేస్తూ, ఖర్చు - మిగతా 6వ పేజీలో

లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే 7 సీట్లు గెలుస్తాం

★ ప్రజాకూటమి వద్దని ముందే చెప్పాను ★ మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: ప్రజాకూటమికి గుడ్ బై చెప్పి వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే తమ పార్టీ 7 లేదా 8 స్థానాల్లో సునాయసంగా విజయం సాధిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ఎన్నికల్లో ఓటమిపై కాంగ్రెస్ చేపట్టిన సమీక్షా సమావేశానికి కోమటిరెడ్డి వెంకట రెడ్డి హాజరై తన అభిప్రాయాన్ని వెల్లడించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా కూటమి ఏర్పాటును తాను అసెంబ్లీ ఎన్నికలకు ముందే వ్యతిరేకించానని ఆయన చెప్పారు. పొత్తులంటూ రెండు నెలలు కాలాయాపన చేయడం వల్ల భారీగా నష్టపోయామని, తనలాంటి నేతలంతా అందుకే ఓడిపోయారని ఆయన తెలిపారు. సీట్లు త్వరగా తేల్చకపోవడం, ఈ లోగా టీఆర్‌ఎస్ ప్రచారంలో ముందు ఉండడం జరిగిందన్నారు. అంతేకాకుండా ప్రజాకూటమి అధికారంలోకి వస్తే అనవసరంగా టీడీపీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలంగాణలో కూడా అధికారం చెల్లాయిస్తారన్న భావన ప్రజలకు కలిగిందన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పొత్తులతో జాప్యం చేయడం, ఏ పార్టీ ఎక్కడ పోటీ చేస్తుందో, ఎవరికి టిక్కెట్ వస్తుందోనన్న అనుమానాలు పార్టీ శ్రేణులకు కలిగి గందరగోళానికి దారి తీసిందని కోమటిరెడ్డి చెప్పారు. నల్లగొండ అర్బన్ స్థానంలో పొత్తు ఎందుకు వద్దంటున్నారని తనను కూడా ప్రశ్నించారని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్ రావు రెండు సార్లు తాను పోటీ చేస్తున్న నియోజకవర్గంలో ప్రచారం నిర్వహించి, టీఆర్‌ఎస్‌ను గెలిపిస్తే నల్లగొండను దత్తత తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ప్రజలు విశ్వసించారని ఆయన చెప్పారు. నల్లగొండ లోక్‌సభకు పోటీ చేయడానికి పార్టీ అధిష్టానం తనకు టిక్కెట్ ఇస్తే తప్పకుండా పోటీ చేస్తానని కోమటిరెడ్డి తెలిపారు.

ఉన్నత విద్యాశాఖాధికారులపై సీఎం సీరియస్

★ రోజూ చేయాల్సిన పనులూ ఆగుతాయా?
★ సెట్ షెడ్యూల్ ఆలస్యంపై ఆగ్రహం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: తెలంగాణలో ప్రవేశపరీక్షల తేదీలను ప్రకటించకుండా మీనమేషాలు లెక్కిస్తున్న ఉన్నత విద్యాశాఖాధికారులపై ముఖ్యమంత్రి కేసీఆర్ సీరియస్ అయ్యారు.

రోజూ చేయాల్సిన పనులు ఎందుకు ఆగుతాయని నిలదీసినట్టు సమాచారం. సెట్‌ల తేదీలకు, మంత్రివర్గ విస్తరణకూ ముడిపెట్టవద్దని, తక్షణం సెట్‌ల తేదీలను ప్రకటించాలని ఆదేశించడంతో ఉన్నత విద్యామండలి అధికారులు శనివారం సాయంత్రం షెడ్యూలు విడుదల చేశారు. మంత్రివర్గం ఏర్పాటు కాకపోవడం, విద్యాశాఖ బాధ్యులు ఎవరో తేలకపోవడంతో రాష్ట్రంలో నిర్వహించాల్సిన ప్రవేశపరీక్షల షెడ్యూల్ ఇంకా ఖరారు కాలేదన్న ఆంధ్రభూమి వార్తా కథనంపై అధికారులు స్పందించారు. పరీక్షల షెడ్యూల్ ముసాయిదాను ఉన్నత విద్యామండలి రూపొందించి దాని ఆమోదం కోసం ప్రభుత్వానికి పంపించినా, అది నెల రోజులుగా సుప్తచేతనావస్థలో ఉండటంపై ఆంధ్రభూమి రాసిన కథనంపై ముఖ్యమంత్రి ఉన్నత విద్యాశాఖాధికారులతో మాట్లాడినట్టు తెలిసింది. ముందస్తు ఎన్నికలు రావడం, వాటి ఫలితాలు రావడం, ముఖ్యమంత్రిగా కేసీఆర్ ప్రమాణ స్వీకారం చకచకా జరిగిపోయాయి. డిసెంబర్ 11న ఫలితాలు రాగానే, నాలుగైదు రోజుల్లో మంత్రివర్గం ఏర్పాటవుతుందని అంతా భావించారు. అది కాస్తా జాప్యం జరుగుతుందనే ప్రచారంతో డిసెంబర్ 20 నాటికి మంత్రివర్గం ఏర్పాటుకాకపోతుందా అని భావించి కొత్త మంత్రి వచ్చిన తర్వాత ప్రవేశపరీక్షల షెడ్యూల్ ప్రకటించవచ్చని అధికారులు అనుకున్నారు.

అయితే మంత్రివర్గ విస్తరణ సంక్రాంతి తర్వాతనే జరుగుతుందనే స్పష్టత శనివారం నాటికి వచ్చింది. ఈ మొత్తం వ్యవహారంపై ఆరా తీసిన సీఎం కార్యాలయ అధికారులు షెడ్యూలు విడుదల చేయాల్సిందిగా ఉన్నతాధికారులను ఆదేశించినట్టు తెలిసింది.

సెట్‌ల తేదీలను ఉన్నత విద్యామండలి నిర్ణయించాల్సి ఉంటుంది, వాటిని ప్రకటించే ముందు ప్రభుత్వ అనుమతి పొందడం ఆనవాయితీగా వస్తోంది. సెట్‌ల కన్వీనర్లు, చైర్మన్లను ఖరారు చేసిన తర్వాత, ఆయా సెట్‌ల తొలి కమిటీ సమావేశాల్లో పరీక్ష తేదీలను ఖరారు చేయడం ఆ క్రమంలోనే పరీక్ష కేంద్రాలు కూడా ఖరారు చేయాల్సి ఉంటుంది. ఇప్పటికే నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ జేఈఈ, నీట్ పరీక్షలతో పాటు మరోమారు జేఈఈ నిర్వహణకు తేదీలను ఖరారు చేసింది.

అదే రీతిన ఎయిమ్స్ సహా మిగిలిన ప్రవేశ పరీక్షల నిర్వహణకు జాతీయ సంస్థలు తేదీలను ఖరారు చేశాయి. ఆంధ్రా ఎమ్సెట్ సహా వివిధ ప్రవేశపరీక్షలకు తెలంగాణలో ప్రధానంగా హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా డిసెంబర్ చివరి వారంలో సెట్‌లను ప్రకటించేవారు. కానీ ఈ ఏడాది ఇంత వరకూ ఆ అంశంపై ఉన్నత విద్యా మండలి ఉలుకూ పలుకూ లేకుండా ఉడటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు.

క్యాట్ టాపర్ మజుందార్

★ 11 మందికి 100 పర్సంటైల్
★ 21 మందికి 99.99 పర్సంటైల్
★ ఎయిమ్స్ దరఖాస్తు గడువు పెంపు
★ మెరిసిన వరంగల్ నిట్ విద్యార్థులు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: ఐఐఎంలు, జాతీయ స్థాయి మేనేజిమెంట్ విద్యాసంస్థల్లో మేనేజిమెంట్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే క్యాట్ ఫలితాలను ఐఐఎం కలకత్తా ప్రకటించింది. జాతీయ స్థాయిలో రానక్ మజుందార్ టాపర్‌గా నిలిచాడు. మంచి స్కోర్‌లు సాధించిన వారిలో వరంగల్ నిట్ విద్యార్థులు నిపుణ్ అగర్వాల్ (99.92), తరుణ కే (99.85), సమీర్ అహ్మద్ (97.04), గౌరవ్ మాలిక్ (96), తపస్ దాస్ (95.9), సుజన్ కే (95.17) ఉన్నారు. విద్యార్థులను నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ రమణారావు అభినందించారు.

దేశవ్యాప్తంగా వంద పర్సంటైల్‌ను 11 మంది సాధించగా అందులో ఏడుగురు ఐఐటీలకు చెందిన వారే, మరో ఇద్దరు జాదవ్‌పూర్ యూనివర్శిటీ విద్యార్థులు, 99.99 పర్సంటైల్‌ను 21 మంది సాధించగా, అందులో 19 మంది ఇంజనీరింగ్ విద్యార్థులే ఉన్నారు. టాపర్లలో ఏడుగురు మహారాష్ట్ర నుండి ఇద్దరు బెంగల్ నుండి, కర్నాటక, బీహార్‌ల నుండి ఒకొక్కరు వంద శాతం పర్సంటైల్ సాధించారు. గత నవంబర్‌లో నిర్వహించిన క్యాట్‌కు 2,09,405 మంది హాజరుకాగా వారిలో 73,326 మంది అమ్మాయిలు, 1,36,075 మంది అబ్బాయిలు, నలుగురు థర్డు జండర్ ఉన్నారు. ఇద్దరు కవలలు అనుభవ్ గార్గ్, అభిషేక్ గార్గ్‌లు 99.99 పర్సంటైల్, 99.67 పర్సంటైల్ సాధించారు. దేశవ్యాప్తంగా ఈ పరీక్షను 147 పట్టణాల్లో 374 కేంద్రాల్లో నిర్వహించారు. టాపర్ల జాబితాలో అమిత్ భిక్రం, జగదీష్ గోల్‌వాలా, రిషబ్ గుప్త, కరణ్, మయూర్ అరోరా, ఉత్‌కర్ష్ గుప్త, కుషాగర్ పాన్‌వార్, ప్రతీక్ మిశ్రా, మసాల్ అవినాష్‌లున్నారు. ఐఐఎంల వారీ చూస్తే బెంగులూరులో 412, అహ్మదాబాద్‌లో 385, కలకత్తాలో 462, లక్నోలో 436, కోజికోడ్‌లో 353, ఇండోర్‌లో 550 సీట్లున్నాయి.

ఎయిమ్స్ దరఖాస్తు గడువు

దేశ వ్యాప్తంగా ఉన్న ఎయిమ్స్ కేంద్రాల్లో ఎంబిబిఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ప్రవేశపరీక్ష ప్రాథమిక దరఖాస్తు గడువును జనవరి 14 వరకూ పొడిగించారు. ఎయిమ్స్‌కు రెండంచెల దరఖాస్తు విధానాన్ని అమలుచేస్తున్నారు. అందులో మొదటి దశ ప్రాథమిక రిజిస్ట్రేషన్, ఆసక్తి ఉన్న అభ్యర్థుల జాబితా రూపొందించడం, రెండో దశలో తుది రిజిస్ట్రేషన్ ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థుల జాబితాను జనవరి 16న విడుదల చేస్తారు. అభ్యర్థులు ఏమైనా సవరణలు ఉంటే వాటిని జనవరి 22లోగా చేసుకోవల్సి ఉంటుంది. అనంతరం తుది రిజిస్ట్రేషన్‌కు గడువు ఇస్తుంది. ఆ గడువు మార్చి 12తో ముగుస్తుంది అనంతరం అడ్మిట్ కార్డులను జారీ చేస్తుంది. ఇతర వివరాలకు ఎయిమ్స్ ఎగ్జామ్స్ డాట్ ఆర్గ్ అనే వెబ్ పోర్టల్‌ను సందర్శించాలని సూచించింది.

సీ టెట్ ఫలితాలు

దేశవ్యాప్తంగా విద్యాసంస్థల్లో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టేందుకు వీలుగా అర్హత కల్పించే పరీక్ష సీటెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఈ పరీక్షకు 17 లక్షల మంది హాజరయ్యారు. వీరిలో 58 శాతం మంది మహిళలు, 33,107 దివ్యాంగులు, 199 మంది ట్రాన్స్‌జండర్లున్నారు.

6 నుండి ఐటీ జేఈఈ

ఆరో తేదీ నుండి 20వ తేదీ వరకూ ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్న ఐటీ జేఈఈకి నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ అన్ని ఏర్పాట్లు చేసింది. రీజనల్ కేంద్రాల వారీ పర్యవేక్షకులను నియమించింది. ఈసారి నేషనల్ టెస్టింగ్ ఏజన్సీ రెండు విడతలుగా జేఈఈని నిర్వహిస్తోంది. రెండోవిడత ఏప్రిల్‌లో నిర్వహించనుంది. జనవరి పరీక్షకు 9.65 లక్షల మంది దరఖాస్తు చేశారు. అందులో 6.85 లక్షల మంది అబ్బాయిలు, 2.8 లక్షల మంది అమ్మాయిలు, 38 మంది ట్రాన్స్ జండర్లున్నారు. మొత్తం అభ్యర్థుల్లో 4.72 లక్షల మంది జనరల్, 3.67 లక్షల మంది ఓబీసీ, 0.89 లక్షల మంది ఎస్సీలు, 0.36 లక్షల మంది ఎస్టీలున్నారు.

గురుకుల ఉర్దూ పోస్టులకు 9న సర్టిఫికెట్ల పరిశీలన

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: గురుకుల ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులకు ఈ నెల 9వ తేదీన సర్టిఫికేట్ల పరిశీలన జరుగుతుందని రిక్రూట్‌మెంట్ బోర్డు ఒక ప్రకటనలో పేర్కొంది. సర్టిఫికేట్ల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థులకు ఇందుకు సంబంధించిన సమాచారాన్ని ఎస్ఎంఎస్ ద్వారా పంపించడం జరిగిందని ఆ ప్రకటనలో బోర్డు పేర్కొంది. ఇతర వివరాలకు బోర్డు పోర్టల్‌ను సందర్శించాలని సూచించారు.

ఎన్నికలకు సర్వం సన్నద్ధం

★ కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి ★ కమిషనర్ నాగిరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా జిల్లా కలెక్టర్లు అసరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ వి. నాగిరెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, పంచాయతీ అధికారులు తదితరులతో శనివారం సచివాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నాగిరెడ్డి మాట్లాడుతూ, జిల్లాల నుండి అందిన సమాచారం ప్రకారం పంచాయతీ ఎన్నికలకు సర్వం సన్నద్ధం అయినట్టేనని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది, పోలింగ్ మెటీరియల్, సెక్యూరిటీ, పోలింగ్ స్టేషన్లు, కౌంటింగ్ హాళ్లు, స్టోరేజీ కేంద్రాలు తదితర అంశాలపై కలెక్టర్లకు సూచనలు చేశారు. రెండురోజుల్లో ఎన్నికల నోటీస్ జారీ అవుతుండటం, 25 రోజుల్లో ఎన్నికలు పూర్తి కావలసి ఉండటంతో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్, రెవెన్యూ, పంచాయతీ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పోలింగ్ సందర్భంగా పోలింగ్‌స్టేషన్లు ఉండే ప్రాంతాలను సూచించే సూచికలను ఏర్పాటు చేయాలన్నారు. మొదటి, రెండోవిడత ఎన్నికలు జరిగే పంచాయతీలకు రిటర్నింగ్ అధికారుల నియామకం, ప్రిసైడింగ్ అధికారుల నియామకం, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల నియామకం పూర్తయి, శిక్షణ కూడా పూర్తి కావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల పరిశీలకులు జాగ్రత్తగా పనిచేయాలని సూచించారు. పోలింగ్‌కు సంబంధించిన మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ హాళ్లు, ఉపసర్పంచ్ ఎన్నికకోసం హాళ్ల ఎంపికలను వెంటనే మరొక సారి పర్యవేక్షించాలని సూచించారు. వెబ్‌క్యాస్టింగ్, వీడియో రికార్డింగ్‌లకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద లైటింగ్ ఏర్పాట్లు సమర్థతగా ఉండేలా చూడాలన్నారు.



జిల్లా యంత్రాంగాలతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నాగిరెడ్డి, జోషి తదితరులు

ఏ గ్రామంలో కూడా బలవంతంగా ఏకగ్రీవ ఎన్నిక జరగకుండా చూడాలని, ప్రజలంతా కలిసి ఏకగ్రీవం చేసుకుంటేనే ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని నాగిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల నోటీస్ జారీ అయిన తర్వాతనే ఏకగ్రీవం అనేది మొదలవుతుందన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్.కే. జోషి సూచించారు. పోలింగ్ సమయంలో అత్యవసర పరిస్థితి ఏర్పడితే స్పందించేలా ప్రత్యేక అధికారులను నియమించుకోవాలని, సదరు అధికారి వివరాలను పోలింగ్ సిబ్బందికి తెలియచేయాలని సూచించారు. పంచాయతీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీలకు డీజీపీ మహేందర్‌రెడ్డి ఆదేశించారు. ఎన్నికలు మూడు విడతల్లో జరుగుతుండటంతో పోలీస్ సిబ్బందిని రొటేషన్ విధానంలో వినియోగించుకోవచ్చన్నారు. అసెంబ్లీ ఎన్నికల తరహాలోనే సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో అదనపు డీజీపీ జితేందర్, పంచాయతీరాజ్ ముఖ్యకార్యదర్శి వికాస్‌రాజ్, హోంశాఖ ముఖ్యకార్యదర్శి రాజీవ్ త్రివేది,పంచాయతీ రాజ్ కమిషనర్ నీతూప్రసాద్, రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం. అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో శబరిమలకు మహిళా సంఘాలు

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: శబరిమలలో మతోన్మాద శక్తులు అరాచకాలు సృష్టిస్తున్నాయని, సుప్రీం కోర్టు తీర్పునిచ్చినా మహిళా భక్తులను అడ్డుకోవడం సిగ్గుచేటని భారత జాతీయ మహిళా సమాఖ్య తీవ్రంగా ఖండించింది.

త్వరలో మహిళా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున మహిళలు శబరిమలకు తరలివెళ్తారని సమాఖ్య అధ్యక్షురాలు పీ కళావతి స్పష్టం చేశారు. శనివారం ఇక్కడ జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ మహిళా సంఘాలకు చెందిన నాయకురాళ్లు పాల్గొన్నారు. 'చట్టాలను గౌరవిద్దాం-మహిళ హక్కులు గుర్తిద్దాం' అన్న అంశంపై చర్చ జరిగింది. కళావతి మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ మూకలు కావాలని శబరిమల విషయంలో రాద్ధాంతం చేయడం ఏమిటని ఆమె ప్రశ్నించారు. సుప్రీం కోర్టు శబరిమలలో మహిళలు ప్రవేశానికి అనుమతి ఇచ్చినా మతోన్మాదులు అడ్డుకోవడం దారుణమన్నారు. మహిళల పట్ల బీజేపీకి ఎంత ప్రేమ ఉందో తెలుస్తోందని ఆమె ధ్వజమెత్తారు. గతంలో ఆర్ఎస్ఎస్ శబరిమలలో మహిళలను అనుమతించాలని పాదయాత్ర చేసిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఇప్పుడు అదే ఆర్ఎస్ఎస్ వ్యతిరేకిస్తోందని ఆమె నిప్పులు చెరిగారు. కేరళ బీజేపీ అధ్యక్షుడు శ్రీధరన్ మహిళల ప్రవేశాన్ని స్వాగతించారని, అయితే కేంద్రంలోని బీజేపీ నేతలు మాత్రం మహిళల ప్రవేశానికి అడ్డంకులు సృష్టిండం ఏమిటని ఆమె నిలదీశారు.

మహారాష్ట్రలో మహిళలకు ఆలయ ప్రవేశం కల్పిస్తూ, కేరళలో మరోవిధంగా వ్యవహరించడం సిగ్గుచేటని కళావతి మండిపడ్డారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉస్తేల సృజన, వర్కింగ్ ప్రెసిడెంట్ జ్యోతి, సామాజిక కార్యకర్తలు దేవి, విజయ, ఐద్వా ఉపాధ్యక్షురాలు కృష్ణకుమారి, ఆశ్రామిక మహిళా ఫోరం కన్వీనర్ ప్రేం పావని పాల్గొన్నారు.

18న అమిత్ షా వస్తున్నారు అడ్డుకోండి చూద్దాం

★ టీడీపీకి సవాలు చేసిన ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: చంద్రబాబు ఇంతకాలం చేసిన దోపిడీ బయట పడుతుందనే భయపడుతున్నారని, బీజేపీ నేతలపై ఆ పార్టీ కార్యకర్తలు దాడులకు పాల్పడుతున్నారని ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు.

శనివారం నాడు ఆయన హైదరాబాద్ బీజేపీ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ నెల 18న పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా రాయలసీమ పర్యటనకు వస్తున్నారని, దమ్ముంటే ఆయనను ఆపాలని విష్ణువర్ధన్‌రెడ్డి హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్‌లో సింగపూర్ తరహా జైలు కట్టుకోవాలని, 90 రోజుల తర్వాత చంద్రబాబు అడ్రస్ అక్కడే ఉంటుందని పేర్కొన్నారు. చంద్రబాబును నిలదీసినందుకు నెలల బిడ్డ ఉన్న కాకినాడ బీజేపీ కార్పొరేటర్ ప్రసన్నను రాత్రంతా పోలీసు స్టేషన్‌లో ఉంచారని , ఇదేం దౌర్జన్యమని ఆయన నిలదీశారు. భూముల కుంభకోణంపై హైకోర్టు పిల్‌ను స్వీకరించిందని, తనపై కేసులు విచారణకు రాకుండా హైకోర్టు అమరావతికి రాకూడదనేది చంద్రబాబు భావన అని ఎద్దేవా చేశారు. మీ సంగతి చూస్తా అంటూ చంద్రబాబు హెచ్చరికలు జారీ చేసి 24 గంటలు తిరగకముందే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణపై దాడులు జరిగాయని, దాడులు చేస్తూ రౌడీ రాజకీయాలు చేసిన వారు కాల గర్భంలో కలిసిపోతారని పేర్కొన్నారు. సీఎం పదే పదే అంతు చూస్తా, ఫినిష్ అయిపోతారు అనే మాటలు వాడుతున్నారని, టీడీపీ నేతలు అంతా దాడులకు పాల్పడటం ఒక కార్యక్రమంగా పెట్టుకున్నారని అన్నారు. పోలీసులు మీద దాడి చేసిన జేసీ అనుచరులను చంద్రబాబు ఆదర్శంగా తీసుకుంటున్నారా అని నిలదీశారు.

సార్వత్రిక సమ్మెకు ట్రేడ్ యూనియన్ల సమాయత్తం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 8, 9 తేదీలో తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు ట్రేడ్ యూనియన్లు సమాయత్తమవుతున్నాయి. సమ్మె జయప్రదం చేయాలని 20 కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు నేతలు మాట్లాడారు.

జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాల ఫెడరేషన్లు సమ్మెకు మద్దతు తెలిపాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలం చెందిందని వారు ధ్వజమెత్తారు. కేంద్రం కార్మిక వ్యతిరేక విధానాలు తారస్థాయికి చేరాయని ఆరోపించారు. బీజేపీ పాలనలో సంపన్న వర్గాలు పైపైకి ఎగబాకుతుంటే, పేద ప్రజలు మరిన్ని కష్టాలుపడుతున్నారని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకులు నింగినంటాయని ఆరోపించారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని వారు విమర్శించారు. అచ్చేదిన్, మేక్ ఇండియా, రైతేరాజు శ్రమేవజయతే అన్న నినాదాలన్నీ గాలిలో కలసిపోయాయని వారు అన్నారు. పే కమిషన్ ఆధారంగా నిర్ణయించిన మూలవేతనం అమలు చేయడానికి కేంద్రం ముందుకు రాకపోవడంతో లక్షలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయని విమర్శించారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయకపోవడంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. మతం పేరుతో దేశ ప్రజల్లో చిచ్చుపెట్టడానికి బీజేపీ ప్రయత్నిస్తోందని వారు విరుచుకుపడ్డారు. రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ నేత సాయిబాబా, ఏఐటీయూసీ నేత రత్నాకర్‌రావు, టీఎస్ఆర్‌కేఎల్ నేత రాంబాబు యాదవ్, ఐఎఫ్‌టీయూ నేత సూర్య, కేవీపీఎస్ నేత భాస్కర్, ఐఎన్‌టీయూసీ నేత డీ నారాయణరావు, పీడీఎస్‌యూ నేత శ్యామ్, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అచ్యుతరామారావు, పీడీఎస్‌యూ అధ్యక్షుడు రాజేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నేత జంగారెడ్డి, టీపీఎస్‌కే నేత హిమబిందు. బీకేఎంయూ నేత వెంకట్రాములు, ఎంబీసీ నేత ఆశయ్య, తెలంగాణ గిరిజన సంఘం నేత శోభన్ నాయక్, మత్స్య కార్మిక నేత లెల్లెల బాలకృష్ణ, ప్రొఫెసర్ హరిబండి ప్రసాద్, ఏఐవైఎఫ్ నేత అనిల్‌కుమార్, అవాజ్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, అరుణోదయ నాగరాజు, ఎస్ఎల్ పద్మ, రమణ, శ్రీరామ్ రాయక్ పాల్గొన్నారు.

సంక్రాంతికి ప్రత్యేక రైళ్ళు

ఆంధ్రభూమి బ్యూరో



హైదరాబాద్, జనవరి 5: సంక్రాంతి రద్దీని దృష్టిలోపెట్టుకుని దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. సికింద్రాబాద్ నుంచి కాకినాడ, విశాఖపట్నం, మచిలీపట్నం-లింగంపల్లి మధ్య పత్యేక రైళ్లను నడుపుతున్నట్టు రైల్వే సీపీఆర్వో సిహెచ్ రాకేష్ తెలిపారు. 9 నుంచి సువిధ ప్రత్యేక రైళ్లు తిరుగుతాయి. 9వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లు నడుస్తాయి. వీటికి రిజర్వేషన్ సదుపాయం ఉందని ఆయన అన్నారు. ఈ ప్రత్యేక రైళ్లు విజయవాడ స్టేషన్‌కు వెళ్లకుండా రాయనపాడు మీదుగా నడుస్తాయని చెప్పారు.

ఓటర్లుగా నమోదు చేసుకోండి

★ మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ టీచర్స్ నియోజకవర్గం
★ వరంగల్, ఖమ్మం, నల్లగొండ గ్రాడ్యుయేట్స్ నియోజవర్గం: సీఈఓ రజత్ కుమార్

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: తెలంగాణ శాసనమండలికి గ్రాడ్యుయేట్/టీచర్స్ నియోజకవర్గాల్లో ఓటర్ల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ అధికారి డాక్టర్ రజత్ కుమార్ తెలిపారు. కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించామని, ఇందులో పేర్లులేని గ్రాడ్యుయేట్లు తమపేర్లను ఈ నెల 31 లోగా నమోదు చేసుకోవచ్చన్నారు. అలాగే ముసాయిదా ఓటర్ల జాబితాలో ఏవైనా పొరపాట్లు ఉంటే ఫిర్యాదు చేయవచ్చన్నారు. గ్రాడ్యుయేట్ల నుండి వచ్చే ఫిర్యాదులను, దరఖాస్తులను 2019 ఫిబ్రవరి 15 వరకు పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విదేశాలకు తెలంగాణ కాయగూరలు, పండ్లు

★ ప్రభుత్వ నిర్ణయం

ఆంధ్రభూమి బ్యూరో

హైదరాబాద్, జనవరి 5: తెలంగాణలో పండించే తాజా కాయగూరలు, పళ్లను విదేశాలకు ఎగుమతి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి సి. పార్థసారథి తెలిపారు. 'ప్యాక్ హౌజ్‌ల ఆధునీకరణ' అంశంపై రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయంలో శనివారం ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం నేతృత్వంలో జరుగుతున్న ఉద్యాన పంటలకు ప్రభుత్వం తరపున అవసరమైన చేయూత అందిస్తామన్నారు.

విదేశాలకు కాయగూరలు, పళ్లు, పూలు ఎగుమతి చేసేందుకు వేపర్ హీట్ ట్రీట్‌మెంట్ విధానం ఉపయోగపడుతోందని ఉద్యాన శాఖ డైరెక్టర్ ఎల్. వెంకటరామిరెడ్డి తెలిపారు. 2019 ఏప్రిల్ నుండి విదేశాలకు మామిడి పళ్లను ఎగుమతి చేసేందుకు ప్రణాళిక రూపొందించామన్నారు. ఈ సమావేశంలో పట్టుపరిశ్రమ శాఖ డైరెక్టర్ నీరజ్ కుమార్ సింగ్, శంషాబాద్ విమానాశ్రయం సస్యరక్షణ అధికారి యు.ధర్మారావు,ఉద్యాన విశ్వవిద్యాలయం పరిశోధనావిభాగం డైరెక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దర్యాప్తు సంస్థల దోబూచులాట

★ వివరాలు ఇచ్చేందుకు ప్రభుత్వ అనుమతి అవసరం
★ శ్రీనివాస్ రాసిన మరో లేఖ విడుదలకు అనుమతి కోరిన లాయర్
★ నార్కో పరీక్షలు జరుపుకోండి

ఆంధ్రభూమి బ్యూరో

విశాఖపట్నం, జనవరి 5: వైసీపీ నేత జగన్‌పై దాడి ఘటనకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ దర్యాప్తు సంస్థల నడుమ వివాదం చోటుచేసుకుంటోంది. గత ఏడాది అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో జగన్‌పై జనిపల్లి శ్రీనివాస్ అనే వ్యక్తి కోడికత్తితో దాడికి పాల్పడగా, కేసును దర్యాప్తు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ను ఏర్పాటు చేసింది. అయితే ఈ కేసును గతేడాది డిసెంబర్ 31న కేంద్ర దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) చేపట్టింది. కేసుకు సంబంధించి ఈనెల 1న ఎన్ఐఏ ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. అయితే గత అక్టోబర్‌లో ఘటన జరిగిన తరువాత ఇప్పటి వరకూ దర్యాప్తు వివరాలను సిట్ నుంచి తీసుకునే ప్రయత్నం ఎన్ఐఏ చేస్తోంది. దీనిపై ఇప్పటికే పోలీసు ఉన్నతాధికారులకు ఎన్ఐఏ సంప్రదించినట్టు సమాచారం. సిట్ ఏర్పాటు, దర్యాప్తు పురోగతిని ఇప్పటి వరకూ పర్యవేక్షించిన రాష్ట్ర ప్రభుత్వం అనుమతి అనంతరమే దర్యాప్తు నివేదిక ఇస్తామని సిట్ అధికారులు స్పష్టం చేసినట్టు తెలిసింది. ఇదిలా ఉండగా జగన్‌పై హత్యాయత్నం ఘటనకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం దర్యాప్తును ఎన్ఐఏకు అప్పగించిన రెండు రోజులకే నగర పోలీసు కమిషనర్ మహేష్ చంద్ర లడ్డా విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి కేవలం ప్రచారం కోసమే జనిపల్లి శ్రీనివాస్ జగన్‌పై దాడికి పాల్పడినట్టు సిట్ దర్యాప్తు వివరాలు వెల్లడించడం కొసమెరుపు. కేసు ఎన్ఐఏ చేతుల్లోకి వెళ్లిన నేపథ్యంలో ఇప్పటి వరకూ సిట్ జరిపిన దర్యాప్తు వివరాల కోసం ఎన్ఐఏ అధికారులు యత్నించగా సానుకూల స్పందన లభించనట్టు సమాచారం. కేసును ఎన్ఐఏకి అప్పగించినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల అనంతరం తాము దర్యాప్తు నివేదిక ఇవ్వగలమని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఇదే విషయమై ఏసీపీ నాగేశ్వర రావును వివరణ కోరగా, ఎన్ఐఏ అడిగితే దర్యాప్తు వివరాలు ఇచ్చేందుకు తమ అభ్యంతరం ఏమీ లేదన్నారు. అయితే ఈ విషయంలో ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉండాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా జగన్‌పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడు జనిపల్లి శ్రీనివాస్ కేంద్ర కారాగారంలో ఉంటూ కొన్ని పేజీల పుస్తకాన్ని రాసినట్టు తెలిసింది. 'మార్పుకోసం' పేరిట 22 పేజీల కథనాన్ని ప్రచురించేందుకు అనుమతి ఇవ్వాల్సిందిగా శ్రీనివాస్ తరపు న్యాయవాది సలీం జిల్లా కేంద్ర కారాగారం పర్యవేక్షకులు, రాష్ట్ర పోలీసు ప్రధానాధికారి (డీజీపీ)కి లేఖలు రాశారు. ఇదే విషయాన్ని ఆయన 'ఆంధ్రభూమి'కి స్పష్టం చేశారు. సమాజంలో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, సమానత్వం కరువైందని, నిరుపేదలకు విద్య, పౌష్టికాహారం సక్రమంగా అందట్లేదని శ్రీనివాస్ తన లేఖలో పేర్కొన్నట్టు తెలిపారు. దాడి ఘటనపై విచారణను ఎన్ఐఏకి అప్పగించడంపై కూడా శ్రీనివాస్ తన లేఖలో పేర్కొన్నట్టు తెలిపారు. వాస్తవాలు కావాలంటే తనకు ప్రజల సమక్షంలో నార్కో అనాలసిస్ పరీక్షలు నిర్వహించుకోవచ్చని శ్రీనివాస్ పేర్కొంటున్నట్టు న్యాయవాది సలీం స్పష్టం చేశారు.

రోదిస్తున్న మాతృత్వం.. కనికరించని సంతానం

- ఈ అమ్మలు అవసాన దశలో అనాథలు
- అన్నీ వున్నా.. అందరున్నా భిక్షాటనే దిక్కు


లస్మవ్వ (72)


సాయవ్వ (66)

ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్, జనవరి 5: నవ మాసాలు మోసి, కని పెంచిన కనుపాపలు వారి పట్ల కాఠిన్యం ప్రదర్శిస్తున్నాయి. వృద్ధాప్యంలోకంటి పాపలా కాపాడుకోవాల్సిన వారిని కనికరం లేకుండా తమ పుత్రులే వీధుల్లోకి నెట్టేస్తుండగా, పాలిచ్చి, లాలించి, జోల పాడిన వారి నోట భిక్షాం దేహీ అనే మాట వస్తోంది. సుపుత్రుల ఛీత్కారానికి గురై, బుక్కెడు బువ్వకోసం అల్లాడిపోతున్నారు. గడ్డకట్టే చలిలో, ఒంటినిండా దుస్తులు లేక ఆ ముసలి తల్లులు బిగుసుకుపోతున్నారు. తమ భర్తల ఉద్యోగాలిప్పించి, ఉన్న ఇంటితోపాటు ఆస్తులన్నీ అప్పగిస్తే, తుదకు వారినే వీధుల్లోకి నెట్టేసిన పాపపు పుత్రుల తీరుతో, పున్నామ నరకం అనుభవిస్తున్నారు. నిలువ నీడ లేక కాలం గడుపుతున్నారు. చలికి వణుకుతూ, ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ, తెల్సినవారింత కలో, గంజో వేస్తే కడుపునింపుకుంటూ, అందరు ఉన్నా అనాథలుగా బతుకు జీవనం సాగిస్తున్నారు. బంధుగణం గమనించి కుమారులను ప్రశ్నిస్తే, ముసలి తల్లులపై తమ ప్రతాపాన్ని చూపుతూ, చావే దిక్కనేలా చేస్తుండగా, ఎవరికి చెప్పుకోవాలో తెలియక ముఖ్యమంత్రి సార్ మమ్మల్ని రక్షించాలంటూ వేడుకుంటున్న తీరు మనసున్న హృదయాలను కన్నీటి పర్యంతం చేస్తోంది. ఎందరు ఉన్నా ఎవరూ పట్టించుకోని ఈ మాతృమూర్తులు ఉమ్మడి జిల్లాలోని జగిత్యాల, గోదావరిఖని పట్టణాల్లో కడు దయనీయంగా భిక్షాటన చేయటాన్ని చూస్తూ, మానవత్వమున్న ప్రతి ఒక్కరు చలించిపోతున్నారు.

వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల పట్టణంలోని లచ్చమ్మకు నలుగురు పుత్ర సంతానం ఉండగా, వారిలో ఒకరు మరణించారు. మిగతా ముగ్గురికి కోట్లాది రూపాయల ఆస్తులు సంపాదించి, అప్పగించింది. సుఖ సంతోషాలతో ఉండాలని తమ కుమారుల పెళ్ళిళ్లు చేసి, వారికి బతుకు దెరువు దారి చూపింది. తల్లి ఇచ్చిన నగదుతో ఆ ముగ్గురు కొడుకులు వ్యాపారాలు చేస్తూ, కోటీశ్వరులుగా మారారు. తల్లికి వృద్ధాప్యం రాగా సాదటం కష్టమై, తమకు భారంగా భావిస్తూ, తమకెందుకు బాధ అంటూ వీధుల్లోకి నెట్టారు. తెల్సినవారి సాయంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవటంతో, చేసేదేమీ లేక బస్టాండ్‌లో భిక్షాటన చేస్తుంది.

అదేవిధంగా గోదావరిఖని పట్టణంలోని అడ్డగుంట పల్లెకు చెందిన జీల సాయవ్వ పరిస్థితి ఇంతకంటే కడు హీనంగా మారింది. పేగు తెంచుకుని పుట్టిన ముగ్గురు కుమారులను అల్లారుముద్దుగా పెంచి, పెద్ద చేసింది. యుక్తవయసులోకి వచ్చినా ఉపాధి లేక పోవటంతో తన భర్త చేసే సింగరేణి ఉద్యోగాన్ని కూడా పెద్దకొడుకుకు ఇప్పించింది. మిగతా ఇద్దరికి చెరో రూ.50లక్షల ఆస్తి పంచి ఇచ్చింది. అయినా, తల్లి అనే కనికరం లేకుండా ముగ్గురు కలిసి విషమిచ్చి చంపేయత్నం చేసినట్లు ఆరోపిస్తోంది ఆ తల్లి. విచక్షణ రహితంగా భౌతిక దాడికి దిగి, ఊరి బయట వదిలి వెళ్ళగా, నాలుగు రోజులుగా చెట్టుకింద తలదాచుకుంటున్న ఆమెను బాటసారులు చూసి అనాథాశ్రమంలో చేర్చగా, ప్రస్తుతం కోలుకుంటుంది. కన్నతల్లులపై కనికరం లేని ఆ కుమారుల తీరు సభ్యసమాజం అసహ్యించుకుంటుండగా, తగిన గుణపాఠం చెప్పాలంటూ ఆ తల్లులు వేడుకుంటున్నారు.

కేసముద్రంను కమ్మేసిన మంచు దుప్పటి

వేగం తగ్గిన రైళ్లు

కేసముద్రం, జనవరి 5: దట్టమైన పొగమంచుతో శనివారం కాజీపేట- విజయవాడ సెక్షన్‌లో పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను వేగం తగ్గించి నడిపారు. ఉ. 7 గం. నుండి 9 గం. వరకు మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలో దట్టమైన పొగమంచు కప్పేసింది. దీనితో కనీసం పది మీటర్ల దూరం కూడా స్పష్టంగా కనిపించని పరిస్థితి ఏర్పడింది. ఫలితంగా డ్రైవర్లకు సిగ్నల్ సరిగా కనిపించకపోవడంతో ఆ సమయంలో గంటకు గరిష్ఠంగా 110 కిలోమీటర్ల వేగంతో నడవాల్సిన పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను 60 కిలోమీటర్లకు తగ్గించి నడిపించినట్లు రైల్వే వర్గాలు వెల్లడించాయి. దీనితో ఉదయం పూట విజయవాడ నుండి కాజీపేట వైపు, కాజీపేట నుండి విజయవాడ వైపు వెళ్లే రైళ్లు నిర్ణీత సమయానికి అరగంట నుండి గంట పాటు ఆలస్యంగా నడిచాయి.


శనివారం ఉ. 9 గంటల సమయంలో కేసముద్రం రైల్వే స్టేషన్లో పొగమంచు

సమ్మెతో కేంద్రం కళ్లు తెరిపిస్తాం

- 8, 9న దేశవ్యాప్తంగా కార్మికుల సమ్మె
- ప్రధాని మోదీ కార్మిక వ్యతిరేకి
- దిగిరాకుంటే బీజేపీని ఓడించడం తథ్యం
- ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 5: ప్రధానమంత్రి నరేంద్రమోదీ కార్మిక వ్యతిరేకి అని దేశంలో కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ఆయన శ్రద్ధ కనపరచడంలేదని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి ఆరోపించారు. శనివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ కార్మిక సంఘాల నేతలతో ఆయన బేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో సంజీవరెడ్డి మాట్లాడుతూ ఈ నెల 8,9వ తేదీల్లో దేశవ్యాప్తంగా కార్మికులు సమ్మెకు దిగుతున్నారని వెల్లడించారు. గత నాలుగేళ్లుగా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరంగా కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేసినా పెడచెవిన పెట్టిందని ఆరోపించారు. దేశంలోని ప్రధానంగా దాదాపు పది ట్రేడ్‌యూనియన్లు, వాటికి అనుబంధంగా ఉన్న వందలాది కార్మిక సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రవేట్ పరం చేసి వాటిని ధనవంతుల చేతుల్లో పెట్టి కార్మికుల పొట్టగొట్టడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తుందని విమర్శించారు. రోజురోజుకు నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయని కానీ కార్మికుల కనీస వేతన చట్టం మాత్రం అమలు కావడంలేదన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో వాటాల అమ్మకాన్ని తక్షణమే ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా ప్రధాని మోదీ కార్మిక వ్యతిరేక విధానాలు అవలబిస్తూ కార్మికులను ముంచుతున్నారని ఆరోపించారు. ఈ సమ్మెలో దేశవ్యాప్తంగా దాదాపు నాలుగు కోట్లకుపైగా కార్మికులు పాల్గొననున్నారని దాంతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామని హెచ్చరించారు. సమ్మెతో కూడా మోదీ దిగిరాకపోతే మరో రెండు మూడు నెలల్లో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం కార్మిక లోకం బీజేపీని ఓడించడం తథ్యమని తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించని నరేంద్రమోదీ ప్రధానిగా ఉండడానికి వీలు లేదని కార్మికులంతా భావిస్తున్నారన్నారు. దేశంలో అంబానీ, ఆదానీలు మాత్రమే మోదీకి నాయకుల్లా కనిపిస్తున్నారని కార్మిక సంఘాలు ఎందుకంటూ అంటున్నారంటే మోదీ కార్మిక వ్యతిరేకి కాకపోతే మరేంటి అని ప్రశ్నించారు. నీమ్ చట్టాన్ని తెచ్చిన మోదీ దేశంలోని కార్మికులకు తీవ్ర నష్టం చేకూర్చారని ఆ చట్టం ద్వారా రెగ్యూలర్ ఉద్యోగులు అంటూ ఉండరని తెలిపారు. కోట్లాది మంది కార్మికుల హక్కులను కాలరాయడం దుర్మార్గం అని సంజీవరెడ్డి మండిపడ్డారు. సమ్మెలో కార్మికులందరు పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ నాయకుడు కురుమూర్తి, ఐఎఫ్‌టీయూ నాయకుడు వెంకటేష్, ఐఎన్‌టీయూసీ నేతలు వెంట్రామిరెడ్డి, రాములు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు సంజీవరెడ్డి

భూ'గర్భ' కోత!

- అడుగంటిపోతున్న భూగర్భ జలాలు
- దేవరకొండ డివిజన్‌లో -5.21 మీటర్ల లోతులో నీళ్లు

ఆంధ్రభూమి బ్యూరో

నల్లగొండ, జనవరి 5: వర్షాభావం.. 24 గంటల ఉచిత విద్యుత్, తరిగిపోతున్న నీటి నిల్వ వనరుల నేపథ్యంలో నల్లగొండ జిల్లాలో భూగర్భ జల వనరులు వేగంగా అడుగంటిపోతున్నాయి. గిరిజన ప్రాంతమైన దేవరకొండ రెవెన్యూ డివిజన్‌లో మరీ దారుణంగా నీటి మట్టాలు పడిపోతున్న తీరు ఆందోళనకరంగా మారింది. జిల్లాలోని 31 మండలాల్లో 16 మండలాల్లో భూగర్భ జలమట్టం పడిపోగా, జిల్లాలో 2017 డిసెంబర్‌తో పోల్చితే -4.06 మీటర్లకు పడిపోయాయి. 2017 డిసెంబర్ నెలలో జిల్లా భూగర్భ జలమట్టం సగటు 9.13 మీటర్లుగా ఉండగా 2018 డిసెంబర్‌లో 13.19మీటర్ల లోతుకు పడిపోయాయి. ఇక దేవరకొండ రెవెన్యూ డివిజన్‌లో -5.21 మీటర్ల లోతుకు భూగర్భ జలమట్టం పడిపోయింది. 2017 డిసెంబర్‌లో 12.12 మీటర్ల లోతులో ఉండగా గత డిసెంబర్‌లో -17.33 మీటర్ల లోతుకు పడిపోవడం రానున్న వేసవిలో భూగర్భ జల కొరత ప్రమాద ఘంటికలను చాటుతుంది. మిషన్ కాకతీయ కింద వందలాది చెరువుల పునరుద్ధరణ జరిగినప్పటికి 2018లో -44 మిల్లీమీటర్ల వర్షాపాతం లోటుగా ఉండటం, చెరువులు, కుంటలు నిండే స్థాయిలో వర్షాలు లేకపోవడంతో భూగర్భ జల మట్టం వృద్ధికి అవకాశం లేకుండా పోయింది. దీనికి తోడుగా 2018 వేసవిలో రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవ్వడం, 24గంటల ఉచిత విద్యుత్‌తో రైతులు విచ్చలవిడిగా మోటార్లతో భూగర్భ జలాలు తోడేస్తుండటంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పాతాళగంగ కోసం ప్రజలు, రైతులు తాగుసాగునీటీ అవసరాలకు వందల అడుగుల లోతుకు బోర్లను వేస్తున్నా చాలవరకు బోర్లు ఫెయిలవుతూ ఆర్థికంగా చితికిపోతున్నారు. భూగర్భ జలమట్టం పతనం ఇలాగే కొనసాగితే సెమి ఎరైడ్ జోన్ (ఎడారి లక్షణాలు)లో ఉన్న జిల్లా కొన్నేళ్లలోనే ఎరైడ్ జోన్ లోకి వెళ్లనుందన్న నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


కాళేశ్వరం ప్రాజెక్టు పనుల వివరాలను అడిగి తెలుసుకుంటున్న స్మితా సబర్వాల్

వేగం పెంచండి

- సమన్వయంతో జూన్‌లోగా పనులు పూర్తిచేయాలి
- ఖరీఫ్‌లోగా కోటి ఎకరాలకు సాగునీరు అందించాలి
- ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్

ఆంధ్రభూమి బ్యూరో

కరీంనగర్, జనవరి 5: కాళేశ్వరం ప్రాజెక్టు పనుల్లో వేగం పెంచి కోటి ఎకరాలకు వచ్చే ఖరీఫ్ సీజన్‌లోగా సాగునీరు అందించాలనే సీఎం కేసీఆర్ కళల స్వప్నాన్ని నిజం చేసేందుకు అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేయాలని ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్ అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని లక్ష్మీపూర్ గ్రామ కాళేశ్వరం ప్రాజెక్టు ప్యాకేజీ ఎనిమిది పనులను శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పంపు హౌస్ పనుల నిర్మాణం, అండర్ టన్నెల్ పనుల ప్రగతిని ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు పనులు శరవేగంతో పూర్తి చేసి కోటి ఎకరాల మాగాణిగా చేయాలనే సీఎం కేసీఆర్ సంకల్పానికి అధికారులు చేయూత అందించాల్సిన అవసరం ఉందన్నారు. కోటి ఎకరాలకు సాగునీరే లక్ష్యంగా నిర్మిస్తున్న కాళేశ్వరం పనులను ఇంజనీర్లు, ఏజెన్సీలు సమన్వయంతో పనుల్లో వేగం పెంచి జూన్ మాసం లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. గత రెండు నెలలు ఎంత మేరకు పని జరిగింది అంచనావేస్తూ మిగిలిన పనులు వేగవంతంగా పూర్తి చేయుటకు, కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు కదలాలన్నారు. ప్రతి రోజు ఎంత పని జరిగింది ఇంకా చేయాల్సింది ఏ మేరకు మిగిలి ఉంది సమీక్షించుకోవాలని సూచించారు. మూడు నెలలు చాలా క్లిష్టమైనవని ఎక్కువ కార్మికులు, అదనపు మిషన్లను ఏర్పాటు చేసుకుని 24గంటల పాటు పలును నిర్వహించేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి రోజు ప్రాజెక్టు పనులను హైదరాబాద్ నుండి సమీక్షిస్తామని తెలిపారు. వారానికి ఒక రోజు పనుల ప్రగతిని ప్రత్యక్షంగా తెలుసుకుంటామని వివరించారు. పనులు చేయటంలో సమస్యలు ఉంటే వెనువెంటనే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారం చూపిస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు పనులు ఖరీఫ్ సీజన్ (జూన్) నెలలోగా పూర్తి చేసేందుకు ఉన్న మిషనరీలు సరిపోతాయా.. ? కార్మికుల సంఖ్య ఇంకా ఏమైనా అవసరమా సరి చూసుకుని అదనపు మిషనరీలు, కార్మికులను తెప్పించుకోవాలని సూచించారు. ముందుగా ముఖ్యమంత్రి కార్యదర్శి స్మితా సబర్వాల్ జిల్లాలోని లక్ష్మీపూర్ నుండి ధర్మారం వరకు 15కిలోమీటర్లకుపైగా ఉన్న అండర్ టన్నెల్ (సొరంగ మార్గం) పనులను ఇంజనీర్లు, ఏజెన్సీలు, అధికారులతో కాలినడక ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయ ఓఎస్‌డి దేశ్‌పాండే, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల కలెక్టర్లు సర్ఫరాజ్ అహ్మద్, శ్రీదేవసేన, కాళేశ్వరం ప్రాజెక్టు ఛీఫ్ ఇంజనీర్ వెంకటేశ్వర్లు, ఎస్‌సీ సుధాకర్‌రెడ్డి, ఈఈ శ్రీధర్, ప్రాజెక్టు నిర్మాణ ఏజెన్సీ మెగా కన్‌స్ట్రక్షన్ చైర్మన్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఒక్కో గ్రామంలో ఆరేడుగురు

- పంచాయతీ ఎన్నికల్లో టీఆర్‌ఎస్ ఆశావహులు సై
- సర్పంచ్ స్థానాలపై పోటీ తీవ్రతరం
- రంగంలోకి దిగిన ఎమ్మెల్యేలు
- బుజ్జగింపుల పర్వం.. ససేమిరా అంటున్న నేతలు

ఆంధ్రభూమి బ్యూరో

మహబూబ్‌నగర్, జనవరి 5: గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు టీఆర్‌ఎస్ పార్టీలో సంఖ్య అధికమైంది. శాసన సభా ఎన్నికల్లో ఏకతాటిపైన కనిపించిన క్షేత్రస్థాయి టీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామపంచాయతీ ఎన్నికల సందడిలో గ్రూపుల కుంపట్లు ఏర్పడ్డాయి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 1684 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. అయితే గ్రామపంచాయతీ ఎన్నికలు కాబట్టి క్షేత్రస్థాయిలో నాయకులు సర్పంచ్ పదవులపై ఆశపెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. అయితే ఒక్కోగ్రామంలో ఐదారుగురు ఆశావాహులు ఉండడం వారంతా టీఆర్‌ఎస్‌కు చెందిన వారే కావడంతో గ్రామాల్లో టీఆర్‌ఎస్ నాయకులు ఎవరికి వారుగా గ్రూపులు కట్టుకుని ఎమ్మెల్యేల ముందు అనుచరగనంతో బలప్రదర్శనకు దిగుతున్నారు. నూతనంగా ఏర్పడ్డ గ్రామపంచాయతీల్లో సైతం పోటీ చేస్తామనే వారి సంఖ్య పెరుగుతుండం టీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలకు తలనొప్పి వ్యవహారంగా మారింది. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల, అలంపూర్, వనపర్తి, అచ్చంపేట నియోజకవర్గాల్లో పలు గ్రామపంచాయతీలో పోటీ అర్రడజన్‌కు పైగానే టీఆర్‌ఎస్ నాయకులు ఉంటామని తమకే ఎమ్మెల్యే మద్దతు తెలపాలని కొందరు టీఆర్‌ఎస్ నాయకులు ఎమ్మెల్యేల ముందు బలప్రదర్శనలకు దిగుతున్నారు. ఒక్కతాటిపై ఉన్న టీఆర్‌ఎస్ కార్యకర్తలు గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో వారి మధ్య గ్రూపుల తంటా తెచ్చిపెట్టిందని టీఆర్‌ఎస్ నాయకులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. గ్రామాల్లో టీఆర్‌ఎస్ నాయకుల మధ్య నెలకొన్న ఇలాంటి పరిస్థితులను చక్కదిద్దేందుకు ఎమ్మెల్యేలు రంగంలోకి దిగారు. పలు గ్రామాల్లో ఆరేడుగురు సర్పంచ్ అభ్యర్థులు పోటీ పడుతుండడంతో వారిని ఎలాగైనా బుజ్జగించి ఒకరు మాత్రమే పార్టీ బలపరిచిన అభ్యర్థులుగా ఉండేలా ఎమ్మెల్యేలు బుజ్జగింపుల పర్వానికి దిగారు.

కమ్యూనిస్టుల కలహం.. తెరాసకు వరం!

'అర్జునా.. వినుము.. యుద్ధంలో చంపెడివాడు ఒకడు, చచ్చెడివాడు మరొకడును కాడు..'-అని శ్రీకృష్ణుడు తన గీతోపదేశంలో చెప్పాడు. ఎన్నికల సమరంలోనూ ఓడే వాడొకడు, ఓడించేవాడు మరొకడు లేడు. ఎవరికివారే తమనుతాము ఓడించుకుంటున్నారు. ఇటీవల తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులు తమను తామే ఓడించుకున్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో కమ్యూనిస్టులు ఖాయంగా గెలిచే సీట్లు సైతం తెరాసకు దక్కాయి. కమ్యూనిస్టులకు అనాదిగా స్పష్టమైన ఒక ఆర్థిక సిద్ధాంత ప్రాతిపదిక ఉంది. తెరాస మాత్రం ప్రాంతీయ అభిమానం, సెంటిమెంట్‌పై ఆధారపడి గెలిచింది.

కాంగ్రెస్ అత్యాశకు పోయి అవలీలగా గెలువగలిగిన దాదాపు పాతిక సీట్లను చేజేతులా పోగొట్టుకుంది. కాంగ్రెస్ సీనియర్ నేత గులాం నబీ అజాద్ హైదరాబాద్ వచ్చి మజ్లిస్ నేత అసదుద్దీన్ ఒవైసీని కలుసుకొని- 'ముస్లింలంతా కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలి' అని వేడుకున్నా ఫలితం లేకపోయింది. తెలంగాణ ఎన్నికల్లో ముస్లింలు మూకుమ్మడిగా తెరాసకు ఓట్లు వేశారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో బిజెపి అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి వెయ్యి ఓట్ల తేడాతో ఓడిపోయాడు. కొన్నిచోట్ల టిఆర్‌ఎస్ వందల ఓట్ల స్వల్ప ఆధిక్యతతో గెలిచింది. హైదరాబాద్‌లో శివసేనకు అడ్రస్ లేకున్నా, బిజెపికి వ్యతిరేకంగా అభ్యర్థులను నిలబెట్టి పరిమితంగా ఓట్లు చీల్చింది. రాజాసింగ్‌కు టిక్కెట్ ఇవ్వవద్దని బిజెపి స్క్రీనింగ్ కమిటీ వారించింది. చివరకు ఆయన గోషామహల్‌లో టిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలను తన స్వీయప్రతిభతో చిత్తుచేశాడు. 'నేను కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తానన్నా నన్ను ఆ పార్టీ ఉపయోగించుకోలేదు' అని ప్రజాగాయకుడు గద్దర్ చెప్పాడు. ఎన్నికలలో తాము గెలిస్తే కెసిఆర్ 'గడీ'ని బద్దలు చేస్తామని 'తెజస' అధినేత ప్రొఫెసర్ కోదండరాం చేసిన వ్యాఖ్య విపరీత ఫలితాలకు దారితీసింది.

★★★

బయోపిక్‌లను తీసి, సంచలనాలు సృష్టించటంలో సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ సిద్ధహస్తుడు. లోగడ ఆయన నిర్మించిన బయోపిక్‌లు ఆర్థికంగా విజయం సాధించకపోయినా వివాదాలను రేకెత్తించాయి. ఆయన ఇప్పుడు 'లక్ష్మీస్ ఎన్‌టిఆర్' పేరిట బయోపిక్ తీసేందుకు కసరత్తు ప్రారంభించాడు. ఇందులో ఎన్‌టిఆర్ హీరో, లక్ష్మీపార్వతి హీరోయిన్, చంద్రబాబు విలన్. ఈ సినిమాకు సంబంధించి 'దగా-కుట్ర- కుట్ర' అనే ఒక పాట కూడా విడుదలైంది. ఈ ట్రయిలర్ ఆంధ్రప్రదేశ్‌లో సంచలనం సృష్టించింది. వర్మ దిష్టిబొమ్మలను తెలుగు తమ్ముళ్లు తగలబెట్టారు. అంటే వర్మ సినిమాకు అవసరమైన ప్రీ (ఫ్రీ) పబ్లిసిటీ లభించిందని అర్థం.

రాజకీయ నాయకులపై సినిమాలు రావటం లోగడ చాలాసార్లు చూశాం. దివంగత ప్రధాని ఇందిరా గాంధీ ఆత్మకథకు సంబంధించి 'ఆంధీ' అనే హిందీ వ్యంగ్య చిత్రం వచ్చింది. మహమ్మద్ బిన్ తుగ్లక్, మండలాధీశుడు, ఇద్దరు (తమిళం) వంటి చిత్రాలు లోగడ వచ్చాయి. వీటిలో కొన్ని సూపర్ హిట్ చిత్రాలు. ఇవాల్టి సంఘటన రేపటికి చరిత్ర అవుతుంది. ఎన్‌టిఆర్ అప్పుడే ఒక చారిత్రక పురుషుడు అయినాడు. ఆయన మీద 2019 జనవరిలో రెండు మూడు సినిమాలు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో వుంచుకుని విడుదల కాబోతున్నాయి. వాటి రిజల్ట్ ఎలా ఉంటుందో త్వరలోనే తేలుతుంది. ఒకటి మాత్రం నిజం! ఎవరు ఔనన్నా కాదన్నా ఎన్‌టిఆర్‌పై ఇందిరా గాంధీ, రాంలాల్, నాండెడ్ల భాస్కర్‌రావులు కుట్ర చేసిన మాట వాస్తవం కాదా? హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో ఎంఎల్‌ఎలను బంధించి క్యాంప్ రాజకీయాలు నిర్వహించిన మాట నిజం కాదా?? ఎన్టీఆర్‌కు అన్యాయం జరిగినప్పుడు చంద్రబాబును ఉభయ కమ్యూనిస్టు పార్టీ నాయకులు బహిరంగంగా బలపరిచారు. ఈ చరిత్రను ఈనాటికీ ఎవరూ మార్చలేరు. ఈ వాస్తవాలన్నీ ఎన్టీఆర్ బయోపిక్‌లలో చూపిస్తారా?

★★★

గత నెలలో సుమారు రెండు లక్షల మంది రామభక్తులు న్యూ ఢిల్లీ రామలీల మైదానంలో విరాట్ ప్రదర్శనను నిర్వహించారు. 'అయోధ్యలో రామ మందిరం నిర్మించండి' అని వారు కోరారు. అయోధ్య శ్రీరాముని రాజధాని, అక్కడ రామాలయం నిర్మించాలా? వద్దా?? అనేది దాదాపు 200 సంవత్సరాలుగా పెను సమస్యగా మారింది. క్రీ.శ.10వ శతాబ్దంలో గజినీ మహమ్మద్ గుజరాత్‌లోని సోమనాథ్ దేవాలయాన్ని, మధురలోని శ్రీకృష్ణ దేవాలయాన్ని ధ్వంసం చేశాడు. ఆ తర్వాత 15వ శతాబ్దంలో సమర్‌ఖండ్ నుండి వచ్చిన బాబర్ అయోధ్య రామాలయాన్ని ధ్వంసం చేశారు. 17వ శతాబ్దంలో ఔరంగజేబు కాశీలోని విశ్వేశ్వర దేవాలయాన్ని నేలమట్టం చేశాడు. 1775లో తిరుమల వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని దోచుకున్నారు. 1309లో మాలిక్ కాఫిర్ ఓరుగల్లులోని స్వయం భూ దేవాలయాన్ని, తమిళనాడులోని శ్రీరంగం, కర్నాటకలోని హళిబీడు, బేలూరు దేవాలయాలను ధ్వంసం చేశాడు. నాదిర్షా ఢిల్లీ వీధుల్లో ఓ



తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులు తమను తామే ఓడించుకున్నారు. ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల్లో కమ్యూనిస్టులు ఖాయంగా గెలిచే సీట్లు సైతం తెరాసకు దక్కాయి. కమ్యూనిస్టులకు అనాదిగా స్పష్టమైన ఒక ఆర్థిక సిద్ధాంత ప్రాతిపదిక ఉంది. తెరాస మాత్రం ప్రాంతీయ అభిమానం, సెంటిమెంట్‌పై ఆధారపడి గెలిచింది. 'నేను కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తానన్నా నన్ను ఆ పార్టీ ఉపయోగించుకోలేదు' అని గద్దర్ చెప్పాడు. ఎన్నికలలో తాము గెలిస్తే కెసిఆర్ 'గడీ'ని బద్దలు చేస్తామని 'తెజస' అధినేత కోదండరాం చేసిన వ్యాఖ్య విపరీత ఫలితాలకు దారితీసింది.

సాయంత్రం ముప్పదివేల మంది హిందువులను సంహరించాడు. గజనీ మహమ్మద్ సుమారు 50వేల మంది బ్రాహ్మణులను సోమనాథ్ దేవాలయం పరిసరాల్లో హత్యచేసి సోమనాథ శివలింగాన్ని ముక్కలుగా చేసి, వాటిని మసీదుకు మెట్లుగా వాడుకున్నాడన్నది చరిత్ర. ఈ దారుణాలను ఎవరూ కాదనలేరు. అంతా సెక్యులరిస్టులే- అంటే హిందూ ద్వేషులే. ఇండియా ఉప్పు తింటూ పాకిస్తాన్, చైనాలకు కొందరు ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. 'సైన్యాన్ని ఐదు నిమిషాలు పక్కన పెట్టండి- మా తడాఖా ఏమిటో చూపిస్తాము'- అని మజ్లిస్ నేత హెచ్చరించడం ఇటీవలి సంఘటనయే. పాకిస్తాన్ జైళ్లలో మగ్గుతున్న అమాయక భారతీయ జాలర్ల మాటేమిటి? కులదీప్ యాదవ్ ఏమయ్యాడు? పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రపంచం చేత గుర్తింపజేయటంలో ఐక్యరాజ్యసమితి దారుణంగా విఫలమైంది.

★★★

తెలంగాణలోని మిర్యాలగూడలో ఇటీవల ఒక సంఘటన జరిగింది. వైశ్యకులానికి చెందిన అమ్మాయిని క్రైస్తవ మతస్థుడు వివాహం చేసుకున్నాడు. మతాంతర వివాహం చేసుకుందని ఆగ్రహించి ఆ అమ్మాయి తండ్రి వరుణ్ణి హత్యచేయించాడు. నాగరికత పెరిగిన 21వ శతాబ్దంలో ఇలాంటి పరువు హత్యలు ఎందుకు జరుగుతున్నాయి? కులాంతర, మతాంతర దేశాంతర వివాహాలు జరుగుతున్న కాలంలో ఈ కల్లోలం ఏమిటి? ఎవరైనా లోతుగా పరిశీలించారా? కళాశాలలోనో, ఉద్యోగం చేసే చోటో ఇరువురు పరస్పరం ప్రేమించుకుంటారు. అసలు సమస్య వివాహం తర్వాత మొదలవుతుంది. ఎవరి ఆహారపు అలవాట్లు, ఎవరి మత విశ్వాసాలు వారివి. అంటే క్షణికమైన ఆవేశాలు తగ్గిన తర్వాత వాస్తవం కళ్లముందు కఠోరంగా కన్పడుతున్నది. ఇదే కులాంతర మతాంతర వివాహాల వైఫల్యానికి కారణం. దీనిపై సామాజిక శాస్త్రవేత్తలు లోతైన అధ్యయనం చేయాలి.

★★★

సెక్యులర్ మేధావిగా చలామణి అవుతున్న కంచె ఐలయ్య ఒక వ్యాసంలో- '2019లో నరేంద్ర మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే భారతదేశంలో ఇక ఎన్నికలు అనేవి లేకుండా చేస్తాడు' అని రాశాడు. ఐలయ్య భాజపాపై ఎందుకింత విషం చిమ్ముతున్నాడు? మోదీ ఓటమిని ఎందుకింతగా కోరుకుంటున్నాడు? ఇతనికి కొలరాడో (అమెరికా) నుండి మతం మార్పిడులకు నిధులు వస్తున్నాయి. అంటే ఆయన అమెరికా ఏజెంట్. నరేంద్ర మోదీ అధికారంలో ఉండటం అమెరికా, పాకిస్తాన్, చైనాలకు ఇష్టం లేదు. మతం మార్పిడుల కోసం విదేశాల నుండి భారత్‌లోని క్రైస్తవ సంస్థలకు వస్తున్న నిధులపై మోదీ ప్రభుత్వం ఆంక్షలు విధించడమే ఐలయ్య ఆగ్రహానికి అసలు కారణం.

★★★

కర్నాటకలోని మాండ్యా జిల్లాలో జెడిఎస్ పార్టీకి చెందిన ప్రకాశ్ అనే కార్యకర్తను ఎవరో హత్య చేయటం గొడవలకు దారితీసింది. కర్నాటకలో రైతు బంధు దేవగౌడ సుపుత్రుడు హెచ్.డి.కుమారస్వామి ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నారు. 225 మంది ఎమ్మెల్యేలున్న శాసనసభలో ముప్పది స్థానాలు కూడా లేని జనతాదళ్ (సెక్యులర్) పార్టీకి చెందిన ముఖ్యమంత్రిగా కుమారస్వామి పాలనా పగ్గాలు చేపట్టారు. కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చి ఇతనితో ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది. కుమారస్వామి అధికారంలోకి వచ్చిన కొద్దినెలల్లోనే 400 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నట్లు గణాంకాలు నిరూపిస్తున్నాయి. ఇటీవల కుమారస్వామి ఇలా అన్నారు..'పోలీసు అధికారులారా? వెళ్లి అక్కడ నిరసన తెలుపుతున్న వారిని నిర్దాక్షిణ్యంగా ఎన్‌కౌంటర్ చేయండి. ఎటువంటి 'లా అండ్ ఆర్డర్' సమస్య వచ్చినా నేను చూచుకుంటాను. సాక్షాత్తూ కర్నాటక ముఖ్యమంత్రి ఇలా పోలీసులను ఉసిగొల్పుతుంటే- మానవ హక్కుల సంఘాలు, దేశభక్తులైన మన మహానేతలు ఏం చేస్తున్నారు? అయినదానికీ కానిదానికీ కొవ్వొత్తులతో ఊరేగింపులు జరిపి భాజపా పాలిత రాష్ట్రాల్లో ఆందోళనలను చేసే 'ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్' కార్యకర్తలు కుమారస్వామి వ్యాఖ్యలను మాటవరసకైనా ఎందుకు ఖండించలేదు? అఫ్జల్‌గురు అనే నరహంతకుణ్ణి పాతికేళ్ల విచారణ తరువాత ఉరితీస్తే- 'అది దుర్మార్గం' అంటూ ఊరేగింపులు జరిపిన ఏచూరి సీతారాంలు, కన్హయకుమార్‌లు ఇపుడు ఎందుకు నోరుమూసుకొని ఊరుకున్నారు? ఎందుకంటే కుమారస్వామి కాంగ్రెసు అండదండలతో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి కాబట్టి!

★★★

ఇంతకూ హనుమంతుడు ఎవరు? ఆయన కులం ఏమిటి? ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హనుమంతుడు ఆదివాసీ దళితుడు అని అన్నారు. ఆయన మంత్రివర్గంలోని క్రీడాశాఖామాత్యుడు లక్ష్మీనారాయణ చౌదరి హనుమంతుణ్ణి జాట్ కులస్థుడని పేర్కొన్నారు. బిజెపి ఎంఎల్‌సి భుక్కల్ నవాబ్ మాత్రం హనుమంతుడు ముస్లిం అని తేల్చేశారు. ఇలా ఇష్టానుసారం నేతలు వ్యాఖ్యానించడాన్ని మధురకు చెందిన శంకరాచార్య ఖండించారు. ఇంతకూ హనుమంతుడు ఎవరు? ఇతడు దక్షిణాది బ్రాహ్మణుడు. నవ వ్యాకరణ పండితుడు. ఇంకా చెప్పాలంటే తెలుగువాడు. రామాయణంలో ఇందుకు ఆధారాలున్నాయి. హనుమంతుడు త్రేతాయుగానికి చెందినవాడు. ఇస్లాం పుట్టి 1400 సంవత్సరాలు అయింది. అలాంటప్పుడు హనుమంతుడు ముస్లిం ఎట్లా అవుతాడు? ఆకాశంలో స్వాతి నక్షత్రం ఎర్రగా ఉంటుంది. 'స్వాతి ప్రవాళం ఏకం' అన్నారు పెద్దలు. ఇది వాయుదైవత్వం కలది. అంటే హనుమంతుడిని వాయుపుత్రుడు అనడం ప్రతీకాత్మకం. త్రేతాయుగంలో వేదాధ్యయనం చేసినవాడు బ్రాహ్మణుడే కానీ ముస్లిం ఎట్లా అవుతాడు?

-ప్రొ. ముదిగొండ శివప్రసాద్

కొత్త తరాలొచ్చాయ్..
తిలకించండి కామ్రేడ్స్!

పాతికేళ్లకో కొత్తతరం తమ సత్తా చాటుతుంది. నూతన ఆలోచనలతో ప్రపంచాన్ని తమతో తీసుకెళుతోంది. తరాల మధ్య అనేక అంశాలలో వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో వందేళ్ల క్రితపు 'డైనమిక్స్' అంతే శక్తిమంతంగా పనిచేస్తాయని అనుకోవడం అమాయకత్వం. ఈ ప్రాథమిక సత్యం జీవితంలోని అన్ని పార్శ్వాలకు అన్వయమవుతుంది. దీన్ని విస్మరించి పాత పద్ధతులను అనుసరిస్తే ప్రాసంగికతను కోల్పోవడం తప్ప ఇంకేమీ జరగదు. ఇంత స్పష్టంగా పరిస్థితి కళ్లకు కడుతున్నా- మొదటి పారిశ్రామిక విప్లవ కాలం నాటి డైనమిక్స్, వైరుధ్యాలు నాల్గవ పారిశ్రామిక విప్లవ కాలంలోనూ కొనసాగుతాయని ఊహించడం, కాలానుగుణంగా కార్యక్రమాలకు రూపకల్పన చేయడం విషాదం గాక ఏమవుతుంది? దురదృష్టవశాత్తూ దేశంలో మార్క్సిజం ఇప్పటికీ అంతే ప్రాసంగికమని విశ్వసించే పార్టీలున్నాయి. అందులో ప్రమాదకరమైన పార్టీ మావోయిస్టు పార్టీ.

మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని పరిశీలించకుండా జరిగిన, జరుగుతున్న అభివృద్ధిని అంచనా వేయకుండా, మారిన డైనమిక్స్‌ను పసిగట్టకుండా వందేళ్ల పూర్వపు ఆలోచనలకు, భావజాలానికి జీవన విధానానికి పట్టం కడదాం రండి.. రారండోయ్.. అని తుపాకులు, మందుపాతరలు పేలిస్తే ఏమైన అర్థం ఉందా..? రెండు వందల ఏళ్ల క్రితపు వ్యవసాయం, వాణిజ్యం-వ్యాపారం, పారిశ్రామిక పరిస్థితులకు ప్రభావితమై 'సమతుల్యత' సాధించేందుకు కారల్ మార్క్స్ చేసిన సూత్రీకరణలు వర్తమానంలోనూ ఉపకరిస్తాయనుకోవడం, వాటిని అన్వయించుకోవడం, యథాతథంగా ఆచరణలో పెడతామనడం అత్యంత దారుణమైన సంగతి తప్ప మరొకటి కాదు. ఈ రెండువందల ఏళ్ళలో వ్యవసాయం, వాణిజ్యం-వ్యాపారం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, ప్రపంచాన్ని తిలకించే విధానం సంపూర్ణంగా మారిపోయిందన్న ఇంగిత జ్ఞానం లేకుండా ఆయుధాలతో, మందుగుండు సామగ్రితో సమాజంలో సమతుల్యత సాధిస్తామనుకోవడంలోని సహేతుకత ఏపాటిదో ఎవరికివారే ఆలోచించవచ్చు. వైరుధ్యాలు మారాయి, డైనమిక్స్ మారాయి. ఉత్పత్తి విధానం, పంపిణీ విధానం పూర్తిగా మారింది. సంపద సృష్టి విధానం మారింది. ఇంత మారినా పట్టించుకోకుండా, సుత్తి-కొడవలి పనిముట్ల దగ్గరే ఆలోచనలను స్తంభింపజేసి అడుగు ముందుకేయాలనుకోవడం అభాసుపాలు కావడం తప్ప మరొకటి కాదు.

ఏ కాలంలోనైనా సంపద సృష్టి- పంపిణీ అనేది కీలకం. సంపద సృష్టి రెండువందల ఏళ్ల క్రితం ఓ రీతిన ఉంది. ప్రస్తుతం పూర్తిగా కొత్త రూపంలో



కనిపిస్తోంది. నేడు కృత్రిమ మేధ ప్రాబల్యం అధికంగా కనిపిస్తోంది. రెండువందల ఏళ్ల క్రితం అంటే మార్క్సిస్టు మూల సూత్రాల ప్రతిపాదన సమయంలో మానవుని 'చెమట'కు అధిక ప్రాధాన్యమున్నది. సంపద ఆ చెమట-నెత్తురు ఆధారంగా ఎక్కువ సృష్టింపబడింది. ప్రస్తుతం ఆ సన్నివేశం తారుమారైంది, ఆ 'దృశ్యం' మారింది. సంపద సృష్టి మేధ- కృత్రిమ మేధ ఆధారంగా జరుగుతోంది. అతి కీలకమైన ఈ 'మార్పు'ను గుర్తించకుండా అంతే సాంద్రతతో మార్క్స్ సూత్రీకరణలను అమలులోకి, ఆచరణలోకి తీసుకొస్తామని ఉబలాటపడితే బొక్కబోర్లా పడటం తప్ప మరొకటి ఉండదు. వాస్తవానికి ప్రపంచమంతటా మార్క్సిజం విఫలమైన సన్నివేశం స్పష్టంగా కనిపిస్తున్నా భేషజాలకు పోయి ఆ దృశ్యాన్ని చూసేందుకు నిరాకరిస్తూ అంతా తమ విశ్లేషణ- విగండింపు ప్రకారమే కొనసాగుతోందని, తమ 'నడక'ను మార్చుకోవలసిన అవసరం లేదని వారు వాదించడం విడ్డూరం గాక ఏమవుతుంది?

మావోయిస్టులైతే మరింత మొరటుగా దండకారణ్యంలో దండు నిర్మించి రక్తం కళ్ల జూసుకుంటూ రెండువందల ఏళ్ళ క్రితం డైనమిక్స్ ఆధారంగా రూపొందిన సూత్రాలకు వాస్తవ రూపం ఇస్తామని కంకణం కట్టుకోవడం ఎంతటి అజ్ఞానమో ఇట్టే అర్థమవుతోంది. ప్రజల సంక్షేమం- అభివృద్ధికి అంకితమై పనిచేయలసిన విప్లవ పార్టీ ఇలా రెండువందల ఏళ్ళ క్రితపు ఆలోచనల ఆధారంగా ఏర్పడిన సిద్ధాంతాలను, సూత్రాలను సజీవంగా నిలిపేందుకు పాటుపడతామని, రక్తం చిందిస్తామని సమాజాన్ని సమూలంగా మారుస్తామని ప్రతిజ్ఞచేస్తే ఏమిటి ప్రయోజనం?

వాస్తవానికి సమాజం సమూలంగా మారిపోయింది. దాన్ని చూడకుండా, పట్టించుకోకుండా, తమ హింస- విధ్వంస చర్యల ఆధారంగా మాత్రమే సమాజం మారాలి.. అదే నిజమైన మార్పు అనుకోవడం సంకుచితత్వం తప్ప మరొకటి కాదు. అది ప్రపంచాన్ని, ప్రజల్ని అర్థం చేసుకోలేనితనం. ఆ వితండవాదం వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. సమాజగతిని, చలన గతిని సరైన రీతిలో అర్థం చేసుకోలేని మార్క్సిస్టులు, మావోయిస్టులు ఈ సమాజాన్ని ఎలా మారుస్తారు? ఆ పరికరాలు వారిదగ్గర లేవని ఎప్పుడో చేతులెత్తేశారు. తమ ఊహకు, అంచనాకు మించి సమాజం ఎదిగి అందనంత ఎత్తులను తాకింది. ఈ నేపథ్యంలో ప్రేక్షక పాత్ర పోషించడం తప్ప దాన్ని సమూలంగా మార్చే నైపుణ్యం- శక్తి- యుక్తి సృజనాత్మకత ఏవీ వారిలో లేవని కాలమే నిరూపించింది. జర్మనీలో 'బెర్లిన్ గోడ' కూలిన దృశ్యాన్ని- వైనాన్ని చూసేందుకు ఇష్టపడక ఇంకా ఆ శిథిలాలలో మార్క్సిజాన్ని వెతికి దానికి ఆక్సిజన్ అందించి నిలబెట్టాలని చూడడం హాస్యాస్పదం తప్ప మరొకటి కాదు. రష్యాలో లెనిన్ విగ్రహాలను క్రేన్ల సాయంతో తొలగించడాన్ని, చైనాలో తియాన్మన్ స్క్వేర్ వద్ద విద్యార్థులు, యువకులు సైనిక ట్యాంకులకు ఎదురొడ్డి ప్రజాస్వామ్యం కోసం నినదించిన ఉక్కు సంకల్పాన్ని, సంస్కరణల భావాన్ని చూసేందుకు తిరస్కరిస్తే ఏమిటి ప్రయోజనం? భారతదేశంలో ఎక్కడైతే నక్సల్‌బరి ఉద్యమం ప్రారంభమైందో అక్కడ ఇప్పుడు ప్రజలు సహజీవనం సాగిస్తున్నారు. అక్కడి పొలాలు సస్యశ్యామలంగా తులతూగుతున్నాయి. ప్రజల చేతికి ఓటు అనే పాశుపతాస్త్రం లభించింది. తాజాగా 'సెల్‌ఫోన్' దొరికింది. సాధికారతతో జీవించేందుకు ఆసరా అందుబాటులోకి వచ్చింది. ప్రజలు ఏ కాలంలోనైనా కోరుకునేది ఇదే కదా? ఆ సాధికారిత తమ ముంగిళ్లలో కనిపిస్తుండగా మావోయిస్టులు మాత్రం ఇది బూటకపు ప్రజాస్వామ్యం, బూటకపు ఎన్నికలు కాబట్టి వీటిని త్యజించి సాయుధ పోరాటంలో ప్రాణాలను త్యాగం చేసి నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిస్తూ రాత్రి-పగలు ఆ పలవరింపుతోనే కాలం గడిపితే అదెలా ప్రాజ్ఞత అవుతుంది? నక్సల్‌బరి ఉద్యమం ప్రారంభించిన తరం అస్తమించింది. ఈ యాభై ఏళ్ళలో రెండు కొత్త తరాలొచ్చాయి. వారి ఆకాంక్షలు-ఆశలు, జ్ఞానం, చొరవ, ముందుచూపు అంతకుముందు తరాలకు సరిపోలవు. మరలాంటప్పుడు నక్సల్‌బరి ఉద్యమం సజీవంగా ఎలా ఉంటుంది? ఆ అవసరమే ఇప్పుడు లేదుకదా? ఆ విషయం అటు జర్మనీలో, ఇటు రష్యాలో, చైనాలో, నక్సల్‌బరిలో తేటతెల్లమయ్యాక ఇంకా మావోలు దండకారణ్యంలో 'రెడ్ కారిడార్' కలగనడం అన్యాయం.

మానవులను ప్రత్యర్థులుగా లేదా పక్కకునెట్టేసే సామర్థ్యం గల ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (కృత్రిమ మేధ) ఇప్పటికే తన విశ్వరూపం ప్రదర్శిస్తోంది. స్వయం చోదక వాహనాలు వచ్చేశాయి. చదరంగంలో మానవుడినే ఓడించిన కృత్రిమమేధ మనముందున్నది. మనిషిలా ప్రసంగించే హ్యూమనాయిడ్ రోబో 'సోఫియా' సంచలనం సృష్టిస్తోంది. అలాంటివి మరెన్నో రంగంలోకి రానున్నాయి. మిషన్ లెర్నింగ్ విధానం మరింత విస్తృతమైంది. రాబోయే రోజుల్లో ఈ రంగంలో జరిగే పరిణామాలు మార్క్సిస్టుల- మావోయిస్టుల ఊహలకు అందకుండా ఉన్నాయి. మానవుల ప్రయాణ వేగం పెరుగుతోంది. హైపర్ లూప్ ద్వారా ఇప్పటికే ఎంతో వేగంగా ప్రయాణించే సౌకర్యం ఏర్పడింది. ఇలాన్ మస్క్‌కు చెందిన 'స్పేస్ ఎక్స్' సంస్థ ప్రజలను మరో గ్రహం మీదకు తీసుకెళ్ళి తీసుకొచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తోంది. అంటే మరో గ్రహం ముఖ్యంగా అంగారక గ్రహంపై మానవ కాలనీలు ఏర్పడే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. ఇదే సమయంలో వ్యవసాయ రంగంలో, నూతన ఆవిష్కరణలతో, స్టార్టప్ సంస్థల ఆవిష్కరణలతో ఉత్పత్తిపెరిగి అశేష ప్రజానీకానికి ఆహారం అందించే కృషి విస్తృతంగా జరుగుతోంది. ఈ నూతన సంవత్సరంలో పుట్టిన పిల్లలు పాతికేళ్ళ తరువాత ఇప్పుడున్న పద్ధతులన్నీ కాలం చెల్లినవిగా భావిస్తారని నిపుణుల అంచనా. మరి 175 ఏళ్ల క్రితపు మార్క్స్ అధ్యయనాలు, సూత్రీకరణలు ఇప్పుడు కాలం చెల్లకుండా ఎలా ఉంటాయి కామ్రేడ్స్?

-వుప్పల నరసింహం 99857 81799

విలువల్ని పెంచేదే అసలైన విద్య

'నీలోని అత్యున్నత సామర్థ్యాన్ని వెలికి తీసేదే నిజమైన విద్య. మానవత్వమనే పుస్తకాన్ని మించిన పుస్తకం ఏముంటుంది?'
- మహాత్మా గాంధీ

మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దేది, మూర్తిమత్వాన్ని పెంపొందించేది, అంతర్గత శక్తులను బయటకు తీసేది, విలువలను పెంచేది, గమ్యాన్ని చూపిస్తూ మనస్సును సంపూర్ణంగా వికసించేటట్లు చేసేది, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది విద్య అని తరచుగా మనం చెప్పు కుంటున్నాం. విద్యాసంస్థల్లో ఏడాది పొడవునా బోధించిన విద్య ద్వారా ఎంతో కొంత విద్యా లక్ష్యాలు సాధిం చగలమని ఆశిస్తుంటే, పరీక్షల సమయంలో కొన్ని ప్రశ్నలు ఇచ్చి వాటికి పిల్లల్ని సంసిద్ధులుగా చేయడం ద్వారా వ్యక్తిత్వ వికాసం, వ్యక్తి నిర్మాణం జరుగుతుందని ఆశించడం అత్యాశే అవుతుంది. మరి అలాంటపుడు వేలకోట్ల రూపాయలతో నడుస్తున్న పాఠశాలలు ఏం సాధిస్తున్నట్లు? నేటి సమాజంలో టీవీ, సినిమాల వల్లనైతేనేమి, యాంత్రిక జీవితం వల్లనైతేనేమి అనేక సామాజిక రుగ్మతలతో సమాజం నిండి ఉంది. విద్యార్థులు క్షణికావేశానికి గురై తల్లిదండ్రులు తిట్టారనో, ఉపాధ్యాయులు మందలించారనో ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు మనం చూస్తున్నాము. దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే యువత అనర్థాలకు బలికావలసిందేనా? విద్యా విధానంలో మార్పులు, ప్రయోగాలు చేసి విద్యార్థులను మనం బలి తీసుకుంటున్నామా? ఆంగ్లమాధ్యమం, కార్పొరేట్ చదువుల వల్ల నేటి విద్యార్థి నిరంతరం తీవ్ర ఒత్తిడికి గురౌతున్నాడు. మానసిక బలహీనత, న్యూనతాభావం కూడా మరికొన్ని కారణాలు. స్థాయికి మించి తల్లితండ్రుల ఆకాంక్షలు, అవి తీర్చలేక పిల్లల వ్యధలు దాదాపు ప్రతి ఇంట్లో మనం చూస్తున్నదే.

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబంలో పిల్లలు తప్పు చేయడానికి అవకాశం తక్కువ. ఒక వేళ తప్పు జరిగినా పెద్దలు సరిదిద్దే వాళ్లు. కుటుంబ బంధాలు, మానవ సంబంధాలు బలంగా ఉన్న కాలంలో సామాజిక రుగ్మతలు తక్కువగా ఉండేవి. కానీ, నేటి యాంత్రిక జీవనంలో ప్రక్కవారితో కూడా కనీస సంబంధాలు లేని స్థితిలో తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగాలు చేయడం, పిల్లలను హాస్టళ్లలో ఉంచడం, మార్కుల టార్గెట్ పెట్టడం వంటి పరిస్థితులు విద్యార్థుల కారణాలుగా భావించాలి. పిల్లలు హాస్టల్‌లో, వృద్ధులు ఆశ్రమాల్లో ఉంటే- ఇక అనుబంధాల గురించి చెప్పేదెవరు?

యాంత్రిక జీవనంతో పిల్లలు సహజత్వాన్ని కోల్పోయి మానసిక బలహీనులవుతారు. సోషల్ మీడియా బాగా పెరిగి పోయి పక్క వారితో సైతం ఆత్మీయంగా మాట్లాడలేక పోతున్నారు. సినిమాలలో,సోషల్ మీడియాలో వచ్చే హింస, అశ్లీలత పిల్లల మనసులపై తీవ్రమైన ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. టీవీలలో వచ్చే అర్థం పర్థం లేని సీరియల్స్, బూతు కార్యక్రమాలు పిల్లల లేత మనసుల ఎదుగుదలపై ఎంతో అనర్థాన్ని కలిగిస్తున్నాయి. పెరిగిపోతున్న ఫ్యాషన్ వికృత పోకడల వల్ల చినిగిన డ్రెస్సులు, పొట్టి నిక్కర్లు, బిగుతైన బట్టల వల్ల మనిషి వ్యక్తిత్వం కొరవడుతుంది. మనకు అవసరం ఉన్నా, లేకపోయినా ఆధునికత పేరుతో అనవసర హంగామా చేయడం, చింపిరి జుట్టు, సగం కొట్టించుకున్న గుండు.. ఇవే ఈనాటి యువతరం పాటించే సూత్రాలు. చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేక పోవడం, తమ సమస్యలను



విలువలు అభివృద్ధి చెందే విధానం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. ఇరుకు గదుల్లో, ఐదారు అంతస్తుల బిల్డింగులలో విద్యార్థుల పుస్తకాలతో కుస్తీలు పడుతుంటే, ఆటలంటే కంప్యూటర్ ముందు కూర్చొని కాలక్షేపం చేయ డం అనుకుంటే విద్య విలువ తెలుస్తుందని ఆశించలేం. మనిషిలోని నైపుణ్యాన్ని వెలికి తీయడమే విద్య పని. చరిత్ర ఆరంభం నుంచి విద్య వికసిస్తూ, ఎన్నో విభాగాలు గా విస్తరి స్తోంది. సమాజం అభివృద్ధి ప్రజల విద్యావివే కాలపై ఆధారపడి ఉంటుంది.

ఎవరికి చెప్పుకోవాలో తెలియక, సగం సగం తెలిసిన వారితో ముచ్చటించడం... ఇలాంటి పరిస్థితిలో ఉన్నత విద్యలు చదివి పట్టాలు ఎన్ని పొందినా, వారిలో విలువలు నశించి వికృతంగా ప్రవర్తించడం. సహనం కోల్పోయి రకరకాల అఘాయిత్యాలకు పాల్పడడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం.

సమాజానికి, తల్లితండ్రులకు నిజమైన విద్య అంటే ఏమిటో తెలియకపోవడమే అసలు సమస్య. ఈ మధ్య కాలంలో విద్య విలువని మనం భూమి విలువ తోనో, స్టాక్ ఎక్స్ఛేంజ్ షేర్ల తో వ్యాపారం చేసే విధంగానో బేరీజు వేస్తున్నాం. మంచి ఉద్యోగం తెచ్చిపెట్టే విద్యనే మనం ప్రోత్సహిస్తున్నాము. విలువలు అభివృద్ధి చెందే విధానం గురించి ఎవరూ ఆలోచించడం లేదు. ఇరుకు గదుల్లో, ఐదారు అంతస్తుల బిల్డింగులలో విద్యార్థుల పుస్తకాలతో కుస్తీలు పడుతుంటే, ఆటలంటే కంప్యూటర్ ముందు కూర్చొని కాలక్షేపం చేయడం అనుకుంటే విద్య విలువ తెలుస్తుందని ఆశించలేం.

మనిషిలోని నైపుణ్యాన్ని వెలికి తీయడమే విద్య పని. చరిత్ర ఆరంభం నుంచి విద్య వికసిస్తూ, ఎన్నో విభాగాలుగా విస్తరిస్తోంది. సమాజం అభివృద్ధి ప్రజల విద్యా వివేకాలపై ఆధారపడి ఉంటుంది. విద్య వెలుగునిస్తుంది. విద్య వివేకాన్నిస్తుంది. దీనిని భారతీయ సమాజం ఆదినుండి గుర్తించినది, తొలినాళ్ళనుండి విద్యకు చక్కని ప్రాముఖ్యత ఉన్నది. పురాతన కాలంలో విద్యను మనిషి మూడవ కన్నుగా భావించారు. జ్ఞానానికి మార్గముగా ఈ చదువును భావించారు. ఆనాటి విద్య యొక్క చివరి లక్ష్యం ఆత్మ సాక్షాత్కారం. కానీ తక్షణ గమ్యం మాత్రం తమ అభిరుచులకు, శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా ఉపాధి పొంది, సమాజానికి తమ వంతు సహాయం చేయడం. విద్య జీవితానికి వెలుగునిస్తుందని, అది లేనివాడు గుడ్డివాళ్లతో సమానమని భావించేవాళ్ళు. విద్యను వారు చాలా గౌరవంగా భావించారు. విద్య అనేది జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది, తల్లిలాగా పోషిస్తుంది, తండ్రిలా మార్గదర్శిలా నిలుస్తుంది, ప్రాణ స్నేహితునిలా ఆదరిస్తుంది. కీర్తిని సంపాదిస్తుంది, కష్టాలు తొలగిస్తుంది, స్వచ్ఛమైన వ్యక్తిత్వాన్ని ప్రసాదిస్తుంది, నాగరికునిగా మారుస్తుంది. కనుకనే విద్యను కల్పవృక్షంగా మనం భావిస్తాం.

బ్రిటీషు వారి కాలంలో భారత దేశ విద్యావ్యవస్థలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చినాయి. ముఖ్యముగా రెండు మార్పులు మనం చెప్పుకోవాలొ ఒకటి అప్పటివరకూ ఎన్ని మార్పులు జరిగినా భారతదేశంలో విద్యావ్యవస్థ మతప్రధానమైనదిగానే ఉండేది. అయితే హిందూ మతం, బౌద్ధ మతం లేదా ముస్లిం మతం. కానీ బ్రిటీషు వారు వచ్చిన తరువాత భౌతిక విద్యకు ప్రాధాన్యం పెరిగినది, వేదాలు చదవడం మానేసి ప్రజలు సైన్సు మొదలగున్నవి చదవడం మొదలుపెట్టినారు. ఇక రెండవ ముఖ్యమైన మార్పు ఇంగ్లీషు భాషలో విద్యా బోధన, అప్పటివరకు వివిధ భారతీయ భాషలలో ముఖ్యంగా సంస్కృతంలో లేదా అరబిక్ లేదా ఉర్దూలలో జరిగే విద్యా బోధన ఇంగ్లీషుభాషలోనికి మారింది. పాలకుల ఆర్థిక సహాయం కేవలం ఇంగ్లీషు బోధించే పాఠశాలలకే లభించేది. దాంతో ఇంగ్లీషుకు ప్రాముఖ్యత పెరిగింది. బ్రిటీషు వారు విద్యావిధానంలో ఎన్నో కమిటీలు వేసినారు, ఎన్నో సంస్కరణలకు ప్రయత్నించారు. కానీ వారు భారత దేశాన్ని వదిలే సమయానికి దేశంలో అక్షరాస్యత పది శాతం కూడాలేదు. దీనికి కారణం పరిశీలిస్తే మొదటిది వారికి తర్జుమా చేయడానికి , సంధానకర్తలుగా ఉండడానికి, వారికి అనుకూలంగా ఉండే వారికి మాత్రమే చదువుకునే అవకాశం ఇవ్వగా, రెండవది వారు పాటించిన జల్లెడ పద్ధతి, దీని ద్వారా కేవలం పై తరగతి వారికి చదువు చెబితే వారు క్రింది తరగతి వారికి నేర్పుతారని భావించడం జరిగినది. కానీ అది ఆచరణలో వైఫల్యంగా మిగిలింది. ఈ పరిస్థితుల నుండి మన విద్యా విధానాన్ని మనమే తయారు చేసుకునే దశకు వచ్చినా, వారు వదిలి వెళ్ళిన వాసనలను మనం కడిగి పారేయ్యలేక పోతున్నాము. స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలు దాటినా మనం ఇంకా ఆ జాడ్యం నుంచి బయటకు రాలేక పోతున్నాము.

పిల్లలకు చిన్ననాటి నుండే వ్యక్తిత్వ వికాస విద్యను బోధించాలి. తద్వారా విద్యార్థులు ఊహాలోకంలో కాకుండా నిజ జీవితంలో జీవిస్తారు. భ్రమలకు లోను కారు. విపరీత పరిణామాలు చోటుచేసుకోవు. ప్రతిదానికి ఆలోచించి పరిష్కరించే నేర్పు, సమయస్ఫూర్తి, సందర్భోచిత నిర్ణయాలు అలవడతాయి. శ్రమను ఆయుధంగా చేసుకోవాలని, నిరంతరసాధన, పట్టుదల, కార్యదీక్షతో ముందుకెళ్లాలని చెపుతూనే ఈ స్పృహ లేకపోతే అపజయం పాలవుతామని తెలియజేయాల్సి ఉంటుంది. పిల్లల్లో బలహీనతలను తగ్గించకపోతే పెద్దవారైన తర్వాత జీవితంలో వచ్చే కష్టాలను తట్టుకోలేక బలహీనులయ్యే ప్రమాదముంది. అంచెలంచెలుగా చేయవలసిన కృషి, అనుభవాలు, జ్ఞాపకాలు, మహానుభావుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాల్లో జోడించడం ద్వారా విద్యార్థులకు మరింత ప్రయోజనముంటుంది. కోపాన్ని జయించడం, వివిధ మానసిక సంఘర్షణలు, భావావేశాల నుండి బయటపడడాన్ని నేర్పాలి. పరస్పర సహకారం, ప్రేమ, ఆత్మీయత, త్యాగం, జాలి, కరుణ మొదలగు మానవతా విలువలను పెంచే విధంగా కృషి చేయాలి.

భావోద్వేగాలకు బదులు మానవత్వంతో ఆలోచించే ప్రశాంత పరిస్థితులు పాఠశాలల్లోను, సమాజంలోను నెలకొనాలి. తోటి మనిషిని సాటి మనిషిగా చూడగలిగే , ఇరుగు పొరుగువారితో కష్టసుఖాలలో పాలుపంచుకునే మహోన్నత సంస్కారం చిన్ననాటి నుండే ప్రతివ్యక్తిలో అలవడాలి. ఇందుకు సామాజిక చైతన్య కార్యక్రమాలు, మానసిక విశ్లేషకులు, వ్యక్తిత్వ వికాస నిపుణుల ద్వారా విద్యార్థులకనుగుణంగా వ్యక్తిత్వ వికాస విద్య ప్రణాళికను రూపకల్పన చేయించి ప్రతి పాఠశాలలో తప్పకుండా అమలు పరచవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. దారి తప్పుతున్న యువతను సక్రమ మార్గంలో పెట్టె బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదు. ఉపాధ్యాయులు, తల్లి తండ్రులు సమాజం, కుటుంబాలు తమ వంతు బాధ్యతతో యువతకు, విద్యార్థులకు స్ఫూర్తిని కలిగించాలి. ఇవి సాధ్యమైనపుడే విద్యకు సార్థకత ఉంటుంది.

-కాళంరాజు వేణుగోపాల్ 81062 04412

దళారులకే కాంగ్రెస్ వత్తాసు



ఒడిశాలో శనివారం జరిగిన ర్యాలీలో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్ర మోదీ

❊ యూపీఏ హయాంలో వారిదే రాజ్యం
❊ దొంగలే చౌకీదారును తొలగించాలనుకుంటారు
❊ ఒడిశా ర్యాలీలో ప్రధాని నరేంద్ర మోదీ విసుర్లు

బరిపడ (ఒడిశా), జనవరి 5: కాంగ్రెస్ పార్టీ దళారుల కోసమే పనిచేసిందని, ఆ పార్టీ సారధ్యంలోని యూపీఏ హయాంలో ప్రజల సంక్షేమాన్ని పట్టించుకోనేలేదని ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర స్వరంతో ధ్వజమెత్తారు. శనివారంనాడు ఇక్కడ బీజేపీ ర్యాలీని ఉద్దేశించిన మాట్లాడిన ఆయన '2004-2014 మధ్యకాలంలో దేశ రక్షణ దళాలను బలహీనపరిచేందుకు పెద్ద కుట్రే జరిగింది' అని ఆరోపించారు. ఇపుడు ఆ పాలనలోని వాస్తవాలు ఒకటొక్కటిగా వెలుగు చూడడంతో కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి నిద్రపట్టడంలేదని అన్నారు. గత నాలుగున్నరేళ్లుగా దేశానికి చౌకీదారుగా పనిచేస్తున్న తనను తొలగించాలన్న డిమాండ్‌తోనే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని మోదీ అన్నారు. 'దొంగలే చౌకీదారును తొలగించాలని అనుకుంటారు' అంటూ వ్యంగ్యోక్తి విసిరారు. దేశ రక్షణ, ప్రజల సంక్షేమం ధ్యేయంగా పనిచేస్తున్న చౌకీదారును ఎలాగైనా తొలగించాలన్నదే కాంగ్రెస్ ధ్యేయంగా పనిచేస్తోందని మోదీ అన్నారు. సమాజంలోగానీ, ఫ్యాక్టరీల్లోగానీ దొంగల ఏకైక ధ్యేయం ఎలాగైనా చౌకీదారును తొలగించి చొరబడి దోచుకోవాలన్నదని మోదీ వ్యాఖ్యానించారు. అయితే 'ఈ చౌకీదారు ఉన్నంతవరకు ఆ దొంగల ఆటలు సాగవు. వారి కుట్రలు నెరవేరవు' అని ఉద్ఘాటించారు. అలాగే యూపీఏ హయాంలో సాగిన కుంభకోణాలు క్రమంగా వెలుగులోకి రావడం వల్ల కాంగ్రెస్ నాయకులు ఎక్కడలేని ఆవేదన చెందుతున్నారని పేర్కొన్న మోదీ అగస్టా వెస్ట్‌లాండ్ స్కామ్‌ను ఈ సందర్భంగా ప్రస్తావించారు. కాంగ్రెస్ మంత్రులతోను, నాయకులతోను తనకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్న విషయాన్ని ఈ కుంభకోణంలో పాత్రధారి క్రిస్టియన్ మిషెల్ ఇప్పటికే వెల్లడించిన విషయాన్ని మోదీ గుర్తు చేశారు. ఇటీవలే ఇతనిని దుబాయ్ నుంచి భారత్ తీసుకువచ్చారని, ఇంటరాగేషన్‌లో విషయాలు బట్టబయలు అవుతున్నాయని తెలిపారు. యూపీఏ హయాంలో ప్రధాన మంత్రి కార్యాలయంలో ఫైళ్ల కదిలికల గురించి, రక్షణ రంగంపై ఏర్పాటు చేసిన కమిటీలో చర్చల గురించి ఈ దళారీకి పూర్తి సమాచారం ఉందని మోదీ అన్నారు. అంతేకాదు, ప్రతి కీలక ఫైలు సమాచారం ఇతని వద్ద ఉందని ప్రస్తుతం జరుపుతున్న దర్యాప్తులో ఆ వివరాలన్నీ బయటపడుతున్నాయని మోదీ అన్నారు. ఒకరకంగా చెప్పాలంటే అప్పటి ప్రధానమంత్రి కంటే కూడా కాంగ్రెస్ హయాంలో దళారులకే ఎక్కువ కీలక సమాచారం తెలుసునన్న విషయం స్పష్టమవుతుందని చెప్పారు. రక్షణ, భద్రత, ఆయుధ సేకరణకు సంబంధించిన వివరాలను ఈ దళారులు విదేశాలకు అందజేసిన సంకేతాలు కూడా ఉన్నాయని మోదీ తెలిపారు. దీన్నిబట్టి చూస్తే కాంగ్రెస్ పార్టీ అప్పట్లో ప్రభుత్వాన్ని నడిపిందా లేదా ఒక దర్బారుగానే దాన్ని నిర్వహించిదన్న అనుమానం కలుగుతోందని అన్నారు. ఈ అంశాలన్నింటిపైన తమ ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు జరుపుతుందని స్పష్టం చేసిన ఆయన 'మధ్యవర్తులను రక్షించడంలో అప్పటి పాలకుల పాత్ర ఏమిటి అన్నది నిగ్గు తేలుస్తాం' అని ఉద్ఘాటించారు. దేశ భద్రత కోసం కఠిన నిర్ణయాలు తీసుకునేందుకు తమ ప్రభుత్వం ఎప్పుడూ వెనకాడలేదని పేర్కొన్న మోదీ దేశ ప్రజలకు, సాయుధ దళాలకు, చివరికి రక్షణకే రక్షణ లేకుండా చేసిన కాంగ్రెస్‌కు మళ్లీ అవకాశం ఇవ్వాలా అంటూ జనాన్ని ఉద్దేశించి ప్రశ్నించారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని, కుంభకోణాలకు పాల్పడినవారిని వదిలిపెట్టేది లేదని ఈ సందర్భంగా వెల్లడించారు.


మీరే మోదీని నిలదీయండి

❊ రాఫెల్‌పై నేనడిగిన ప్రశ్నలే అడగండి ❊ ప్రజలకు రాహుల్ పిలుపు



న్యూఢిల్లీ, జనవరి 5: రాఫెల్ ఫైటర్ జెట్స్ కొనుగోళ్లకు సంబంధించి పార్లమెంటులో తాను ప్రస్తావించిన ప్రశ్నలను ప్రతి భారతీయుడు ప్రధానమంత్రి నరేద్రమోదీని అడగాలని ఎఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. పార్లమెంటులో రక్షణ శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ రెండు గంటల సేపు మాట్లాడినా సరైన సమాధానం చెప్పలేకపోయారన్నారు. తానడిగిన ప్రశ్నలకు బదులివ్వలేకపోయారన్నారు. ఈ వివరాలను రాహుల్ గాంధీ ట్వీట్ చేశారు. ఈ రెండు ప్రశ్నలకు సంబంధించి వీడియో క్లిప్‌లను కూడా ఆయన ట్వీట్ చేశారు. అనిల్ అంబానీకి ఎవరు ఆఫ్‌సెట్ కాంట్రాక్టుకు ఇచ్చారు ? ఈ ఒప్పందం అమలులో జరుగుతున్న పరిణామాలపై రక్షణమంత్రిత్వశాఖ అధికారులకు తెలుసా అని ఆయన ప్రశ్నించారు. వాచ్ అండ్ షేర్ దిస్ వీడియో అంటూ ఆయన ఒప్పందం గురించి పేర్కొన్నారు. తాము తప్పుడు ప్రచారం చేస్తున్నానంటూ నిర్మలాసీతారామన్ పేర్కొనడంలో నిజం లేదన్నారు. ఈ ఎయిర్ క్రాఫ్ట్‌ల కొనుగోళ్లపై కాంగ్రెస్ పార్టీ అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పడంలో ప్రభుత్వం విఫలమైందనన్నారు. నరేంద్రమోదీ పార్లమెంటుకు రాకుండా సమాధానాలు చెప్పకుండా తిరుగుతున్నారన్నారు. వీలైనంత వరకు ఈ విషయమై స్పష్టత ఇవ్వకుండా మభ్య పెడుతున్నారని ఆయన ప్రధాని మోదీని విమర్శించారు.

ఒడిశాలోని బారిమడలో శనివారం జరిగిన బీజేపీ ర్యాలీ సందర్భంగా ప్రధాని మోదీ ముసుగును ధరించి పెద్ద సంఖ్యలో హాజరైన పార్టీ కార్యకర్తలు



దేశ రక్షణలో రాజీలేదు

❊ గోడకు అనుమతించకపోతే జాతీయ ఎమర్జెన్సీ
❊ డెమాక్రట్లకు ట్రంప్ హెచ్చరిక



వాషింగ్టన్, జనవరి 5: మెక్సికో సరిహద్దుల్లో గోడ కట్టేందుకు నిధులను మంజూరు చేయకపోతే జాతీయ స్థాయిలో అత్యవసరపరిస్థితిని విధిస్తానని అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ హెచ్చరించారు. సరిహద్దుల్లో చొరబాటుదారులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు మెక్సికో సరిహద్దుల్లో గోడ నిర్మించాల్సిందేనని, ఇందులో రాజీలేదని ఆయన పేర్కొన్నారు. ఈ గోడ నిర్మాణానికి రూ.5.6 బిలియన్ డాలర్లు ఖర్చవుతుంది. ఈ నిధుల మంజూరుకు అమెరికా కాంగ్రెస్ అనుమతి కావాల్సి ఉంటుంది. కాని డెమాక్రట్లు మాత్రమే ఈ ప్రతిపాదనకు ససేమిరా అంటున్నారు. కాంగ్రెస్ అనుమతిలేకుండా జాతీయ అత్యవసరపరిస్థితిని విధించి గోడ కట్టేస్తానన్నారు. ఈ వివరాలను ఆయన ఇక్కడ శ్వేతసౌధంలో విలేఖర్లకు చెప్పారు. ట్రంప్ శ్వేతసౌధంలో డెమాక్రట్లతో సమావేశమై ఈ వివరాలను చర్చించారు. ఈ సమావేశం సంతృప్తినిచ్చిందని ట్రంప్ చెప్పారు. ఒక వేళ డెమాక్రట్లు సహకరించకపోతే, కాంగ్రెస్ అనుమతిరాకపోతే తప్పనిసరిగా ఎమర్జన్సీ పెట్టి గోడ కట్టేస్తానన్నారు. ఈ గోడను వీలైనంత త్వరలో నిర్మిస్తానన్నారు. అంతకుముందు సెనెట్‌లో మైనార్టీ పార్టీల న నేత చుక్ షేముర్ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యకలాపాలను స్తంభింపచేయరాదన్నారు. ఈ సమావేశానికి హాజరైన స్పీకర్ నాన్సీ పెలోసీ మాట్లాడుతూ ప్రభుత్వపై ప్రతికూల ప్రభావం పడే విధంగా జాతీయ ఎమర్జన్సీని విధించరాదన్నారు. దీని వల్ల ప్రజలకు మేలు జరగదన్నారు. ట్రంప్ దీనిపై మాట్లాడుతూ ప్రభుత్వ వ్యవస్థలను మూసివేసి ఎమర్జన్సీని విధించాలన్న సంకల్పం తనకేమీ లేదని, దేశభద్రత విషయంలో మాత్రం రాజీపడనని పేర్కొన్నారు.

భారత్‌కు నేను రాను

❊ కోర్టుకు తెలిపిన నీరవ్
❊ తనకు భద్రత లేదంటూ సాకులు

ముంబయి, జనవరి 5: పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ)ని నిండాముంచేసి విదేశాల్లో తలదాచుకుంటున్న వజ్రాల వ్యాపారి నీరవ్ మోదీ స్వదేశం రావడానికి సాకులు వెదుకుతున్నాడు. పీఎన్‌బీ కుంభకోణంలో ప్రధాని నిందితుడైన నీరవ్ భారత్‌లో తనకు భద్రత లేదని, అందుకే రాలేనని శనివారం కోర్టుకు తెలిపాడు. పైగా రాజకీయ దురుద్దేశంతోనే తనను కేసులో ఇరికించారని ఆయన ఆరోపించాడు. మలీలాండరింగ్ కేసులో నీరవ్‌ను పరారైన ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించాలని ఈడీ ప్రత్యేక కోర్టును కోరింది. దీనికి నీరవ్ తరపున్యాయవాది కోర్టులో పిటిషన్ వేశారు. తనపై దాడి జరుగుతుందన్న భయం తన క్లయింట్ వ్యక్తం చేస్తున్నారని, భారత్‌లో తగిన భద్రత లేదన్న అనుమానం ఉన్నందున స్వదేశానికి తిరిగి రావడం లేదని న్యాయవాది కోర్టుకు తెలిపారు. నీరవ్ మోదీ దిష్టిబొమ్మలు దహనం చేసిన విషయాన్ని ఆయన కోర్టు దృష్టికి తెచ్చారు. అలాగే వివిధ పార్టీలకు చెందిన నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన ప్రస్తావించారు. రాజకీయ లబ్ధికోసం కేసును తప్పుదోవపట్టిస్తున్నారని నీరవ్ న్యాయవాది ఆరోపించారు. ఎప్పుడో విదేశాలకు వెళ్లిపోయిన వ్యక్తిపై ఈడీ ఉద్దేశపూర్వకంగానే కేసులో ఇరికించిందని ఆయన అన్నారు. కాగా ఈడీ నోటీసులకు తాను సమాధానాలు ఇస్తునే ఉన్నానని మోదీ వెల్లడించాడు. అయితే ఈడీ సమన్లకు నీరవ్ స్పందించడం లేదని, మూడు సార్లు తప్పించుకున్న సంఘటనలున్నాయని అధికారులు వెల్లడించారు. లెటర్స్ ఆఫ్ అండర్‌టేకింగ్‌లు సృష్టించి నీరవ్‌మోదీ, ఆయన బంధువుమెహుల్ ఛోక్సీ పంజాబ్ నేషనల్ బ్యాంక్‌ను 14వేల కోట్లకు ముంచేశారు. ఈమేరకు సీబీఐ కేసు నమోదు చేసింది. నీరవ్, ఆయన బంధువుఛోక్సీ ప్రస్తుతం విదేశాల్లో తలదాచుకుంటున్నారు.

ఎలాంటి రాజకీయం లేదు

❊ ఐటీ దాడులపై కర్నాటక సీఎం

బెంగళూరు, జనవరి 5: చందనసీమ (కన్నడ సినీ రంగం)పై ఆదాయం పన్ను శాఖ దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో, రాజకీయం చేయరాదని, రాజకీయ కోణంలో చూడరాదని కర్నాటక ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి చెప్పారు. ఆదాయం పన్ను శాఖ అధికారులు తమ విధులను తాము నిర్వహిస్తున్నారన్నారు. వారికి వచ్చే సమాచారం బట్టి ఐటీ శాఖ దాడులను నిర్వహిస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ దాడులు జరుగుతున్నాయన్నారు. పన్ను ఎగవేత ఉంటే కచ్చితంగా ఐటీ శాఖ దాడులు చేస్తుందన్నారు. రాజకీయ దురుద్దేశ్యంతో దాడులు చేస్తున్నారని మాట్లాడడం సరికాదన్నారు. వారి సమాచారం నిజమైతే, దాడులు చేస్తారన్నారు. ఈ వివరాలను ఆయన ఇక్కడ విలేఖర్ల సమావేశంలో వెల్లడించారు. కన్నడ చిత్రపరిశ్రమకు చెందిన నటులు శివ రాజ్ కుమార్, పునీత్ రాజ్ కుమార్, సుదీప్, యాష్ , నిర్మాతలు సీఆర్ మనోహర్, రాక్‌లైన్ వెంకటేష్, విజయ్ కిర్గిందర్ తదితరుల ఇండ్లలో మూడవ రోజు కూడా ఐటీ అధికారులు సోదా నిర్వహించారు. సినీనటులు ప్రత్యేకమైన వర్గానికి చెందిన వారు కారని, ఉల్లంఘనలకు పాల్పడితే ఎవరైనా చట్టం ప్రకారం చర్యలు ఎదుర్కొనాల్సి ఉంటుందన్నారు. ఉపముఖ్యమంత్రి జీ పరమేశ్వర మాట్లాడుతూ, దాడులు దురుద్దేశంతో జరగకండా ఉండాలన్నారు. రాజకీయ పార్టీలను వేధించాలనే సంకల్పంతో ఈ సోదాలు ఉండరాదన్నారు. ఐటీ శాఖ దాడులను రాజకీయాలనే ఉద్దేశ్యం తమ పార్టీకి లేదన్నారు.

చల్లారని హింస, విధ్వంసం

❊ బీజేపీ ఎంపీ ఇంటిపై దాడి, ఆరెస్సెస్ ఆఫీసు దగ్ధం, సీపీఎం నేతల ఇళ్లపై బాంబు దాడులు
❊ 1700 మందిని అరెస్టు చేసిన పోలీసులు ❊ ఐరాసలో ప్రతిధ్వనించిన శబరిమల



కేరళ విధ్వంసం దృశ్యం (ఫైల్ ఫొటో)

కన్నూర్ (కేరళ), జనవరి 5: శబరిమల ఆలయంలో 50 ఏళ్లలోపు మహిళలు ప్రవేశించి దర్శనం చేసుకునే అవకాశాన్ని వామపక్ష ప్రభుత్వం కల్పించినందుకు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తీవ్రరూపం దాల్చుతోంది. బీజేపీ ఎంపీ పూర్వీకుల ఇంటిపై గుర్తు తెలియని వ్యక్తులు బాంబులతో దాడి చేయడం, ఆరెస్సెస్ కార్యాలయానికి నిప్పంటించడం ఘటనలతో కేరళ దద్దరిల్లింది. అంతకు ముందు కన్నూర్ సీపీఎం ఎమ్మెల్యే ఏఎన్ షాంసీ, మాజీ కార్యదర్శి పీ శశి ఇళ్లపై నాటు బాంబులతో దాడులు జరిగాయి. బీజేపీ రాజ్యసభ ఎంపీ వీ మురళీధరన్ ఇంటిపై జరిగిన బాంబు దాడిలో ఎవరూగాయపడలేదని పోలీసులు చెప్పారు. వడియిల్ పీడికియా గ్రామంలో తన ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేశారని బీజేపీ ఎంపీ మురళీధరన్ చెప్పారు. దాడి జరిగిన సమయంలో తన చెల్లెలు, బావమరిది, వారి కుమార్తె ఇంట్లో ఉన్నారన్నారు. పేరియారంలో ఆరెస్సెస్ ఆఫీసుకు నిప్పుపెట్టారు. ఇంతవరకు జరిగిన హింసాత్మక ఘటనలకు సంబంధించి 1700 మందిని అరెస్టు చేసినట్లు పోలీసులు చెప్పారు. సీపీఎం నేత శశి మాట్లాడుతూ తన ఇంటిపై విసిరిన బాంబులు శక్తివంతమైనవన్నారు.

కాగా కేరళ సీనియర్ మంత్రి జి సుధాకరన్ మాట్లాడుతూ అయ్యప్ప దేవాలయం పూజారి బ్రాహ్మణ రాక్షసుడని వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. మహిళలు ప్రవేశించారనే కారణంపై ఆలయాన్ని సంప్రోక్షణ చేయడమేంటన్నారు. ఆలయాన్ని శుద్ధి చేయడం తగదన్నారు. శుద్ధి చేసేవారిని మనుషులుగా గుర్తించవచ్చా అనన్నారు. ఈ అర్చకుడికి కుల దయ్యమన్నారు. ఒక బ్రాహ్మణుడు రాక్షసుడిగా మారితే, ఉగ్రవాదాన్ని సృష్టిస్తారన్నరు. ఈ అర్చకుడు పవిత్రమైన బ్రాహ్మణుడు కాదని, స్వామి అయ్యప్ప అంటే ఈ అర్చకుడికి ఎటువంటి భక్తిభావం లేదన్నారు. కాగా శబరిమల ఆలయం పరిసరాల్లో వామపక్ష ప్రభుత్వం బీభత్సం సృష్టించిందని బీజేపీ ఆరోపించింది. హిందువులకు సంబంధించిన వ్యవహారంలో సీపీఎం ఎందుకు జోక్యం చేసుకుంటోందని బీజేపీ ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీ కార్యకర్తలు, సానుభూతిపరుల ఇళ్లపై బాంబు దాడులకు పాల్పడుతున్నారని ఆయన సీపీఎంను విమర్శించారు. కాగా ఐక్యరాజ్యసమితిలో కూడా శబరిమల అంశం ప్రస్తావనకు వచ్చింది. ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటార్రెస్ ప్రతినిధి మాట్లాడుతూ రూల్ ఆఫ్ లాను ప్రతి ఒక్కరు గౌరవించాలని కోరారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ప్రతి ఒక్కరు అంగీకరించి పాటించాలన్నారు. ఈ విషయాన్ని రూల్ ఆఫ్ లాను అమలు చేసే వారికే వదిలేస్తున్నట్లు చెప్పారు. అన్ని వర్గాలకు సమాన హక్కులు ఉంటాయన్నారు.

ఐరాస ప్రతి దేశంలో రూల్ ఆఫ్ లాను ప్రోత్సహిస్తుందన్నారు. ఇస్లాం, కేథలిజంలో కూడా మహిళలకు సమాన హక్కులు ఇవ్వాలన్న అంశాన్ని ఐరాస సమర్థిస్తుందా అని అడగితే, తాము రూల్ ఆఫ్ లాను గౌరవించాలని కోరుతున్నామన్నారు.


అట్టుడికిన అసోం

❊ పౌరసత్వ బిల్లుపై నిరసనలు ❊ మోదీ దిష్టిబొమ్మల దహనం

గువహటి, జనవరి 5: అసోంలో పౌరసత్వ బిల్లు వివాదం చిచ్చురేపింది. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం నిరసన కార్యక్రమాలు మిన్నంటాయి. పౌరసత్వ బిల్లు-2016 సవరణకు సంబంధించి మార్గదర్శకాలు ఖరారు చేస్తామని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించిన మర్నాడే రాష్ట్రం అట్టుడికింది. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మనలు దహనం చేసి నిరసన తెలిపారు. దిగువ అసోం, దిబ్రూగఢ్‌లో ప్రధాని మోదీ, సీఎం సరబానంద్ సోనోవాల్ దిష్టిబొమ్మలు దహనం చేశారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు భంగం వాటిల్లనీయబోమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినా నిరసనకారాలు శాంతించలేదు. అస్సాం పౌరసత్వ చట్టం -1955 సవరించి 2016 బిల్లుకు ప్రభుత్వం ఉపక్రమించింది. అయితే బిల్లును స్థానికులు మొదటి నుంచీ వ్యతిరేకిస్తూ వస్తున్నారు. తమ సంస్కృతి, సంప్రదాయాలు మంటగలుస్తాయని పెద్దఎత్తున ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈశాన్య రాష్ట్రాల నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టిన ప్రధాని నరేంద్ర మోదీ పౌరసత్వ బిల్లుపై మాట్లాడారు. 'ఈబిల్లు ప్రజాబాహుళ్యానికి ప్రయోజనకారి. ఏదో ఒక వర్గానికి మేలుజేసేది కాదు. గతంలో జరిగిన పొరపాట్లను సరిదిద్దాలని దీన్ని తీసుకొచ్చాం'అని శుక్రవారం మోదీ ప్రకటించారు. పార్లమెంటు ఆమోదం తీసుకుని బిల్లులో సవరణలు చేస్తామన్న ప్రధాని వ్యాఖ్యలు చిచ్చురేపాయి. క్రిష్క్ ముక్తి సంగ్రాం సమితి(కేఎంఎస్‌ఎస్) నాయకత్వంలో 70 సంఘాలు శనివారం ఉదయం రాష్ట్ర రాజధానిలో ర్యాలీ నిర్వహించాయి. బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం నుంచి బయటకు రావాలని అస్సాం గణ సంగ్రాం పరిషత్(ఏజీపీ)పై వత్తిడికి కేఎంఎస్‌ఎస్ ప్రయత్నిస్తోంది. ఏజీపీ కేంద్ర కార్యాలయం ముట్టడిస్తామని కేఎంఎస్‌ఎస్ నేత అఖిల్ గొగోయ్ వెల్లడించారు. ప్రధాని మోదీ వ్యాఖ్యలపై నిరసన తెలపడానికి ఇళ్లలోంచి బయటకు రావాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఢిల్లీ పాలకులు అభిప్రాయాలు తమపై రుద్దాలని ప్రయత్నిస్తే ప్రతిఘటన తప్పదని ఆయన హెచ్చరించారు. అయితే రాష్ట్ర ప్రజలకు నష్టం జరిగే ఏ నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకోదని ముఖ్యమంత్రి సోనోవాల్ స్పష్టం చేశారు.

జతకట్టిన ఎస్పీ, బీఎస్పీ

❊ లోక్‌సభ ఎన్నికల్లో కూటమిగా పోటీ



లక్నో, జనవరి 5: లోక్‌సభ ఎన్నికల్లో కలిసిపోటీ చేయాలని సమాజ్‌వాదీ పార్టీ, బహుజన సమాజ్ వాదీ పార్టీ సూత్రప్రాయంగా ఓ అంగీకారానికి వచ్చాయి. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపడానికి రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరిందని సమాజ్‌వాదీ పార్టీ నేత ఒకరు వెల్లడించారు. అయితే పొత్తుకు సంబంధించి అధికారి ప్రకటన త్వరలోనే ఉంటుందని ఎస్పీ జాతీయ అధికార ప్రతినిధి రాజేంద్ర చౌదరి శనివారం ఇక్కడ తెలిపారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అవకాశవాద, ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తోందని ఆయన ఆరోపించారు. అఖిలేష్ యాదవ్, మాయావతి పొత్తుకు సూత్రప్రాయంగా అంగీకరించారని ఆయన స్పష్టం చేశారు. రెండు పార్టీల అధినేతల మధ్య పలుదఫాలు చర్చలు జరిగిన తరువాత ఏకాభిప్రాయానికి వచ్చినట్టు చౌదరి పేర్కొన్నారు. అఖిలేష్, మాయావతి శుక్రవారం సమావేశమైనట్టు ఆయన చెప్పారు. మిగతా పార్టీలతోనూ సంప్రదింపులకు అవకాశం ఉందని ఎస్పీ నేత అన్నారు. రాష్ట్రంలో మహాకూటమి ఏర్పాటుకు మార్గం సుగమం అయినట్టు ఆయన వివరించారు. పొత్తుకు సంబంధించి ఈనెలలోనే అధికారిక ప్రకటన వెలువతే అవకాశం ఉందని ఆయన వెల్లడించారు.'ఎస్పీ అధినేత అఖిలేష్ యాదవ్, బీఎస్పీ అధినేత్రి మాయావతి మధ్య అనేక దఫాలు చర్చలు జరిగాయి. శుక్రవారం కూడా ఇద్దరు నేతలూ ఢిల్లీలో సమావేశమయ్యారు'అని చౌదరి తెలిపారు. తమతో కలిసి వచ్చే చిన్నాచితక పార్టీలతోనూ చర్చిస్తామని ఆయన చెప్పారు. కాంగ్రెస్ మహాకూటమిలోకి తీసుకోరా? అన్న ప్రశ్నకు' దానిపై అఖిలేష్, మాయావతి నిర్ణయం తీసుకుంటారు'అని స్పష్టం చేశారు. అయితే రాహుల్, సోనియాగాంధీ పోటీచేసే అమేథీ, రాయ్‌బరేలీలో మాత్రం కూటమి అభ్యర్థులను పోటీకి పెట్టబోమని చౌదరి ప్రకటించారు. కాగా ఎస్పీ, బీఎస్పీ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాయని అధికార బీజేపీ ఆరోపించింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అత్యధిక స్థానాలు గెలుచుకుంటుందని యూపీ బీజేపీ అధికార ప్రతినిధి హీరో బాజ్‌పాయ్ ధీమా వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ ఒంటరి పోరు

ఎస్పీ, బీఎస్పీల మధ్య పొత్తుఖరారైన నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో అన్ని స్థానాలకు ఒంటిరిగానే పోటీచేసే అంశాన్ని కాంగ్రెస్ నాయకత్వం చురుగ్గా పరిశీలిస్తున్నట్టు తెలుస్తోంది. 80 లోక్‌సభ నియోజక వర్గాలు కలిగిన యూపీలో మెజారిటీ సీట్లు ఏ పార్టీకి వస్తే కేంద్రంలో ఆపార్టీదే అధికారం అన్న వాదన దృష్ట్యా తాజా పరిణాలకు ప్రాధాన్యత ఏర్పడింది. కొత్త కూటమి ఏర్పడిన దృష్ట్యా తాము ఒంటరి పోటీకి సిద్ధంగా ఉన్నామని అందుకు పార్టీ యంత్రాంగాన్ని సమాయత్తం చేస్తున్నామని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఇదే విషయాన్ని ధృవీకరించిన కాంగ్రెస్ ఎంపీ పునియా 'కూటమి కట్టడం అన్నది ముఖ్యంకాదు. మా కార్యకర్తలు ఒంటరి పోరుకు సిద్ధంగా ఉన్నారు'అని ఉద్ఘాటించారు.

భారతీయ సంస్కృతి ప్రాచుర్యానికి

హిందీయే మూలం

❊ కేంద్ర మంత్రి సుష్మా స్వరాజ్



చెన్నై, జనవరి 5: భారతీయ సంస్కృతి, కళలను విస్తృతం చేయడంలో జాతీయ భాష హిందీ ఎంతో ఉపకరిస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ అన్నారు. విదేశాలు, సోషల్ మీడియోలో కూడా హిందీ భాష కీలకంగా మారిందని అన్నారు. శనివారం ఇక్కడ జరిగిన దక్షిణ భారత్ హిందీ ప్రచార సభ 82వ స్నాతకోత్సవంలో పాల్గొని ప్రసంగించారు. ఈ సంస్థ హిందీతోపాటు దక్షిణాది భాషలకు కూడా ఎంతో ప్రాచుర్యం కల్పిస్తోందని కొనియాడారు. మనుషులను అనుసంధానం చేసేది భాషేనని, భావ వ్యక్తీకరణకు భాష ఎంతో మూలమని అన్నారు. మొట్టమొదటి సారిగా అటల్ బిహారీ వాజపేయి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో హిందీలో ప్రసంగించారని, అప్పటి నుంచీ కూడా అంతర్జాతీయంగా హిందీకి ఆదరణ పెరిగిందని వ్యాఖ్యానించారు. అలాగే 2014లో మన ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ కూడా ఐరాస జనరల్ అసెంబ్లీలో హిందీలో ప్రసంగించారని గుర్తుచేశారు. హిందీ భాషలో ప్రావీణ్యం ఉన్నవారికి ఉద్యోగాల్లో అవకాశాలు ఎక్కువవుతున్నాయని, ప్రచురణ సంస్థలు, న్యూస్ చానళ్లలోనూ కొన్నేళ్లుగా ఎన్నో అవకాశాలు వస్తున్నాయని అన్నారు. విదేశీ వ్యవహాల శాఖలోని అత్యున్నం ఉద్యోగులు సైతం హిందీ నేర్చుకోవడంలో ఆసక్తి చూపుతున్నారని అన్నారు. కొన్ని విదేశాలు సైతం వారి దేశంలో హిందీ భాష నేర్పే సెంటర్లను ఏర్పాటుచేయమని ఆహ్వానిస్తున్నాయని వివరించారు. దేశం మొత్తాన్ని ఏకం చేసేందుకు భాష ఎంతో ముఖ్యమని గుర్తించిన మహాత్మా గాంధీ 1918లో దక్షిణ భారత్ హిందీ ప్రచార సభను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. జార్జిటౌన్‌లోని గోఖలే హాల్ జూన్ 17న జరిగిన ఒక కార్యక్రమంలో ఈ సంస్థను స్థాపించారు. ఈ కార్యక్రమానికి అన్నీ బీసెంట్ కూడా హాజరయ్యారు. ప్రస్తుతం ఈ సంస్థ చెన్నైలోని టి.నగర్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. సభ అనంతరం పోస్టు గ్రాడ్యుయేట్, గ్రాడ్యుయేట్ పూర్తిచేసిన విద్యార్థులకు పతకాలను ప్రదానం చేశారు.

ఇతర రక్షణ ఒప్పందాల్లోనూ

మిచెల్‌కు ముడుపులు

❊ కోర్టుకు తెలిపిన ఈడీ

న్యూఢిల్లీ, జనవరి 5: అగస్టావెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ల కొనుగోళ్ల కేసులో నిందితుడైన మిచిల్ క్రిస్టియన్ ఇతర రక్షణ కొనుగోళ్ల కేసులో కూడా ముడుపులు స్వీకరించాడని, ఈ అభియోగాలపై దర్యాప్తు చేయాల్సి ఉందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ కోర్టుకు తెలిపింది. ఈ కేసులోనిందితుడు మిచిల్‌ను జ్యుడీషియల్ కస్టడీకి పంపారు. కస్టడీలో విచారించి సేకరించిన వివరాలను ఢిల్లీ కోర్టు న్యాయమూర్తి అరవింద్‌కుమార్‌కు తెలిపారు. ఇతర రక్షణ పరికరాలకొనుగోళ్ల కేసులో మిచిల్ 24.25 మిలియన్ల యూరోలను అగస్టావెస్ట్‌ల్యాండ్ హెలికాప్టర్ల కేసులో 1,60,96,245 పౌండ్లను ముడుపులుగా స్వీకరించినట్లు ఈడీ కోర్టుకు తెలిపింది. ఈ మొత్తం వ్యవహారాలపై దర్యాప్తును ముమ్మరం చేసినట్లు ఈడీ తెలిపింది. ఈడీ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డీపీ సింగ్, ఎన్‌కే మట్టాలు కోర్టుకు వివరాలను తెలిపారు. హవాలా ఆపరేషన్ల ద్వారా కూడా సొమ్మును స్వాహా చేశారన్నారు. మిచిల్‌ను శనివారం కోర్టు ముందు హాజరుపరిచారు. నిందితుడు మిచిల్ బ్రిటన్ జాతీయుడని, బెయిల్ ఇస్తే పారిపోతాడని ఈడీ కోర్టుకు తెలిపింది. సుదీర్ఘ న్యాయ ప్రక్రియ అనంతరం మిచిల్‌ను విదేశాల నుంచి తీసుకువచ్చినట్లు చెప్పారు. అనంతరం కోర్టు ఫిబ్రవరి 26వతేదీ వరకు జ్యుడీషియల్ కస్టడీకి పంపిస్తూ ఆదేశాలు జారీ చేసింది.



కన్నా ఇంటి ఎదుట ఆందోళన చేస్తున్న టీడీపీ శ్రేణులు

ఏపీ బీజేపీ అధ్యక్షుడు కన్నా ఇల్లు ముట్టడి

గుంటూరులో తీవ్ర ఉద్రిక్తత ★ వాగ్వాదం, తోపులాటలతో రాజుకున్న వేడి
పరస్పర దూషణలతో దద్దరిల్లిన ఘటనాస్థలి ★ ఇంటి ఎదుటే కన్నా నిరసన

గుంటూరు, జనవరి 5: రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ఇంటి ముట్టడికి శనివారం టీడీపీ కార్యకర్తలు ప్రయత్నించటంతో గుంటూరులో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. గతంలో ఎన్నడూ జరగని విధంగా జాతీయ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి హోదాలో ఉన్న నేత ఇంటి ముట్టడికి యత్నించడం సంచలనం రేకెత్తించింది. కన్నా లక్ష్మీనారాణ ఉదయం దేవాలయానికి వెళ్లి ఇంటికి వచ్చి కార్యకర్తల సమావేశానికి వెళ్లే సమయంలో పథకం ప్రకారం విజయవాడకు చెందిన టీడీపీ లీగల్ సెల్ నాయకులు ఆయన ఇంటి ముట్టడికి యత్నించారు. దీంతో బీజేపీ, టీడీపీ నేతల మధ్య తీవ్ర ఘర్షణ, తోపులాట చోటు చేసుకుంది. ఓ పక్క మోదీ, కన్నాలక్ష్మీనారాయణలకు వ్యతిరేకంగా తెలుగుదేశం శ్రేణులు నినాదాలు చేస్తుండగా, మరో పక్క బీజేపీ వర్గం చంద్రబాబుకు, టీడీపీకి వ్యతిరేకంగా నినాదాలతో హోరెత్తించారు. పరస్పర దూషణలు, తోపులాటతో కొద్దిసేపు తీవ్ర గందరగోళం నెలకొంది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టే ప్రయత్నం చేసినప్పటికీ ఫలించక పోవడంతో టీడీపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా ఇంటిముందు రోడ్డుపై బైఠాయించి కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. తమ నేతపై టీడీపీ నాయకులు దాడికి యత్నించడం దారుణమంటూ, జాతీయ పార్టీ నేతకే తెలుగుదేశం హయాంలో రక్షణ లేకుండా పోయిందని బీజేపీ నేతలు నిప్పులు చెరిగారు. వెంటనే కన్నాపై దాడికి దిగిన వారిని అరెస్ట్ చేయాలని జిల్లా అర్బన్ ఎస్పిని కలిసి బీజేపీ నేతలు ఫిర్యాదు చేశారు. అనంతరం నగరంలోని జిన్నాటవర్ సెంటర్‌లో గల మహాత్మా గాంధీ విగ్రహం ధర్నా చేశారు.

నా అడ్డు తొలగించుకునేందుకే బాబు కుట్ర : కన్నా

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనను అంతమొందించేందుకే పార్టీ నాయకులచే దాడి చేయించారని కన్నా లక్ష్మీనారాయణ ఆరోపించారు. శనివారం తన నివాసంపై టీడీపీ శ్రేణులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. శుక్రవారం కాకినాడలో బీజేపీ కార్యకర్తలు ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు ప్రయత్నించగా ఆయన అమర్యాదగా ప్రవర్తించాడని, బీజేపీకి చెందిన ఓ మహిళా కార్పొరేటర్‌ను ఫినిష్ చేస్తామని హెచ్చరించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి వ్యాఖ్యలను తాను ఖండించినందునే తన ఇంటిపై టీడీపీ నేతలను గుండాల మాదిరి ఉసిగొల్పారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

హోం మంత్రిని కలిసిన హోదా సాధన సమితి నేతలు

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలుచేయాలని కేంద్ర హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు హోదా సాధన సమితి నాయకులు విజ్ఞప్తి చేశారు. విభజన హామీలు, వెనకబడిన ప్రాంతాలకు కేటాయించిన నిధులు వెంటనే విడుదల చేయాలని ఒక వినతి పత్రాన్ని అందజేశారు. హోంమంత్రిని కలిసిన వారిలో జార్జ్ విక్టర్, సదాశివరెడ్డి, చలసాని శ్రీనివాస్ తదితరులున్నారు.

పరిపాలనా భాషగా తెలుగును అమలు చేయాలి

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: తెలుగును పరిపాలన భాషగా అమలుచేయాలని కోరుతూ జర్నలిస్టు పొన్నాల గౌరీశంకర్ మొదలుపెట్టిన సైకిల్ యాత్ర శనివారం ఢిల్లీకి చేరుకుంది. ఈ యాత్ర విజయవాడ, హైదరాబాద్, నాగపూర్, భోపాల్, శివానీ, ఆగ్రా, మధుర, బృందావనం, గోవర్ధనగిరి, హరిద్వార్, ఋషికేశ్ మీదుగా ఢిల్లీకి చేరింది. ఈ సందర్భంగా గౌరీశంకర్ మాట్లాడుతూ తెలుగును పరిపాలనా భాషగా అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

ఎన్‌ఐఏకు అప్పగిస్తే భయమెందుకు?

కోడికత్తి కేసుపై జీవీఎల్

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై జరిగిన హత్యాయత్నం ఘటనపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ)కు అప్పగిస్తే తెలుగుదేశం నాయకులు ఎందుకు భయపడుతున్నారని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహారావు ప్రశ్నించారు. ఢిల్లీలో శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎన్‌ఐఏ దర్యాప్తులో వాస్తవాలు బయటకు వస్తే కొందరి జాతకాలు తారుమారవుతాయాని ముఖ్యమంత్రి చంద్రబాబు భయపడుతున్నారని ఆరోపించారు. చట్టం ప్రకారం దేశంలోని కేసులను తమంతట తాము తీసుకునే అధికారం ఎన్‌ఐఏకి ఉన్నదని అన్నారు. తెలుగుదేశం పార్టీ డ్రామాలు రాష్ట్ర ప్రజలకు అర్థమవుతున్నాయని, అందుకే కేంద్ర-రాష్ట్రాల సంబంధాలపై అర్థ పర్థం లేకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

తెలంగాణలో ఓటమి తర్వాత చంద్రబాబుకు అసహనం పెరిగిపోయిందని, తెలంగాణ ఎన్నికల్లో వచ్చిన రెండు ఎమ్మెల్యే సీట్లు మాదిరిగానే ఏపీలోనూ రెండు స్థానాలే వస్తాయని ఎద్దేవా చేశారు. కాకినాడలో బీజేపీ మహిళా నాయకురాలి పట్ల చంద్రబాబు దారుణంగా వ్యవహరించారని ఆరోపించారు. శబరిమల ఆలయంలోకి మహిళలు ప్రవేశించడం ద్వారా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా కేరళలోని వామపక్ష ప్రభుత్వం వ్యవహరిస్తోందని విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం భక్తులపై వామపక్ష ప్రభుత్వం దాడులకు పాల్పడుతోందని మండిపడ్డారు.

శబరిమలపై బీజేపీవి ద్వంద్వ ప్రమాణాలు

సీపీఐ నేత నారాయణ ధ్వజం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: శబరిమల ఆలయం విషయంలో బీజేపీ ప్రభుత్వం ద్వంద్వ ప్రమాణాలు పాటిస్తోందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. ఢిల్లీలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ కేరళలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ కలిసి విధ్వంసం సృష్టించాలని చూస్తున్నాయని ఆరోపించారు. శబరిమల ఆలయంలోకి మహిళల ప్రవేశంపై సుప్రీం కోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ మహిళల హక్కులకోసం పోరాడుతున్న వారిపై బీజేపీ దాడులకు దిగుతుందని ఆరోపించారు. మహారాష్ట్రలోని శని సింగ్నాపూర్ ఆలయం విషయంలో కోర్టు తీర్పును అమలుచేస్తున్న బీజేపీ ప్రభుత్వం, కేరళలో శబరిమల అంశాన్ని ఎందుకు వ్యతిరేకిస్తోందని నిలదీశారు. బీజేపీ ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశస్థాయిలో కూటమి ఏర్పాటు జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. రాఫెల్ యుద్ధ విమానాల ఒప్పందం విషయంలో జాయింట్ పార్లమెంట్ కమిటీ వేయడానికి కేంద్రానికి ఉన్న అభ్యంతరం ఏమిటిని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానిది రిటైల్ అవినీతి అయితే.. బీజేపీ ప్రభుత్వానిది హోల్‌సేల్ అవినీతి అని నారాయణ దుయ్యబట్టారు. జాతీయ స్థాయిలో బీజేపీ వ్యతిరేక శక్తులన్నీ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఏపీలో తెలుగుదేశం ప్రభుత్వాన్ని తమ పార్టీ వ్యతిరేకిస్తున్నప్పటికీ తెలంగాణలో మాత్రం ఆ పార్టీతో కలిసి పోరాటం కొనసాగిస్తామని నారాయణ స్పష్టం చేశారు.

8, 9 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల సమ్మె



న్యూఢిల్లీ, జనవరి 5: ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు మరోసారి సమ్మె బాట పట్టనున్నారు. ఈనెల 8, 9 తేదీల్లో సమ్మెకు సన్నాహాలు పూర్తి చేస్తున్నారు. వేతన సవరణ, ఉద్యోగ భద్రత, పెన్షన్ ప్లాన్ వంటి పలు డిమాండ్ల సాధన కోసం విధులను బహిష్కరించాల్సిందిగా అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సంఘం (ఏఐబీఈఏ), భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (బీఈఎఫ్‌ఐ) పిలుపునిచ్చాయి. 10 కార్మిక సంఘాలు సానుకూలంగా స్పందించి, రెండు రోజుల సమ్మెకు దిగుతున్నట్టు భారత బ్యాంకుల సంఘం (ఐబీఏ)కు నోటీసు ఇచ్చాయి. బాంబే స్టాక్ ఏక్స్ఛేంజ్ (బీఎస్ఈ)కి అంద చేసిన ఫైలింగ్‌లో ఐడీబీఐ, బ్యాంక్ ఆఫ్ బరోడా ధ్రువీకరించాయి. కాగా, రెండు రోజుల సమ్మెతో బ్యాంకింగ్ సేవలు స్తంభించనున్నాయి. ప్రైవేటు బ్యాంకులు పని చేసినా, దేశంలో ఎక్కువ మంది ఖాతాదారులను కలిగి ఉన్న ప్రభుత్వ రంగ బ్యాంకుల సమ్మె అనేకానేక లావాదేవీలపై తీవ్ర ప్రభావం చూపనుంది. కాగా, డిమాండ్ల సాధనకు ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు లేదా అధికారులు సమ్మెబాట బాటపట్టడం రెండు నెల వ్యవధిలో ఇది మూడోసారి. తమ పట్ల కేంద్రం నిర్లక్ష్య వైఖరిని అనుసరిస్తున్నదని ఆరోపిస్తూ, భారత బ్యాంక్ అధికారుల సంఘం (ఏఐబీఓసీ) గత నెల 21న ఒక రోజు సమ్మె చేసింది. కాగా, బ్యాంక్ ఆఫ్ బరోడాలో విజయా బ్యాంక్, దేనా బ్యాంక్‌ల విలీనాన్ని వ్యతిరేకిస్తూ 26న ఉద్యోగులు, అధికారులు తమతమ విధులను బహిష్కరించారు. విలీనాల వల్ల ఉద్యోగాలు ఎక్కడికీ పోవని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ విస్పష్టంగా ప్రకటించిన తర్వాత, ఉద్యోగ భద్రతపై అనుమానాలు తొలగినప్పటికీ, మిగతా డిమాండ్లపై ఉద్యోగులు పట్టుదలతో ఉన్నారు. తాజాగా ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఎఐసీసీటీయూ, యూటీయూసీ, టీయూసీసీ, ఎల్‌పీఎఫ్, సెవా సంఘాలు తాజాగా సమ్మెకు పిలుపునిచ్చాయి. రెండు రోజులపాటు పెద్ద ఎత్తున సమ్మె జరగనున్న నేపథ్యంలో ఆర్థిక వ్యవహారాలు ఎక్కడివక్కడ స్తంభించడం ఖాయంగా కనిపిస్తున్నది.

రైతులకు 9 గంటల విద్యుత్

సంక్రాంతి కానుకగా అందిస్తామన్న ఏపీ సీఎం చంద్రబాబు

ఆంధ్రభూమి బ్యూరో

శ్రీకాకుళం, జనవరి 5: రైతాంగానికి సంక్రాంతి కానుకగా వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇప్పటి వరకూ ఏడు గంటలు ఇస్తున్నామని, అతి త్వరలో తేదీ ఖరారు చేసి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే వ్యవసాయం బాగుండాలని, రైతుల ఆత్మహత్యలు, అప్పుల ఊబి నుంచి బయట పడేలా అధ్యయనం చేసి రుణమాఫీ కింద రూ. 24000 కోట్లు ఇచ్చామని, మిగిలిన మాఫీని కూడా సంక్రాంతి తర్వాత పూర్తి చేస్తామన్నారు.

ఆరోవిడత జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో భాగంగా శనివారం రాజాం నియోజకవర్గం పొగిరి గ్రామసభకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు రుణమాఫీ వల్ల ఎటువంటి ప్రయోజనం లేదంటూ గతంలో ప్రధానమంత్రి మోదీ పేర్కొన్నా, ఆర్బీఐ మాఫీ చేసేందుకు నిరాకరించినా, బ్యాంకర్లు సాయం చేయలేమన్నప్పటికీ 1.50 లక్షల మంది రైతులకు తాను భరోసా ఉంటానంటూ ఇచ్చిన హామీ మేరకు రుణ మాఫీకి సాహసించానన్నారు. మిగిలిన రుణమాఫీని సంక్రాంతి కానుకగా పెద్దపండుగ తర్వాత పూర్తి చేస్తానన్నారు.

అన్నదాతల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు తాను రైతాంగంతో ఉంటానని ప్రమాణం చేసారు. తెలంగాణ రాష్ట్రంతో పోల్చిచూస్తే 50 శాతం వ్యవసాయంలో వృద్ధిరేటు సాధించామన్నారు. ప్రధానమంత్రి రైతుల ఆదాయం రెండింతలు చేస్తానని మాటలు చెప్పారే తప్ప చేతల్లో చూపలేదని, కానీ, ఏపీలో 11 శాతం వృద్ధిని నాలుగున్నరేళ్లలోనే సాధించామన్నారు. ఈ ఏడాది 32 శాతం తక్కువ వర్షపాతం పడినప్పటికీ నదుల అనుసంధానం, ప్రాజెక్టుల పూర్తి, సూక్ష్మ వ్యవసాయ విధానాల వల్ల వ్యసాయరంగం అభివృద్ధి దిశలో ఉందన్నారు. రాష్ట్రంలో 62 సాగునీటి ప్రాజెక్టుల్లో 15 ప్రాజెక్టులు పూర్తి చేసామని, మరో ఆరు ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయన్నారు. 23 ప్రాజెక్టులు జూన్ నాటికి పూర్తి చేస్తామన్నారు. వంశధార - నాగావళి అనుసంధానం చేస్తామన్నారు. నీటిని సమర్థవంతంగా, పొదుపుగా వినియోగించుకోవాల్సిన బాధ్యత రైతాంగంపై ఉందన్నారు. 2019 ఖరీప్ నాటికి శతశాతం ఊబరైజేషన్ విధానంతో యాప్‌లపై వ్యవసాయం చేసేలా సాంకేతిక మార్పులు పెద్దఎత్తున జరుగుతాయన్నారు.

పోలింగ్ మేనేజ్‌మెంట్ కోసమే పెద్దనోట్లు

ప్రధాని మోదీ నమ్మించి మోసం చేసారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపించారు. పెద్దనోట్ల రద్దు ఏమైందని ప్రశ్నిస్తూనే ఎన్నికలకు ముందు పెద్ద నోట్ల పట్ల కేంద్రం తీసుకునే నిర్ణయాలు కేవలం పోలింగ్ మేనేజ్‌మెంట్ కోసమేనంటూ ఆరోపించారు. జీఎస్టీని సమర్థవంతంగా అమలు చేయలేకపోయారన్నారు. మోదీ గారడీ మాటలతో 2019 ఎన్నికల్లో ఓట్లు పడే ఛాన్సే లేదంటూ బాబు ఘాటుగా విమర్శించారు. రాఫెల్ డీల్‌లో పెద్దఎత్తున కుంటభకోణం జరిగిందన్నారు. ఏపీకి అన్యాయం జరిగిందని నిలదీస్తే కక్షకట్టి కేసీఆర్, జగన్‌ను తనపైకి మోదీ ఉసుగొలుపుతున్నారన్నారు. తలాక్ చట్టంలో ముస్లిం కుటుంబ వ్యవస్థను కుప్పకూర్చేలా మోదీ నిర్ణయం తీసుకున్నారని, అటువంటి చట్టాలే కేరళలో క్రిస్టియన్ కుటుంబాలపట్ల సానుకూలతగా వ్యవహారించిన విధానాన్ని తెలిపారు. రాష్ట్రాల మధ్య విభేదాలను కేంద్రం సృష్టిస్తోందన్నారు. టీడీపీ ఎంపీలు పోరాటం చేస్తే సస్పెన్షన్ చేసారన్నారు.

అండర్-14 క్రికెట్ రాష్ట్ర జట్టు కెప్టెన్‌గా ఏలేటి సృంజిత్‌రెడ్డి



నిర్మల్, జనవరి 5: నిర్మల్ జిల్లా కేంద్రానికి చెందిన ఏలేటి సృంజిత్‌రెడ్డి అండర్-14 విభాగంలో రాష్ట్ర క్రికెట్ జట్టు కెప్టెన్‌గా ఎన్నికయ్యాడు. ఆయన మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కుమారుడు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన సెలక్షన్ కమిటీ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. సృంజిత్‌రెడ్డి రాష్ట్ర అండర్-14 క్రికెట్ జట్టుకు సారథ్యం వహించనున్నారు. ఈసందర్భంగా సృంజిత్‌రెడ్డికి పట్టణ ప్రముఖులు, జిల్లా ప్రజలు అభినందనలు తెలిపారు.

1వ పేజీ తరువాయి

మే 3 నుంచి ఎమ్సెట్

జేఎన్‌టీయూకు అప్పగించారు. జేఎన్‌టీయూ హెచ్ వైస్ చాన్సలర్ సెట్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. అగ్రికల్చర్ స్ట్రీం ప్రవేశపరీక్ష మే 8, 9 తేదీల్లో ఉంటుంది. ఈ పరీక్ష కూడా ఆన్‌లైన్‌లో ఉదయం, సాయంత్రం నిర్వహిస్తారు. టీఎస్ ఈసెట్‌ను జేఎన్‌టీయూహెచ్‌కు అప్పగించారు. ఈసెట్ పరీక్షను మే 11న ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకూ, సాయంత్రం 3 నుంచి 6 గంటల వరకూ రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. టీఎస్ పీఈసెట్‌ను ఈసారి మహాత్మాగాంధీ యూనివర్శిటీ నిర్వహించనుంది. దీనికి సీబీటీఎస్ ఉండదు. కేవలం శారీరకదారుఢ్య పరీక్షలను మే 20 నుంచి నిర్వహిస్తారు. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి ఐసెట్‌ను కాకతీయ యూనివర్శిటీ చేపడుతుంది. మే 23, 24 తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తుంది. ఎల్ఎల్‌బీ మూడేళ్లు, ఐదేళ్ల కోర్సులో అడ్మిషన్లకు టీఎస్ లాసెట్‌ను ఉస్మానియా యూనివర్శిటీ నిర్వహిస్తుంది. మే 26న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకూ పరీక్ష జరుతుంది. ఎల్ఎల్ఎం అడ్మిషన్లకు అదే రోజు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రవేశపరీక్ష ఉంటుంది. పీజీ ఈసెట్‌ను కూడా ఉస్మానియా యూనివర్శిటీ నిర్వహించనుంది. పీజీ ఈసెట్‌ను మే 27 నుంచి 29 వ తేదీ వరకూ రెండు షిఫ్టుల్లో నిర్వహిస్తారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకూ ఒక షిఫ్ట్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ మరోషిఫ్ట్‌లో నిర్వహిస్తారు. బిఈడీ కోర్సులో చేరేందుకు ఉస్మానియా యూనివర్శిటీ మే 30, 31 తేదీల్లో రెండు షిఫ్టుల్లో ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష నిర్వహించనుంది. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సాయంత్రం 3 గంటల నుండి 5 గంటల వరకూ మరో షిఫ్ట్‌లో ఈ ప్రవేశపరీక్ష నిర్వహిస్తారు. గత ఏడాది ఉన్న కన్వీనర్లే ఈసారీ ఉంటారు. ఒకటి రెండు ప్రవేశపరీక్షలకు కన్వీనర్లను మార్చే యోచనలో ఉన్నత విద్యామండలి ఉన్నట్టు తెలిసింది. ఇలా ఉండగా ప్రవేశపరీక్షలు అన్నింటికీ ఆంధ్రప్రదేశ్‌లోనూ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. ఆంధ్రాలో విశాఖ, విజయవాడ, తిరుపతిలో రీజనల్ కేంద్రాలు పనిచేస్తాయి.

17న కొత్త అసెంబ్లీ

ఎన్నికల ప్రక్రియలో భాగంగా దాఖలైన నామినేషన్ల గురించి ప్రకటిస్తారు. ఒకే నామినేషన్ దాఖలైతే సదరు ఎమ్మెల్యే స్పీకర్‌గా ఏకగ్రీవమైనట్లు ఆయన ప్రకటించి, సభాధ్యక్ష స్థానాన్ని అలంకరించాల్సిందిగా ఆహ్వానిస్తారు. సభ్యుల హర్షధ్వానాల మధ్య స్పీకర్‌గా ఏకగ్రీవమైన ఎమ్మెల్యేను సభాధ్యక్షుడైన ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రతిపక్ష నేత, మిగతా పక్షాల నాయకులు పోడియంపై ఉండే సభాక్ష స్థానానికి తీసుకెళ్ళి కూర్చోబెడతారు.

ఆ వెంటనే సభా నాయకుడు, ప్రతిపక్ష నేతలు, ఇతర ఎమ్మెల్యేలు స్పీకర్‌ను అభినందిస్తూ ప్రసంగిస్తారు. స్పీకర్ దానికి సమాధానంగా తనను ఉన్నతమైన స్థానంలోకి ఎన్నుకున్నందుకు సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తారు. స్పీకర్ సభను మరసటి రోజుకు వాయిదా వేస్తారు. సభ వాయిదాపడిన తర్వాత స్పీకర్ ఛాంబర్‌లో శాసనసభ వ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశం జరుగుతుంది.

19న గవర్నర్ ప్రసంగం

19వ తేదీ ఉదయం 11 గంటలకు గవర్నర్ నరసింహన్ ఉభయ సభల సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తారు. ఎమ్మెల్సీలు కూడా ఎమ్మెల్యేలతో పాటు అసెంబ్లీలో ఆసీనులవుతారు. గవర్నర్ సభా ప్రాంగణానికి చేరుకున్నప్పుడు స్పీకర్, కౌన్సిల్ చైర్మన్, సీఎం సాదరంగా ఆహ్వానిస్తారు.

20న ధన్యవాద తీర్మానం

ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగానికి కౌన్సిల్, అసెంబ్లీలో వేర్వురుగా తీర్మానాలు ప్రతిపాదించి ఆమోదిస్తారు. అదే రోజున ఉభయ సభలూ వాయిదాపడే అవకాశం ఉంది.

జోరుగా ఊహాగానాలు..

తెలంగాణలో సంక్రాంతి పండుగ పూర్తయ్యేంత వరకు 10 రోజుల పాటు పీడ దినాలుగా పరిగణిస్తారు. కాబట్టి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ రోజులు అయిపోయిన తర్వాతే అసెంబ్లీని సమావేశపరచాలని నిర్ణయించడం గమనార్హం. అయితే మంత్రివర్గ విస్తరణ కూడా చేయనున్నారా? అనే చర్చ, ఊహగానాలూ ఊపందుకున్నాయి. 18న స్పీకర్ ఎన్నిక ప్రక్రియ పూర్తయిన తర్వాత రాజ్‌భవన్‌లో ఆరుగురితో ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముహూర్తం ఖరారైనట్లు ప్రచారం జరుగుతున్నది. కానీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియ పూర్తయిన తర్వాత అసెంబ్లీలో అభినందన ప్రసంగాలు ఉంటాయి. సభ వాయిదా పడిన తర్వాత బీఏసీ సమావేశం ఉంటుంది కాబట్టి ఆ రోజున ఉండదన్న వాదన కూడా ఉంది.

పంచాయతీ పోరు తర్వాతే..

కాగా, పంచాయతీ ఎన్నికలకు ముందు మంత్రివర్గ విస్తరణ చేయరాదన్న నిబంధన ఏమీ లేదు. పంచాయతీ ఎన్నికల్లో ఎవరు కష్టపడ్డారు, ఫలితాలు ఎలా వచ్చాయి తదితర అంశాలన్నింటినీ కేసీఆర్ బేరీజు వేసుకుని మంత్రివర్గ విస్తరణకు ముహూర్తం ఖరారు చేస్తారని సీనియర్ ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు అభిప్రాయపడుతున్నారు. కాబట్టి 18న విస్తరణ జోలికి వెళ్ళరని వారు గట్టిగా చెబుతున్నారు.

ప్రొటెం స్పీకర్‌గా ముంతాజ్ అహ్మద్ ఖాన్

ప్రమాణం చేయిస్తారు. ఆ మర్నాడు (17న) ఉదయం 11.30 గంటలకు కొత్త అసెంబ్లీ కొలువు తీరనుంది. ఆ రోజున ప్రొటెం స్పీకర్ ఇటీవల అసెంబ్లీకి ఎన్నికైన ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయిస్తారు. తొలుత సభానాయకుడైన ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు, ఆ తర్వాత హోం మంత్రి, ప్రధాన ప్రతిపక్ష నేత, సీనియర్ సభ్యులతో ప్రమాణం చేయించిన తర్వాత ఇంగ్లీషు అక్షర క్రమంలో మిగతా సభ్యులను ఒక్కొక్కరితో ప్రమాణం చేయిస్తారు. ప్రొటెం స్పీకర్ కాకుండా మిగతా 118 ఎమ్మెల్యేలతో ప్రమాణం చేయించేందుకు ఒక్కొక్కరికీ 2 నిమిషాల సమయం పడుతుందని అంచనా. ఇలాఉండగా ముంతాజ్ అహ్మద్ ఖాన్ ఇప్పటి వరకు ఆరు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో 5 సార్లు యాకుత్‌పురా నియోజకవర్గం నుంచి గెలుపొందగా, ఈ దఫా చార్మినార్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ముంతాజ్ అహ్మద్ ఖాన్‌ను ప్రొటెం స్పీకర్‌గా నియమించినందుకు మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, లోక్‌సభ సభ్యుడు అసదుద్దీన్ ఒవైసీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

సీనియర్లకే ఛాన్స్

ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ సభ్యున్ని నియమిస్తారు. కొత్తగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణం చేయించడం, స్పీకర్ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసి, ఆ ప్రక్రియను పూర్తి చేస్తారు. స్పీకర్ ఎన్నిక కావడంతోనే ప్రొటెం స్పీకర్ పాత్ర ఏమీ ఉండదు.

తెలంగాణపై సవతి ప్రేమ

మరోసారి గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. 17 లోక్‌సభ సీట్లలో బీజేపీకి డిపాజిట్లు గల్లంతవుతాయని జోస్యం చెప్పారు. గతంలో ఒక్క లోక్‌సభ సీటులో బీజేపీ గెలుపొందిందని, ఈ సారి అక్కడ కూడా గెలవదని ఆయన తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు కేంద్రం సహాయం చేస్తూ, తెలంగాణను నిర్లక్ష్యం చేస్తోందని కేటీఆర్ తీవ్ర ఆరోపణ చేశారు.

ప్రజా కూటమి ఇంకా ఉందా?

ప్రజాకూటమి ఇంకా ఉందా? అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్‌ను ప్రజలు తిరస్కరించారని ఆయన అన్నారు. ఈవీఎంల ట్యాంపరింగ్ గురించి కంప్యూటర్లు కనుగొన్న ఏపీ సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని ఆయన మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

విజయ్ మాల్యా పరారైన..

ఆర్థిక నేరస్తుడిగా ప్రకటించాలంటూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టును అభ్యర్థించింది. ఆర్థిక నేరస్తులకు సంబంధించి కేంద్ర తీసుకొచ్చిన కొత్త చట్టం కింద వెలువడిన తొలి కేసు మాల్యాదే. అతడి ఆస్తులు స్వాధీనం చేసుకోవచ్చని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కోర్టు అనుమతి ఇచ్చింది. ఆర్థిక నేరగాళ్లను కట్టడి చేసేందుకు ఉద్దేశించిన బిల్లుకు 2018 ఆగస్టులో రాష్ట్రపతి ఆమోదం ముద్ర వేశారు. చట్టంలోని లొసుగులను ఆసరా చేసుకుని దేశం నుంచి పరారవుతున్న నిందితులకు శిక్ష పడేలా కొత్త చట్టం ఉపకరిస్తుంది.

గ్రామాలకు రూ. 1500 కోట్లు

భరిస్తోందన్నారు. అలాగే వీధి దీపాలకు అయ్యే విద్యుత్ వ్యయం పంచాయతీలే భరించేవని, ఇప్పుడు ఈ ఖర్చు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందన్నారు. ఈ కారణాల వల్ల పంచాయతీలపై ఆర్థిక భారం బాగా తగ్గుతోందని, ఇక ప్రజల మౌలిక సదుపాయాలపై దృష్టి కేంద్రీకరించేందుకు వీలవుతోందన్నారు. అన్ని గ్రామాల్లో మురుగునీటిపారుదల ప్రధానమైన సమస్యగా ఉందని రాజేశంగౌడ్ తెలిపారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు మార్గాలు అన్వేషిస్తున్నామన్నారు.

స్టడీ టూర్

వివిధ రాష్ట్రాల్లో పంచాయతీ వ్యవస్థ ఏ విధంగా ఉందో పరిశీలిస్తున్నామని రాజేశంగౌడ్ తెలిపారు. ఇప్పటికే తాము కర్నాటక, మహారాష్ట్రలలో పర్యటించి వచ్చామన్నారు. త్వరలోనే ఏపీలోని చిత్తూరు, విశాఖ జిల్లాలకు వెళ్తున్నట్టు తెలిపారు. అలాగే ఈనెలలో పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో పర్యటించనున్నట్టు ఆయన చెప్పారు. రాష్ట్రంలోని ప్రజల నుంచి కూడా అభిప్రాయాలు సేకరిస్తున్నామని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం తర్వాత తెలంగాణలోని పంచాయతీల పటిష్టతకు తీసుకోవాల్సిన చర్యలపై నివేదిక రూపొందిస్తామన్నారు.

తెలుగుదేశానికి కౌంట్‌డౌన్ మొదలు

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామచంద్రయ్య



కడప సిటీ, జనవరి 5: తెలుగుదేశం పార్టీకి కౌంట్‌డౌన్ మొదలైందని, అందుకే ఆ పార్టీ నేతల్లో అసహనం పెరిగిపోయిందని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సీ.రామచంద్రయ్య అన్నారు. కడప నగరంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసహనం పెరిగినందునే ఎవరు ఎలాంటి ప్రశ్న వేసినా చంద్రబాబు సహించలేకుండా ఉన్నారన్నారు. అందుకే తమ సమస్యలు చెప్పుకునేందుకు వచ్చిన మహిళలను కూడా ఫినిష్ చేస్తానని అంటున్నారన్నారు. ఏ పార్టీ అయినా సరే, ఎవరైనా సరే నీతో పెట్టుకుంటే నిజంగా ఫినిష్ అవుతారని ఎద్దేవా చేశారు. గతంలో వామపక్షాలు, బీజేపీ సైతం మీతో పెట్టుకునే ఫినిష్ అయ్యాయన్నారు. మొన్నటి తెలంగాణ ఎన్నికల్లో సైతం కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతైందన్నారు. ప్రజల డబ్బుకు ధర్మకర్తలా ఉండాల్సిన ముఖ్యమంత్రి సొంత డబ్బులా ప్రజాధనాన్ని మంచినీళ్లలా ఖర్చు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో అవినీతి లేనప్పుడే పరిశ్రమలు వస్తాయన్నారు. ఎన్నో కేసుల్లో బెయిల్‌పై ఉన్నారని, ఎన్నికల తర్వాత బాబుకు జైలు తప్పదన్నారు.

అసలు బీజేపీతో విభేదం వచ్చింది రాష్ట్ర ప్రయోజనాలకోసం కాదని, తాను కొనుగోలు చేసిన 23 మందికి సీట్లు సర్దుబాటు చేసుకునేందుకు నియోజకవర్గాల పెంపునకు అనుమతి ఇవ్వకపోవడమే ప్రధాన కారణమన్నారు. హైకోర్టు విభజన త్వరలో ఉంటుందని తెలిసినా ఎలాంటి ఏర్పాట్లు చేయలేదన్నారు. తాగునీరు, వ్యవసాయం, వైద్యం, రోడ్లులేకున్నా వీటికి ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకుండా సింగపూర్‌లో తిరగాల్సిన అవసరం ఏమిటన్నారు. ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారని, ఆయనను ఎవరూ రక్షించలేరన్నారు. రాజధాని నిర్మాణం కోసం చట్టాన్ని అతిక్రమించి లక్షల కోట్ల రూపాయలు అప్పులు చేశారన్నారు. నియంతలా మారి ప్రజలను అగచాట్లపాలు చేస్తున్నారని ఆరోపించారు. బాబు విఫలమైన నేత అని, ఆయన తన వైఫల్యాలను అంగీకరించక బీజేపీపై తోసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎవరి సహకారం లేనిదే ఏనాడు ఎన్నికల్లో గెలవని బాబు ప్రస్తుతం పవన్ కోసం అర్రులు చాస్తున్నారని ఎద్దేవా చేశారు. తన కేసులను ఎన్‌ఐఏకు బదిలీ చేయడంతో నిజాలు బయటపడతాయని ఆందోళన చెందుతున్నారన్నారు. బాబు ప్రతిపక్షాలను సరిగా పనిచేయించి ఉంటే జగన్మోహన్‌రెడ్డిప్రజల వద్దకు వెళ్లాల్సిన అవసరమే ఉండేది కాదన్నారు. గెట్ రెడీ ఫర్ గెట్ డౌన్ అంటూ చంద్రబాబును హెచ్చరించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ జనరల్ సెక్రటరీ శివశంకర్, పులి సునిల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాభూమి



రాహుల్ క్రీడా స్ఫూర్తికి ఫిదా..

వరుసగా ప్రతి మ్యాచ్‌లో విఫలమవుతున్న కేఎల్ రాహుల్ క్రీడా స్ఫూర్తికి అందరూ ఫిదా అయిపోయారు. మూడో రోజు ఆటలో రవీంద్ర జడేజా వేసిన మొదటి బంతికే ఆసీస్ ఓపెనర్ హారిస్ మిడ్ ఆన్ దిశగా షాట్ కొట్టాడు. అది నేరుగా రాహుల్ వైపు వెళ్లింది. వెంటనే డైవ్ చేసి అద్భుతంగా రాహుల్ బంతి పట్టుకున్నాడు. అయితే అంతా హారిస్ అవుట్‌గా భావించారు. కానీ రాహుల్ మాత్రం బంతి నేలను తాకిందని, అవుట్ కాదంటూ చేతులతో సిగ్నల్స్ ఇచ్చాడు. దీంతో ఆటగాళ్లతో పాటు మైదానంలో ఉన్న ప్రేక్షకులంతా రాహుల్ నిజాయితీకి ఫిదా అయ్యారు. చివరికి ఫీల్డ్ అంపైర్ ఇయాన్ గౌల్డ్ కూడా 'శభాష్ రాహుల్.. కీప్ ఇట్ అప్' అంటూ ప్రశంసించాడు. ఈ విషయమై ట్విట్టర్‌లోనూ రాహుల్‌పై ప్రశంసలు వెల్లువెత్తాయి.

ఎనిమిదేళ్ల తర్వాత..!

మళ్లీ బరిలోకి సిరియా

- ఆసియా కప్ ఫుట్‌బాల్ టోర్నీలో పాలస్తీనాతో తొలి మ్యాచ్

అబుదాబీ, జనవరి 5: అంతర్యుద్ధంతో అతలాకుతలవుతున్న సిరియా సుమారు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ అంతర్జాతీయ ఫుట్‌బాల్ రంగంలోకి దిగనుంది. ఆసియా ఫుట్‌బాల్ మండలి (ఏఎఫ్‌సీ) ఆధ్వర్యంలో జరిగే ఆసియా కప్ సాకర్ టోర్నమెంట్ గ్రూప్ దశ తొలి మ్యాచ్‌లో ఈ జట్టు చిరకాల ప్రత్యర్థి పాలస్తీనాను ఢీ కొంటుంది. గత ఏడాది జరిగిన వరల్డ్ కప్ సాకర్ చాంపియన్‌షిప్‌లో ఆడే అవకాశాన్ని సిరియా తృటిలో చేజార్చుకుంది. క్వాలిఫయర్స్ చివరి అడ్డంకిని సమర్థంగా అధిగమించలేక, నిరాశతో వెనుదిరిగింది. అప్పటి వైఫల్యాన్ని పక్కకుపెట్టి, ఆసియా కప్‌లో రాణించడం ద్వారా సత్తా చాటాలని సిరియా జాతీయ జట్టు భావిస్తున్నది. అయితే, ప్రభుత్వ వ్యతిరేక వర్గాలు ఈ జట్టు ఆటగాళ్లపై మండిపతున్నాయి. ప్రజా శ్రేయస్సును విస్మరించడమేగాక, వారి జీవితాలతో చెలగాటమాడుతున్న సర్కారుకు ఈ జట్టు ప్రాతినిథ్యం వహిస్తున్నదని సిరియాలో ప్రతిపక్ష వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇలావుంటే, జట్టు సభ్యులు మాత్రం తమకు లభించిన అవకాశాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ జార విడుచుకోరాదన్న పట్టుదలతో ఉన్నారు. 'ప్రపంచ కప్ చాంపియన్‌షిప్‌లో ఆడే అవకాశాన్ని కొద్దిలో చేజార్చుకున్నాం. అప్పట్లో చోటు చేసుకున్న పొరపాట్లను పునరావృతం కాకుండా జాగ్రత్త పడతాం. ఆసియా కప్‌లో శక్తి వంచన లేకుండా పోరాడతాం. టైటిల్ అందుకోవడమే లక్ష్యంగా ఆడతాం' అని జట్టు కీలక సభ్యుడు ముయాద్ అజాన్ అన్నాడు. ఈ టోర్నమెంట్‌కు అర్హత సంపాదించడమే తమ ప్రాథమిక విజయమని వ్యాఖ్యానించాడు. జట్టులోని మిగతా సభ్యులు కూడా ఇలాంటి అభిప్రాయమే వ్యక్తం చేస్తున్నారు. ఎసియా కప్‌లో తమను తాము నిరూపించుకునే ప్రయత్నంలో పడ్డారు.

భారత్ తొలి ప్రత్యర్థి థాయిలాండ్

'అండర్ డాగ్' ముద్రతో బరిలోకి దిగుతున్న భారత్‌కు థాయిలాండ్ తొలి ప్రత్యర్థి. ఆదివారం జరిగే ఈ మ్యాచ్‌లో గెలిచి, టోర్నమెంట్‌లో శుభారంభం చేయాలని భారత జట్టు పట్టుదలతో ఉంది. గతంలో ఈ టోర్నమెంట్‌లో 16 జట్లు ఆడేవి. తొలిసారి 24 జట్లతో నిర్వహిస్తున్నారు. 1964లో రన్నరప్స్‌గా నిలవడాన్ని మినహాయిస్తే, ఆసియా కప్ టోర్నీలో భారత్ ప్రదర్శన ఎన్నడూ చెప్పుకోదగిన రీతిలో లేదు. 1984, 2011 సంవత్సరాల్లో భారత్ నాకౌట్ దశకు కూడా చేరలేక, గ్రూప్ దశ నుంచే నిష్క్రమించింది. కాగా, ప్రస్తుతం బరిలో ఉన్న 24 జట్లను ఆరు గ్రూపులుగా విభజిస్తున్నారు. ఈ గ్రూపుల్లో మొదటి రెండు స్థానాలు సంపాదించిన జట్లకు 'రౌండ్ 16'లో చోటు లభిస్తుంది. అదే విధంగా పాయింట్ల పట్టికను అనుసరించి, మూడో స్థానంలో ఉన్న నాలుగు జట్లు కూడా 'రౌండ్ 16'కు చేరతాయి. గ్రూప్ దశ ముగిసిన తర్వాత, మ్యాచ్‌లన్నీ నాకౌట్ విధానంలోనే జరుగుతాయి. కాగా, కనీసం నాకౌట్ దశకు చేరడమే భారత జట్టు తొలి లక్ష్యంగా ఎంచుకుంది.

ప్చ్... అడ్డుపడ్డ వరుణుడు!

వెలుతురు లేమి, వర్షంతో మ్యాచ్‌కు అంతరాయం

- గంటన్నర ముందే ఆటను నిలిపేసిన అంపైర్లు
- చివరి టెస్టుపై పట్టు సాధించిన భారత్
- రాణించిన బౌలర్లు
- ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్ 6/236
- అర్ధ సెంచరీతో ఆకట్టుకున్న మార్కస్ హారిస్

సిడ్నీ, జనవరి 5: మ్యాచ్ చేతిలోకి వచ్చింది! ఇంకో నాలుగు వికెట్లు పడితే ఆస్ట్రేలియా మొదటి ఇన్నింగ్స్ ముగిసినట్లే! అవసరమైతే ఫాలో ఆన్ ఆడించి ఒక్కరోజు ముందుగానే మ్యాచ్‌ను గెలవొచ్చు అనుకున్నారంతా! కానీ అనూహ్యంగా వెలుతురు లేమి, వరుణుడు అడ్డుపడ్డాడు! మరో ఆలోచన లేకుండా గంటన్నర ముందే అంపైర్లు మూడోరోజు ఆట ముగిసినట్లుగా ప్రకటించారు! దీంతో చివరి సెషన్‌లో ఆసీస్‌ను ప్యాకప్ చేయాలని భావించిన టీమిండియాతో పాటు అభిమానులు నిరాశ చెందారు. సిడ్నీ మైదానంలో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ సిరీస్ చివరి టెస్టులో ఆస్ట్రేలియా బ్యాట్స్‌మెన్లు తడబడ్డారు. శనివారం మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 24తో బ్యాటింగ్ ప్రారంభించిన ఆసీస్ ఓపెనర్లు మార్కస్ హారిస్, ఉస్మాన్ ఖాజా నిలకడగా ఆడేందుకు ప్రయత్నించారు. వీరిద్దరూ కలిసి మొదటి వికెట్‌కు 72 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. ఈ క్రమంలో బౌలింగ్‌కు దిగిన కుల్దీప్ యాదవ్ ఖావాజా (27)ను అవుట్ చేశాడు. మిడ్ వికెట్‌లో ఉన్న పూజారాకు క్యాచ్ ఇవ్వడంతో ఖావాజా పెవిలియన్ బాట పట్టాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన ఆల్ రౌండర్ లాబుస్చాన్‌తో కలిసి హారిస్ జట్టు స్కోరును ముందుకు నడిపించాడు. 42.6 ఓవర్‌లో రవీంద్ర జడేజా వేసిన బంతికి హారిస్ (79) బౌల్డ్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన షాన్ మార్ష్ (8) జడేజా వేసిన బంతిని చెత్తగా ఆడి వికెట్ సమర్పించుకున్నాడు. అప్పటివరకు నిలకడగా ఆడిన లాబుస్చాన్ (38)ని షమీ అద్భుత బంతితో పెవిలియన్‌కు పంపాడు. అప్పటికీ ఆస్ట్రేలియా జట్టు నాలుగు వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. వరుసగా వికెట్లు పడుతుండగా క్రీజులో ట్రావిస్ హెడ్, పీటర్ హాండ్స్‌కాబ్ ఉన్నారు. వీరిద్దరూ క్రీజులో కుదురుకున్నాక కుల్దీప్ యాదవ్ వేసిన ఫుల్ టాస్ బాల్‌ను అంచనా వేయని హెడ్ (20) అతడికే క్యాచ్ ఇచ్చి ఐదో వికెట్‌గా అవుటయ్యాడు. అప్పటికీ మంచి ఫాంలో ఉన్న కుల్దీప్ ఆ తర్వాతి ఓవర్‌లోనే ఆసీస్ కెప్టెన్ టిమ్ పైన్ (5) ను బౌల్డ్ చేశాడు. 198 పరుగులకే ఆరు వికెట్లు కోల్పోయిన ఆస్ట్రేలియా పీకల్లోతు కష్టాల్లో పడింది. పైన్ తర్వాత క్రీజులోకి వచ్చిన కమ్మిన్స్, హాండ్స్‌కాబ్‌తో కలిసి నిలకడగా ఆడారు. వీరిద్దరూ కలిసి జట్టు స్కోరును ముందుకు నడిపించారు. ఇక చివరి సెషన్‌లో ఆసీస్‌ను ఆలౌట్ చేసి ఫాలో ఆన్ ఆడించాలన్న టీమిండియా ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. బ్యాడ్ లైట్‌కు తోడు వర్షం పడడంతో ఆటను గంటన్నరు ముందే అంపైర్లు నిలిపివేసారు. దీంతో నాలుగో రోజు ఆట గంటన్నరు ముందుగానే ప్రారంభం కానుంది. ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా ఆరు వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసి, ప్రత్యర్థి జట్టు కంటే 386 పరుగులు వెనుకబడి ఉంది. మరోవైపు చేతిలో నాలుగే వికెట్లు ఉండడంతో ఆసీస్‌కు ఫాలో ఆన్ ప్రమాదం పొంచి ఉంది. ఫాలో ఆన్ నుంచి గట్టేక్కాలంటే మరో 187 పరుగులు చేయాలి. భారత బౌలర్లలో కుల్దీప్ యాదవ్ మూడు వికెట్లు పడగొట్టగా, రవీంద్ర జడేజా 2, మహ్మద్ షమీ ఒక వికెట్ తీసుకున్నాడు.

ఫాలో ఆన్ ఆడిస్తారా?

మూడో టెస్టులో ప్రత్యర్థి జట్టును ఫాలో ఆన్ ఆడించే అవకాశమున్నా టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆ దిశగా నిర్ణయం తీసుకోలేదు. దీంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా వెనువెంటనే వికెట్లు కోల్పోయింది. ప్రస్తుతం చివరి టెస్టులోనూ ఆసీస్ జట్టును ఫాలో ఆన్ ఆడించే అవకాశముంది. ఆసీస్ ఫాలో ఆన్ తప్పించుకోవాలంటే 187 పరుగులు చేయాలి. చేతిలో నాలుగు వికెట్లు మాత్రమే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా నాలుగో రోజు ఒకవేళ తొందరగా ఆలౌట్ అయితే కోహ్లీ ప్రత్యర్థి జట్టును ఫాలో ఆన్ ఆడిస్తాడో లేదో అనేది చూడాలి.

స్కోర్ బోర్డు..

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7

ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: మార్కస్ హారిస్ (బీ) రవీంద్ర జడేజా 79; ఉస్మాన్ ఖాజా (సీ) పుజారా (బీ) కుల్దీప్ యాదవ్ 27; మామస్ లాబుస్చాన్ (సీ) రహానె (బీ) షమీ 38; షాన్ మార్ష్ (సీ) రహానె (బీ) రవీంద్ర జడేజా 8; ట్రావిస్ హెడ్ (సీ), (బీ) కుల్దీప్ యాదవ్ 20; పీటర్ హాండ్స్‌కాబ్ 28 (బ్యాటింగ్); టిమ్ పైన్ (బీ) కుల్దీప్ యాదవ్ 5; పాట్ కమ్మిన్స్ (బ్యాటింగ్)25;

ఎక్స్‌ట్రాలు: 6; **మొత్తం:** 236 (83.3ఓవర్లలో, 6 వికెట్ల నష్టానికి)

బౌలింగ్ : మహమ్మద్ షమీ 16-1-54-1, జస్ప్రీత్ బూమ్రా 16-4-43-0, రవీంద్ర జడేజా 27.3-9-62-2, కుల్దీప్ యాదవ్ 24-6-71-3.

పింక్ క్యాప్‌లతో మైదానంలోకి..



సిడ్నీ, జనవరి 5: ఆసీస్‌తో జరుగుతున్న చివరి టెస్టులో మూడో రోజు కోహ్లీ సేన పింక్ టోపీలతో మైదానంలోకి దిగింది. క్యాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు మూడో రోజును పింక్ డేగా పాటించారు. అలాగే ఆస్ట్రేలియా లెజెండరీ బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ ఫౌండేషన్‌కు విరాళాల కోసం గౌరవ సూచకంగా టీమిండియా ఈ క్యాప్‌లను ధరించింది. మెక్‌గ్రాత్ భార్య జేన్ మెక్‌గ్రాత్ 2008లో క్యాన్సర్‌తో పోరాడుతూ మృతి చెందింది. మెక్‌గ్రాత్ తన భార్య అనారోగ్యంతో ఉన్న రోజుల్లోనే 2005లో మెక్‌గ్రాత్ ఫౌండేషన్‌ను స్థాపించాడు. ఈరోజు వచ్చిన విరాళాలను క్యాన్సర్ బాధితులకు మెక్‌గ్రాత్ ఫౌండేషన్ ద్వారా అందిస్తారు.

నిరాశాజనకంగా స్టాక్ మార్కెట్!



ముంబయి, జనవరి 5: కొత్త సంవత్సరం మొదటి వారం భారత స్టాక్ మార్కెట్ అనుకున్నంత ఆశాజనకంగా కొనసాగలేదు. చివరిలో కొంత మెరుగుపడి, లాభాల బాట పట్టినప్పటికీ, స్థూలంగా చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ)లో లావాదేవీలు ఆశాజనకంగా లేవనే చెప్పాలి. వారం చివరి రోజైన శుక్రవారం 181.39 పాయింట్లు ఎగబాకి, 35,695.10 పాయింట్ల వద్ద ముగిసిన విషయం తెలిసిందే. వరుస నష్టాల నుంచి బయటపడిందన్న ఊరట తప్ప, అంతర్జాతీయ సూచీల కారణంగా స్టాక్ మార్కెట్‌కు నిరాశజనకమైన ఫలితాలు తప్పలేదు. వరుసగా రెండు రోజుల పతనం కారణంగా, ట్రేడింగ్‌కు చివరి రోజున కూడా అదే పరిస్థితి తప్పదనే అంతా అనుకున్నారు. కానీ, లావాదేవీలు మొదలైన తర్వాత అమ్మకాల ఒత్తిడి తగ్గింది. దేశీయ మదుపరులు ఆసక్తిని ప్రదర్శించడంతో కొనుగోళ్ల క్రమంగా పెరిగాయి. దీనితో లాభపడిన సెన్సెక్స్‌తోపాటు నిఫ్టీ కూడా 55.10 పాయింట్లు మెరుగుపడి 10,727.35 పాయింట్లుగా నమోదైంది.

స్థూలంగా చూస్తే, లావాదేవీల వారాంతపు లావాదేవీలు ఆశాజనకంగానే ఉన్నప్పటికీ, స్థూలంగా పరిశీలిస్తే సెన్సెక్స్ ఒడిదుడుకుల ప్రస్థానాన్ని కొనసాగించిందనే చెప్పాలి. వారం మొత్తంలో సెన్సెక్స్ 381.62, నిఫ్టీ 132.55 పాయింట్లు నష్టపోంది. శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్‌కు సెలవు కావడంతో, సోమవారం నుంచి ప్రారంభం కానున్న కొత్త వారంలో ఫలితాలు ఏ విధంగా ఉంటాయనేది ఆసక్తిని రేపుతున్నది. రాబోయే వారంలో అమెరికా, చైనా మధ్య వాణిజ్య పరమైన చర్చలు ప్రారంభం కానుండడంతో అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్స్ సానుకూల ధోరణను ప్రదర్శిస్తున్నాయి. అమెరికాకు చెందిన అధికారుల బృందం వచ్చే వారం చైనా వెళ్లనుంది. ఇప్పటికే అమెరికా, చైనా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, జీ జింగ్‌పిన్ ద్వైపాక్షిక వాణిజ్య చర్చలకు సానుకూలత వ్యక్తం చేయడంతో, ఇరు దేశాల అధికారుల చర్చలు సత్ఫలితాలనిస్తాయనే నమ్మకం వ్యక్తమవుతున్నది. రెండు దేశాల మధ్య కొంత కాలంగా కొనసాగుతున్న వాణిజ్య యుద్ధానికి తెరపడుతుందన్న నమ్మకం మార్కెట్ వర్గాల్లో కనిపిస్తున్నది. మొత్తం మీద అమెరికా, చైనా దేశాలు వాణిజ్యపరమైన అవగాహనకు వస్తాయనే అభిప్రాయం ప్రపంచ మార్కెట్‌ను, తత్ఫలితంగా భారత మార్కెట్‌ను ప్రభావితం చేసింది. ఈ చర్చలు విజయవంతమైతే, బీఎస్ఈ కూడా తిరిగి లాభాల బాట పట్టడం ఖాయం. ముడి చమురు ధర తగ్గడం, రూపాయి మారకపు విలువ బలడడం వంటి అంశాలు కూడా సెన్సెక్స్‌ను లాభాలబాట పట్టించడం ఖాయం. ప్రస్తుతం మార్కెట్‌లో సానుకూల ధోరణలు కనిపిస్తున్నప్పటికీ, వచ్చే వారం లావాదేవీలు మొదలైన తర్వాత ఏఏ సెంటిమెంట్లు, ఎంతెంత బలమైన పాత్రలు పోషిస్తాయనే దానిపైనే బీఎస్ఈ ట్రెండ్స్ ఆధారపడి ఉంటాయి. ఖచ్చితంగా లాభాలను ఆర్జిస్తాయని చెప్పలేకపోయినా, ట్రెండ్ సానుకూలంగానే ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

వాణిజ్యభూమి

ఆర్థిక సమస్యల నుంచి గట్టెక్కేందుకు

రూ.1500 కోట్ల రుణం

- ఎస్‌బీఐని ఆశ్రయించిన జెట్ ఎయిర్‌వేస్

న్యూఢిల్లీ, జనవరి 5: ఇప్పటికే పీకల్లోతు కష్టాల్లో మునిగితేలుతున్న దేశంలోని పెద్ద విమానయాన సంస్థ జెట్ ఎయిర్‌వేస్ భారీ రుణం కోసం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ)ని ఆశ్రయిస్తోంది. అప్పుల నుంచి బయటపడేందుకు 1500 కోట్ల రూపాయలు (215 మిలియన్లు) రుణం రూపేణా అందజేయాలని తాజాగా ఎస్‌బీఐని అభ్యర్థించిందని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈమేరకు ఈనెల 8న సంబంధిత రుణదాతలతో, ఎస్‌బీఐ అధికారవర్గాలతో సమావేశం నిర్ణయించనుంది. బ్యాంకు నుంచి వచ్చే రుణంతో సంస్థ పునరుద్ధరణ, పైలెట్లకు బకాయి పడిన జీతాలు, ఇతర సంస్థలు బకాయిల చెల్లింపుల ప్రక్రియ చేపట్టేందుకు వీలుంటుందని ఆ వర్గాలు పేర్కొన్నాయి. రుణదాతలతోపాటు విదేశాల నుంచి ఆర్థిక సాయం అందించేందుకు వచ్చే సంస్థలతోపాటు వ్యక్తులకు తిరిగి రుణం చెల్లించే ప్రక్రియపై సమగ్రంగా ఆ సమావేశంలో చర్చించనున్నట్టు తెలుస్తోంది. దేశంలో విమాన ఇంధన ధరలు ఆకాశాన్ని అంటుతున్నా దేశవాళీ మార్కెట్‌లో ఎదురవుతున్న మిగిలిన విమానయాన సంస్థల నుంచి ఎదురవుతున్న పోటీని తట్టుకునేందుకు జెట్ ఎయిర్‌వేస్ భారీగానే నిధులను వెచ్చిస్తూ వస్తోంది. కాగా, రుణదాతలు ఇచ్చే ఆర్థిక సహాయం జెట్ ఎయిర్‌వేస్‌లు నడిపేందుకు మాత్రమే ఉపకరిస్తాయని, కానీ ఈ నిధులు సంస్థ ఎదుర్కొంటున్న నిధుల సమస్యను శాశ్వతంగా పరిష్కరించే అవకాశాలు లేవని తెలుస్తోంది. ప్రస్తుతం 124 ఎయిర్‌క్రాఫ్ట్‌లను నడుపుతున్న జెట్ ఎయిర్‌వేస్ వీటిలో చాలా వరకు లీజులకు ఇచ్చింది. కాగా, డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) ఈనెల 7న జెట్ ఎయిర్‌వేస్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌తో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో సంస్థ నిధులు సమకూరడంతో పాటు పైలెట్లకు బకాయి పడిన జీతాలు, వివిధ రూపాల్లో చెల్లించాల్సిన బకాయిలపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

వడ్డీ రేట్లు తగ్గిస్తే యూకేను అధిగమించనున్న భారత్!

న్యూఢిల్లీ, జనవరి 5: బ్యాంకు కార్యకలాపాల్లో ప్రభుత్వ జోక్యం తగ్గడంతోపాటు వడ్డీ రేట్లను తగ్గిస్తే భారత్ ఆర్థిక వ్యవస్థలో యూకేను అధిగమించే అవకాశాలు ఉన్నాయని పలువురు ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఈ ఏడాది జరిగే దేశ సాధారణ ఎన్నికల్లోగా కీలమైన వడ్డీరేట్లను తగ్గించే దిశగా పూనుకుంటే భారత్ యూకే కంటే 5వ అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా రూపొందే అవకాశం ఉందని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది 2.8 శాతం ప్రపంచ వృద్ధి పెరగవచ్చునని నోమురా హోల్డింగ్ అంచనా వేసింది. భారత్‌లో ఎగుమతి, మాన్యుఫాక్చరింగ్, పెట్టుబడులు వంటివి బలహీనపడే అవకాశం ఉందని తెలిపింది. ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోల్చుకుంటే 2018లో భారత అభివృద్ధి రేటు ఎంతో పెరిగిందని తెలిపింది. అదేవిధంగా ఈ ఏడాది సైతం అతి పెద్ద యూకేను అధిగమించి ప్రపంచంలోనే ఐదో స్థానంలో భారత్ నిలబడేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొంది.

తగ్గిన పసిడి ధరలు

- కొనసాగిన వెండి ధరల పెరుగుదల

న్యూఢిల్లీ, జనవరి 5: వరుసగా మూడు రోజుల పాటు లాభాలు పంచిన పసిడి ధరలు తగ్గుముఖం పట్టాయి. వారాంతంలో పది గ్రాముల బంగారం ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 32,690 రూపాయలు పలికింది. డాలర్‌తో రూపాయి విలువ తగ్గడం ఇందుకు కారణమని ఆలిండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది. కాగా వెండి ధరల పెరుగుదల నమోదైంది. కిలో 40 వేల నుంచి 40,140కి పెరిగింది. పరిశ్రమ విభాగాలు, నాణాల మార్కెట్ నుంచి పెరిగిన డిమాండ్‌తో వెండి కిలో పై మొత్తం రూ.440 లాభ పడింది. భారత రూపాయితో పోలిస్తే డాలర్ విలువ బలహీన పడటం, స్థానిక జ్యువలరీ వ్యాపారుల నుంచి డిమాండ్ తగ్గడం బంగారం ధరపై ప్రభావం చూపిందని సరాఫా అసోసియేషన్ విశ్లేషించింది. కాగా, గడిచిన నాలుగు రోజులుగా బంగారం ధరలు రూ.565 పెరిగాయి. ఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛమైన బంగారం ధర రూ.145 తగ్గి తులం రూ.32,690 పలికింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛమైన బంగారం 32,540 వద్ద ట్రేడ్ అయింది. అయితే సవరం (8 గ్రాములు) బంగారం విలువలో మాత్రం మార్పు లేదు. సవరం బంగారం రూ. 25,200 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ బంగారం ధర రూ. 1293.61 అమెరికన్ డాలర్లతో లాభాల్లోనే ట్రేడైంది. న్యూయార్క్‌లో ఔన్స్ ధర 15.75 డాలర్లు పెరిగింది. అలాగే వెండి ధర 440 రూపాయలు పెరిగింది. వారానికి జరిగే సరఫరాను దృష్టిలో ఉంచుకుంటే వెండి నాణేల ధర కిలోపై 71 రూపాయలు పెరిగి 39,436 రూపాయలు పలికింది. వంద పీసుల వెండి కొనుగోళ్లలో రూ.76 వేలు, అమ్మకాల్లో రూ.77 వేల వంతున పలికింది.


బులియన్

ముంబయిలో		హైదరాబాద్‌లో	
బంగారం (22 క్యారెట్స్)		**బంగారం (22 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,128.00	1 గ్రాము:	రూ. 3,024.00
8 గ్రాములు:	రూ.25,024.00	8 గ్రాములు:	రూ. 24,192.00
10 గ్రాములు:	రూ. 31,280.00	10 గ్రాములు:	రూ. 30,240.00
100 గ్రాములు:	రూ.3,12,800.00	100 గ్రాములు:	రూ. 3,02,400.00
బంగారం (24 క్యారెట్స్)		**బంగారం (24 క్యారెట్స్)**	
1 గ్రాము:	రూ. 3,345.455	1 గ్రాము:	రూ. 3,234.225
8 గ్రాములు:	రూ. 26,763.64	8 గ్రాములు:	రూ. 25,873.8
10 గ్రాములు:	రూ. 33,454.55	10 గ్రాములు:	రూ. 32,342.25
100 గ్రాములు:	రూ. 3,34,545.5	100 గ్రాములు:	రూ. 3,23,422.5
వెండి		**వెండి**	
8 గ్రాములు:	రూ. 328.80	8 గ్రాములు:	రూ. 328.80
10 గ్రాములు:	రూ. 411.00	10 గ్రాములు:	రూ. 411.00
100 గ్రాములు:	రూ. 4,110.00	100 గ్రాములు:	రూ. 4,110.00
ఒక కిలో:	రూ. 41,100.00	ఒక కిలో:	రూ. 41,100.00

89 లక్షల టన్నుల నూనె గింజలు

పప్పు ధాన్యాల కొనుగోలు


- మూడేళ్ల గణాంకాలు లోక్‌సభకు వెల్లడించిన వ్యవసాయ మంత్రి



న్యూఢిల్లీ, జనవరి 5: 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి గడచిన డిసెంబర్ వరకు కేంద్ర ప్రభుత్వం మొత్తం 89 లక్షల టన్నుల నూనె గింజలను, పప్పు దినుసులను కొనుగోలు చేసింది. ఈ కొనుగోళ్లు తదుపరి కూడా కొనసాగుతాయని శుక్రవారం రాజ్యసభలో వ్యవసాయ శాఖ మంత్రి రాధా మోహన్ సింగ్ వెల్లడించారు. ప్రశ్నోత్తరాల సెషన్‌లో సభ్యుడు అడిగిన ప్రశ్నకు ఎగువ సభలో మంత్రి సమాధానమిస్తూ గడచిన 2010-2013 కాలంలో 8లక్షల టన్నులు మాత్రమే కొనుగోలు చేయగా గడచిన మూడేళ్ల కాలంలో ఈ కొనుగోళ్లు గణనీయంగా పెరిగాయని తెలిపారు. పీఎస్ఎస్ ద్వారా ఈ కొనుగోళ్లు జరుగుతున్నాయని వివరించారు. కాగా మరో ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రైతు ఉత్పత్తులకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) కల్పనకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. అధిగ దిగుబడుల కారణంగా బంగాళా దుంప లాంటి పలు ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పట్టినపుడు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి రైతులను ఆదుకున్నట్టు తెలిపారు.

కొలంబియాలో చమురు అన్వేషణ

- 70 శాతం వాటా పొందిన ఓవీఎల్



న్యూఢిల్లీ, జనవరి 5: మన దేశంలోని ఆయిల్ అండ్ నాచురల్ గ్యాస్ కార్పొరేషన్ (ఓఎన్‌జీసీ)కి చెందిన ఓఎన్‌జీసీ విదేశ్ లిమిటెడ్ (ఓవీఎల్) దక్షిణ అమెరికాలోని కొలంబియాలో చమురు అన్వేషణకు శ్రీకారం చుట్టింది. తాజాగా జరిపిన అన్వేషణలో రెండవ చమురు నిక్షేపాలను కనుగొన్నట్టు ఓఎన్‌జీసీ శనివారం తెలిపింది. సముద్రతీర ప్రాంతంలోని సీపీఓ-5 బ్లాక్‌లో గల ఇండికో-1 బావిలో ఈ చమురు నిక్షేపాలు కనుగొన్నట్టు పేర్కొంది. ఇందులో ఓవీఎల్ 70 శాతం వాటాను దక్కించుకోగా, మిగిలిన 30 శాతం కొలంబియాకు చెందిన పెట్రోడొరాడో సౌత్ అమెరికా ఎస్.ఏ.సుకుర్సన్ (పీడీఎస్‌ఏ) దక్కించుకోనుందని తెలిపింది. ఈ బావిని గత ఏడాది నవంబర్ 7న కనుగొనగా, తమ కంపెనీ డిసెంబర్ 15 నుంచి డ్రిల్లింగ్ పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టిందని పేర్కొంది. భూగర్భంలో 9,833 అడుగుల లోతున చమురు నిక్షేపాలు ఉన్నట్టు తెలిపింది. చమురు పరీక్షల సమయంలో రోజుకు కనీసం 4,000 బ్యారెల్స్ వంతున చమురును తీయవచ్చునని ప్రాథమిక అంచనాకు వచ్చామని పేర్కొంది. ప్రస్తుతం ఆ చమురు బావి ప్రాంతం పరీక్షల్లోనే ఉందని, దీనిపై పూర్తిగా అవగాహనకు వచ్చిన తర్వాత రోజుకు ఎంతమేరకు చమురు నిల్వలను బయటకు తీయవచ్చుననే తుది అంచనాకు వస్తామని తెలిపింది. కాగా, ఓవీఎల్ గతంలో ఇండికో-1 ప్రాంతానికి 6.5 కిలోమీటర్ల దూరంలోని మరిపోసా-1 బావిలో బ్లాకులో చమురు నిక్షేపాలు ఉన్నట్టు కనుగొంది. భవిష్యత్తులో మరిన్ని బావులను కనుగొని తవ్వకాలు జరిపేందుకు తమ కంపెనీ తగిన ప్రణాళికలు రూపొందిస్తోందని తెలిపింది.



జార్ఖండ్ మిథినీ నగర్‌లో ఆరు ప్రాజెక్టుల శుంకుస్థాపన సందర్భంగా ప్రధాని మోదీ, రాష్ట్ర గవర్నర్ ముర్మ, ముఖ్యమంత్రి రఘువర్‌దాస్

రుణమాఫీ తాత్కాలిక ఉపశమన చర్యే

ఆ పేరుతో రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్

❖ మేమనుకుంటే రూ. లక్ష కోట్లు మాఫీ చేసి ఉండేవారం

❖ పంట ఉత్పత్తుల గిట్టుబాటు ధరలు పెంచి రైతులను ఆదుకుంటాం ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ

డాల్టోన్‌గంజ్ (జార్ఖండ్), జనవరి 5: రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ పార్టీ తప్పుదోవబట్టిస్తోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రైతులను ఓటు బ్యాంకుగా పరిగణించడం సరైన చర్య కాదన్నారు. రైతులను బీజేపీ అన్నదాతగా చూస్తుందన్నారు.

రైతుల సంక్షేమం కోసం చిత్తశుద్ధిగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ఇక్కడ జరిగిన బ్రహ్మాండమైన ర్యాలీలో ఆయన మాట్లాడుతూ, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు తప్పనిసరిగా రుణాలను బ్యాంకుల నుంచి తీసుకోవాలని ప్రోత్సహించేదన్నారు. ఈ రోజు రుణమాఫీ పేరిట రైతులను ప్రలోభాలకు గురి చేస్తోందన్నారు. తమ పార్టీ రైతులను ఓటు బ్యాంకుగా పరిగణించి ఉంటే, రూ.1 లక్ష కోట్ల రుణాలను మాఫీ చేసేవారమన్నారు. రుణమాఫీ అనేది తాత్కాలిక ఉపశమన చర్యని, కాని తమప్రభుత్వం రైతుల పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధర లు లభించేటట్లు చర్యలు తీసుకుంటుందన్నారు. వ్యవసాయం లాభసాటి వృత్తిగా చేయడమలే తమ లక్ష్యమన్నారు. ప్రధాని మోదీ ఇక్కడ రూ.2391.36 కోట్లతో నిర్మించనున్న కోయల్ కరోమండల్ డ్యాంకు శంకుస్థాపన చేశారు. దీని వల్ల 19604 హెక్టార్ల భూమికి సాగు నీటిని అందిస్తారు. బిహార్‌లోని పొలాలకు కూడా సాగునీరు అందిస్తారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, కోయల్ అంటే ఎఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి తెలియదన్నారు. కోయల్ అంటే ఒక పక్షిపేరా లేక ఒక నదిపేరా అనుకుంటారని, ప్రాజెక్టు పేరు అనే విషయం తెలియదన్నారు. బిహార్, జార్ఖండ్ ముఖ్యమంత్రులు ఒక వేదికపైకి వచ్చి అభివృద్ధి కార్యక్రమాలను పంచుకోవడం మంచి పరిణామమన్నారు. సమాఖ్య వ్యవస్థకు ఇది మంచి స్ఫూర్తి అన్నారు. చాలా చోట్ల అనేక రాష్ట్రాలు నదీ జలాలు, ప్రాజెక్టుల నిర్మాణంపై తగాదాపడుతున్న తరుణంలో ఈ రెండు రాష్ట్రాలు ప్రదర్శించిన చొరవ హర్షణీయమన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలు ఈ మార్గంలో నడవాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన స్కీం కింద నిర్మించిన ఇళ్ల తాళం చెవులను ఐదుగురు లబ్ధిదారులకు ఆయన అందచేశారు. ఇండ్ల నిర్మాణంలో దళారులు, మధ్యవర్తుల పాత్రకు చరమగీతం పాడినట్లు చెప్పారు. రిమోట్ కంట్రోలు ప్రభుత్వం నడిపిన రోజుల్లో కేవలం 25 లక్షల ఇండ్లను నిర్మిస్తే, ఈరోజు 1.25 కోట్ల ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు. అందరికీ ఇండ్లను నిర్మించాలని, పేదలకు పంపిణీ చేయాలని లక్ష్యంతో తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. రాజకీయనేతల పేరుతో ఇండ్లనిర్మాణాన్ని చేపట్టాలన్న సంకల్పం తమకు లేదన్నారు. ఈ ఇండ్లలో అన్ని మౌలిక వసతి సదుపాయాలు ఉంటాయన్నారు.

8, 9న ప్రత్యేక దర్శనం

వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు తిరుమలలో ప్రత్యేక ఏర్పాట్లు

తిరుపతి, జనవరి 5: శ్రీవారి దర్శనం కోసం వచ్చే వయోవృద్ధులు, దివ్యాంగులకు ఐదేళ్ల లోపు చంటిపిల్లల తల్లిదండ్రులకు టీటీడీ సంతృప్తికరంగా ఏర్పాట్లుచేస్తోంది.ప్రతినెలా రెండు సామాన్య దినాల్లో వీరికి ప్రత్యేక ప్రవేశ దర్శనాలు కల్పిస్తోంది. ఇందులో భాగంగా జనవరి 8వ తేదీన వయోవృద్ధులు (65 సంవత్సరాలు పైబడిన వారు) దివ్యాంగులకు 4వేల టోకెన్లను టీటీడీ జారీచేయనుంది.



ఉదయం 10 గంటల స్లాట్‌కు వెయ్యి, మధ్యాహ్నం 2 గంటలకు 2వేల టోకెన్లు, 3 గంటల స్లాట్‌కు వెయ్యి టోకెన్లు జారీ చేస్తారు. వృద్ధులు, దివ్యాంగులు రద్దీరోజుల్లో తిరుమలకు వచ్చి ఇబ్బందులు పడకుండా, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ కోరుతోంది. ఎస్వీ మ్యూజియం ఎదురుగా గల కౌంటర్ల వద్ద వృద్ధులు, దివ్యాంగులకు ప్రతిరోజూ 1400 టోకెన్లు జారీచేస్తున్నారు. ఇక్కడ ఉదయం 7 గంటల నుంచి ప్రారంభించి రెండు స్లాట్‌లకు సంబంధించిన టిక్కెట్లు కేటాయిస్తారు. కావున భక్తులు ముందుగావచ్చి టిక్కెట్లకోసం వేచి ఉండాల్సిన ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామివారి దర్శనం కల్పిస్తారు. 5 సంవత్సరాలలోపు చంటిపిల్లలను, వారి తల్లిదండ్రులను జనవరి 9వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు సుపథం మార్గం ద్వారా దర్శనానికి అనుమతిస్తారు. సాధారణ రోజుల్లో ఒక సంవత్సరం లోపు చంటిపిల్లలకు, వారి తల్లిదండ్రులకు సుపథం మార్గం ద్వారా ప్రవేశం కల్పిస్తారు. భక్తులకోరిక మేరకు ఐదేళ్లలోపు చంటిపిల్లలను, వారి తల్లిదండ్రులను ఈ రెండురోజుల్లో సుపథం మార్గం ద్వారా అనుమతిస్తారు. భక్తులు ఈవిషయాన్ని గమనించి సద్వినియోగం చేసుకోవాలని టీటీడీ కోరుతోంది.



దుర్గమ్మ హుండీల ఆదాయం రూ. 2.85 కోట్లు

విజయవాడ (ఇంద్రకీలాద్రి) జనవరి 5: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న కనకదుర్గమ్మవారి సన్నిధిలో హుండీలను దేవస్థానం ఈవో వీ కోటేశ్వరమ్మ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది లెక్కించగా 2కోట్ల, 85లక్షల, 19వేల, 240 రూపాయలు లభించాయి. శ్రీమల్లికార్జున మహామండపం 6వ అంతస్తులో గత వారం రోజులకు అమ్మవారి సన్నిధిలో ఉన్న మొత్తం హుండీలను శుక్ర, శనివారాల్లో లెక్కించగా ఈ నగదుతోపాటు, 367 గ్రాముల బంగారం, 23కిలోల, 60గ్రాముల వెండి లభించాయి. ఈ లెక్కింపు కార్యక్రమంలో మాన్ని శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం కమిటీ చైర్మన్ వి గౌరంగబాబు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకా తిరుమలేశునికి హస్తినలో కల్యాణ వైభోగం

ఆంధ్రభూమి ప్రతినిధి

న్యూఢిల్లీ, జనవరి 5: పశ్చిమ గోదావరి జిల్లాలోని ద్వారకా తిరుమల శ్రీ వెంకటేశ్వరుని సహస్రనామార్చన, కళ్యాణోత్సవం దేశ రాజధాని గోల్ మార్కెట్‌లోని శ్రీ బాలాజీ మందిర్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఏపీ ప్రభుత్వం ఆధ్వర్యంలో దేవస్థానం సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్న తిరుపతిగా పేరుగాంచిన ద్వారకా తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం ప్రధాన అర్చకులు పెద్దింటి జగన్నాధాచార్యులు నేతృత్వంలో అర్చక బృందం పూజా కార్యక్రమాలను నిర్వహించింది.



సభలో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

గ్రామాలకు వైద్యం చేరువ కావాలి

వైద్యులకు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపు



ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, జనవరి 5: సమాజ హితమే పరమావధిగా వైద్యులు ప్రజలకు వైద్య సేవలు అందజేయాలని భారత ఉపరాష్ట్రపతి ఎం వెంకయ్యనాయుడు వైద్యులకు పిలుపునిచ్చారు. మానవాళి మనుగడకు విద్య, వైద్యం అతి ముఖ్యమైన అవసరాలని, వీటి ప్రోత్సాహానికి అందరూ కృషిచేయాలన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు అతి తక్కువ ఫీజులతో నాణ్యమైన వైద్య సహాయం అందించడానికి వైద్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా కేంద్రం కాకినాడ నగరానికి శనివారం ఉదయం వచ్చారు. రాష్ట్రంలోనే పేరుపొందిన కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన కళాశాల వజ్రోత్సవం, పూర్వవిద్యార్థుల సంఘం రామ్‌కోసా స్వర్ణోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రసంగిస్తూ పేదలకు వైద్య సేవలు అందజేయాలనే సేవా ధృక్పథంతో రంగరాయ వైద్య కళాశాల స్థాపనకు డాక్టర్ ఎంవీ కృష్ణారావు, కల్నల్ డిఎస్ రాజు, పిఠాపురం మహారాజులు కృషిచేశారని తెలియజేశారు. ఆ దాతలను స్మరిస్తూ వారి వారసులను వజ్రోత్సవం సందర్భంగా సత్కరించడం మరింత మందికి స్ఫూర్తినిస్తుందన్నారు. వేదకాలం నుండి తోటి వారితో మంచి, అనురాగాన్ని పంచుకోవడం భారతీయ తత్వ చింతనలో ప్రధాన అంశమని చెప్పారు. అందరూ ఆరోగ్యంగా ఉండాలని కోరే సర్వేసంతు నిరామయ అనే శ్లోకాన్ని కళాశాల లోగోలో పొందుపరచిన విధానం తనకు ఎంతగానో సంతోషం కలిగించిందని ఆయన అన్నారు. భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు విద్యా విధానంలో సమూలమైన మార్పు రావాలని, దేశ ఘనచరిత్ర, మహనీయుల వివరాలను మన పిల్లలకు తప్పనిసరిగా తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందని ఉపరాష్ట్రపతి చెప్పారు. పూర్వ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ రంగరాయ వైద్యకళాశాల భవనాన్ని ప్రారంభించడం, ప్రఖ్యాత శాస్త్రవేత్త జేబీఎస్ ఆస్టేన్ తన పార్థీవ దేహాన్ని విద్యార్థుల పరిశోధనల నిమిత్తం కళాశాల పాథాలజీ విభాగానికి అందించడం అపూర్వ ఘట్టాలుగా అభివర్ణించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమాణాల ప్రకారం ప్రతి వెయ్యిమందికి ఒక వైద్యుడు ఉండాలని, ఇందుకు ప్రతి జిల్లాలో ఒక వైద్య కళాశాల, ఒక సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని పబ్లిక్ ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. అంటురోగాలను అరికట్టడంలో మనం సఫలమైనప్పటికీ లోపభూయిష్టమైన జీవన శైలితో వచ్చే రక్తపోటు, డయాబిటీస్, ఒబిసిటీ, గుండె జబ్బులు పెరగడం ఆందోళన కలిగిస్తోందని ఆయన పేర్కొన్నారు. జీవనశైలి వ్యాధుల పట్ల వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించాలని, వాటిని అరికట్టేందుకు పాటించాల్సిన ఆరోగ్య, ఆహార, విషయాలను ప్రతీ ఒక్కరికీ తెలియజేయాల్సిందిగా వైద్యులకు పిలుపునిచ్చారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 70 సంవత్సరాలు అయినప్పటికీ దేశంలో ఇప్పటికీ 20శాతం ప్రజలు పేదరికంలో ఉన్నారని ఆవేదన వెలిబుచ్చారు. నేటికీ 21శాతం మంది నిరక్షరాస్యతలో మగ్గుతున్నారని, లింగ, కుల వివక్ష జాడ్యాలు నేటికీ కొనసాగుతుండంపట్ల ఆయన విస్మయాన్ని వ్యక్తపరిచారు. సవాళ్లపై అదరూ కలసి కట్టుగా పోరాడదామని, ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన సరళతర విధానాలతో యావత్ ప్రపంచం దృష్టి భారతదేశం వైపే ఉందని, 2025నాటికి మన దేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని జోశ్యం చెప్పారు. ప్రతీ పని ప్రభుత్వమే చేయాలనే ఆలోచనను ప్రజలు విడనాడి, సమాజాభివృద్ధికి తమ వంతు బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వర్తించాలని, పరిసరాలు, పర్యావరణాన్ని కాపాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన సందేశం ద్వారా ప్రజలకు పిలుపునిచ్చారు. ముందుగా వేడుకలను ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. అనంతరం ఆర్ఎంసీ థీమ్ సాంగ్ సీడీ, వజ్రోత్సవ వేడుకల సీడీ, సావనీర్‌ను, డాక్టర్ జి సురేంద్ర రూపొందించిన ఆంధ్రచరిత్ర డాక్యుమెంటరీని ఆవిష్కరించారు. అదే విధంగా కళాశాల అభివృద్ధికి సేవలు అందజేసి డాక్టర్ సుందర శివరావు విగ్రహాన్ని, ఆర్ఎంసి, రామ్‌కోసా, జిల్లారెడ్ క్రాస్ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రామ్‌కోసా పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు పి వెంకటరామారాజు, జి పుల్లారావు, కెఎల్ నారాయణ, యం చంద్రమౌళీశ్వరరెడ్డి, ఎస్ఎస్‌సి చక్రరావు, కెఎల్ సంపత్‌కుమార్, ఎన్ నగేష్‌బాబు, వాడ్రేవు రవి, యండి కెఎస్‌పిఎల్ కెవి రావు, డాక్టర్ గన్ని భాస్కరరావు, డాక్టర్ బొల్లినేని బాస్కర్, ఉపరాష్ట్రపతి సత్కరించారు.

ఉత్తమ సేవా పతకాలను డాక్టర్ ఎస్ చంద్రశేఖర్, డాక్టర్ వికె రాజు, డాక్టర్ డి రాఘవరావుకు ప్రదానం చేశారు. ఈవేడుకల్లో ఉపముఖ్యమంత్రి నిమ్మకాయల చినరాజప్ప, పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ కెవిపి రామచంద్రరావు, మాజీ మంత్రి, కళాశాల పూర్వవిద్యార్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, రామ్‌కోసా అధ్యక్షులు డాక్టర్ జి శేషగిరిరావు, ఆర్ఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ ఆది మహాలక్ష్మి, పూర్వ, ప్రస్తుత విద్యార్థులు పాల్గొన్నారు.

Printed and Published by T. Venkateswarlu on behalf of Deccan Chronicle Holdings Ltd. Printed at Deccan Chronicle Press situated at Plot No. 9, Alwal Village, Vallabh Nagar Taluk, Medchal Malkajgiri Dist., Telangana and Published at 36, S.D. Road, Secunderabad-3, Chief Editor T.V.Ravi Reddy, PBX 27803930 (6Lines), Editorial: 27805056, Regd.No.H/SDHO-4/2K RNI Regd.No.5595/60

కొత్త తరంతోనే బరిలోకి

నా పార్టీకి వెన్నెముక యువతే ❖ ఈ ఎన్నికలు ప్రారంభం మాత్రమే ❖ జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్



పార్టీ ఎన్నికల గుర్తు గాజుగ్లాసు చూపిస్తున్న పవన్‌కళ్యాణ్


విజయవాడ(సిటీ), జనవరి 5: కళాశాల నుండి పట్టాలు తీసుకోకపోయినా, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ పాలసీలు, దేశంలో కులాల ప్రభావం వంటి అంశాలపై సంపూర్ణమైన అవగాహనతో పాటు, పూర్తిగా అర్థం చేసుకున్నానని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. విజయవాడలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ప్రకారం, చిత్తూరు జిల్లాలకు చెందిన పార్టీ నాయకులు, శ్రేణులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ నేడు రాజకీయాలు వ్యాపారంగా మారిన తరుణంలో వచ్చే ఎన్నికలకు 2 వేల కోట్ల రూపాయల చొప్పున ఖర్చు చేసేందుకు కొన్ని రాజకీయ పక్షాలు సన్నద్ధంగా ఉన్నాయని, అయితే ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయకుండా వాటిని ఎదుర్కొనేందుకు జనసేన సిద్ధపడుతోందన్నారు. నాడు డబ్బులేకపోయినా 2014 ఎన్నికల్లో జనసేన ప్రభావం చూపిందన్నారు. నాటి ప్రజారాజ్యం పార్టీతో సామాజిక న్యాయం తప్పకుండా జరిగేదని, కాని ఓపిక లేని, నీతి లేని నాయకుల కారణంగానే నాడు చిరంజీవి నష్టపోయారన్నారు. తనకు, పార్టీకి యువతే వెన్నెముక అన్నారు. నూతన తరంతోనే వచ్చే ఎన్నికల్లో రిస్క్ తీసుకుని బరిలోనికి దిగనున్నట్లు ప్రకటించారు. నిర్దిష్ట భావజాలం లేని పార్టీలు రాజ్యాలు ఏలుతున్న తరుణంలో కొత్త పార్టీ పెట్టడానికి సమయం ఆసన్నమయిందని భావించి, పరిస్థితులు ప్రతికూలంగా ఉన్న సమయంలోనే జనసేన ఆవిర్భవించిందన్నారు. తనకు సినిమాల్లో నటన ఎప్పుడూ పూర్తి సంతృప్తి ఇవ్వలేదని, ప్రజాసమస్యలు పరిష్కరించిన నాడే సంపూర్ణమైన ఆనందం కలుగుతుందన్నారు. సినిమాల్లోకి రాకముందునుంచే సమాజాన్ని క్షుణ్ణంగా అర్థం చేసుకున్నట్లు తెలిపారు. పీఆర్పీ ఆవిర్భావానికి బలమైన పాత్రను పోషించిన వారిలో తాను ఒకడినన్నారు. పార్టీ ఏర్పాటు కోసం చిరంజీవికి ఎంతో ప్రేరణ కలిగించానని చెప్పారు. చిరంజీవితో నాడు సామాజిక న్యాయం జరిగి ఉండేదని, కాని ఓపిక లేని నాయకులు పార్టీలో చేరినందున ఆ అవకాశం చేజారిందన్నారు. జనసేన ఆవిర్భావంలో తనతో పెద్ద నాయకులు ఎవరూ లేరని, యువతను నమ్మి తాను పార్టీని స్థాపించానని, తనకు, తన పార్టీకి యువతే వెన్నెముక అన్నారు. జనసేన మాతో కలిసి వస్తుందని ఇతరులు ప్రచారం చేసుకునే స్థాయికి నేడు జనసేన వెళ్లిందంటే ఇదే మన విజయానికి తొలి మెట్టుగా అభివర్ణించారు.

పీఆర్పీ అనుభవంతో దీర్ఘకాలిక ప్రయోజనం కోసం ఆచితూచి అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. రాజకీయాలు సంపూర్ణంగా వ్యాపారంగా మారాయని, ప్రజల పెన్షన్లు, రేషన్ కార్డులు వంటి సమస్యలు పరిష్కరించే ఓపిక కూడా నేటి తరం నేతల్లో లేదన్నారు. కులాలు, మతాల్ని చూసి ప్రకృతి వైపరీత్యాలు నష్టాన్ని కలిగించవన్నారు. అన్ని కులాల వారు ప్రకృతి దృష్టిలో సమానమేనన్నారు.

టీడీపీకి కాక పుట్టిస్తున్న ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్

తూర్పులో చంద్రబాబును అడ్డుకున్న బీజేపీ మహిళా మోర్చా • పశ్చిమ పర్యటనలోనూ అడ్డుకునేందుకు బీజేవైఎం వ్యూహం

భీమవరం, జనవరి 5: కొద్ది రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్‌లో మేరా బూత్ - సబ్ సే మజ్‌బూత్ పేరుతో నిర్వహించిన బీజేపీ వీడియో కాన్ఫరెన్స్ ఇప్పుడు తెలుగుదేశం పార్టీకి కాక పుట్టిస్తోంది. ఐదు పార్లమెంటు పరిధుల్లోని బూత్ కార్యకర్తలతో మాట్లాడిన ప్రధాని నరేంద్ర మోదీ కార్యకర్తలు సత్యమే మాట్లాడాలి.. ఎవరైనా తప్పుచేస్తే ప్రశ్నించండి.. అంటూ పిలుపునిచ్చారు. దీంతో తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో జన్మభూమి మన ఊరు కార్యక్రమానికి హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కాన్వాయ్‌ని ఆ నగర కార్పొరేటర్, భారతీయ జనతా మహిళా మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లక్ష్మీప్రసన్న నిలిపివేసి ప్రశ్నించిన సంఘటన రాష్ట్రంలో సంచలనం కలిగించింది. దీన్ని ఓర్వలేక తెలుగు తమ్ముళ్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ ఇంటిని ముట్టడించిన సంగతి తెలిసిందే. దీంతో అటు తెలుగుదేశం పార్టీ, ఇటు భారతీయ జనతా పార్టీ మధ్య విభేదాలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన నాటి నుంచి సీఎం చంద్రబాబు నాయుడు భారతీయ జనతాపార్టీని, ప్రధాని నరేంద్ర మోదీని టార్గెట్ చేస్తూ చాలా ఘాటుగా విమర్శలు చేయడం తెలిసిందే. అదే విధంగా ధర్మపోరాట దీక్షలు పెట్టి పదేపదే మోదీని, బీజేపీని విమర్శించడం అదే పనిగా చేస్తున్నారు. దీనికి కౌంటర్‌గా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ చంద్రబాబుకు ఐదు ప్రశ్నలను సంధించడం ప్రారంభించారు. వీటికి చంద్రబాబు సమాధానం కూడా ఇవ్వడం లేదు. పైగా రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి తన పుణ్యమేనంటూ చంద్రబాబు నాయుడు చెబుతుండగా వాటికి నిధులు ఇచ్చింది తామేనంటూ మరోపక్క బీజేపీ నేతలు కన్నా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఉత్తరాంధ్ర నుంచి ఎమ్మెల్సీ మాధవ్ కౌంటర్లు ఇస్తూనే ఉన్నారు. ఇదిలా ఉండగా కాకినాడలో లక్ష్మీప్రసన్నను ఉద్దేశించి మాట్లాడిన బాబు మిమ్మల్ని తిరగనివ్వం అంటూ చేసిన వ్యాఖ్యలను భారతీయ జనతా పార్టీ సీరియస్‌గా తీసుకుంది. అంతేకాకుండా తిరుమల వచ్చిన బీజేపీ ఆలిండియా అధ్యక్షుడు అమిత్ షాను, రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ పర్యటనలను తెలుగుదేశం పార్టీ నేతలు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే బాబూ.. ఏది మా జాబు.. అనే నినాదంతో భారతీయ జనతా యువమోర్చ (బీజేవైఎం) అధ్యక్షుడు నాగోతు రమేష్‌నాయుడు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమం విజయవంతం అయ్యింది. తెలుగుదేశం ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపునందుకుని భారతీయ జన తా యువమోర్చ సత్యం మాట్లాడుతూనే చంద్రబాబు నాయుడుని ప్రశ్నించాలని నిర్ణయించుకున్నట్లు అత్యంత విశ్వసనీయంగా తెలిసింది. ఇదిలా ఉండగా ఈ నెల 7వ తేదీన పశ్చిమ గోదావరి జిల్లాలో సీఎం పర్యటనను అడ్డుకునేందుకు బీజేవైఎం వ్యూహరచన చేస్తున్నట్టు సమాచారం.



వెన్నెల

ఆంధ్రభూమి ఆదివారం, 6 జనవరి 2019

తెలుగు లోగిళ్లు కొత్త హంగామాతో పండగకు సిద్ధమవుతున్నాయి. తెలుగువారికి ఇష్టమైన పండగ సంక్రాంతి. తెలుగు జనాలకే కాదు.. సినిమాకూ సంక్రాంతి అంటే ఎంతిష్టమో ఆయా పండగ రోజున వచ్చే సినిమాలే చెబుతాయి. తెలుగు సినిమా పుట్టిన దగ్గరనుంచి సంక్రాంతి సంబరాలు.. భారీ సినిమాలమధ్య పోటీ.. ఈ సీజన్‌లో ఆడియన్స్‌ను ఆకట్టుకునేందుకు స్టార్ హీరోలు ముందునుంచే సిద్ధమవ్వడం పరిపాటిగా వస్తున్నదే. తెలుగు పండగల్లో పెద్ద పండుగగా భావించే సంక్రాంతికి ఏటా మూడు నాలుగు సినిమాల మధ్య గట్టి పోటీ ఉంటుంది. కలెక్షన్లు కూడా అదే రేంజ్‌లో ఉంటాయి. సంక్రాంతికి రిలీజైన సినిమా యావరేజ్ అనిపించుకుంటే చాలు కలెక్షన్స్ వచ్చేస్తాయి. ఇక హిట్ టాక్ వస్తే బ్లాక్‌బస్టర్ రేంజ్ వసూళ్లు పక్కా.. అందుకే సంక్రాంతి సీజన్‌పై ఎప్పుడూ కొందరు హీరోలు స్పెషల్ ఫోకస్ పెట్టి మరీ సినిమాలు సిద్ధం చేస్తుంటారు. కాలగమనంలో మరో ఏడాది గడిచిపోయింది. మళ్లీ సంక్రాంతి రానే వచ్చింది. మరి ఈ సంక్రాంతికి సినిమాల మధ్య పోటీ ఎలా ఉంటుంది? రానున్న సినిమాలు జనాలను ఏ రేంజ్‌లో ప్రభావితం చేస్తాయో చూడాలి.

....హౌస్ ఫుల్!



-శ్రీనివాస్ ఆర్ రావ్

సంక్రాంతి సినిమా కోసం ఎదురు చూస్తున్న తెలుగు ప్రేక్షకుల ముందుకు ఈ ఏడాది మూడే స్ట్రెయిట్ సినిమాలు వస్తున్నాయి. అవీ స్టార్ హీరోల చిత్రాలు. మూడూ భారీ బడ్జెట్ సినిమాలే కావడంతో చిన్న సినిమాలు పండుగ రేస్‌నుంచి పక్కకు తప్పుకున్నాయి. పండుగ సినిమా లిస్ట్‌లో ప్రధానంగా చెప్పుకోవాల్సింది యన్‌టిఆర్ బయోపిక్. లిస్ట్‌లో తరువాతి సినిమా -వినయ విధేయ రామ. ఈ రెండు చిత్రాలూ గత కొన్ని రోజులుగా ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ రెండూ భారీ విజయాలు దక్కించుకుంటాయన్న నమ్మకంతో ఉన్నారు నందమూరి, మెగా ఫ్యాన్స్. అటు సినిమారంగంలో, ఇటు రాజకీయ రంగంలో చరిత్ర సృష్టించిన వ్యక్తి యన్‌టిఆర్. తండ్రి జీవితంలోని సినిమా, రాజకీయ ముఖ్య ఘట్టాలను తెరకెక్కించేందుకు సిద్ధమయ్యాడు సీనియర్ హీరో బాలకృష్ణ. అలా రెండు భాగాలుగా తెరకెక్కిన చిత్రమే యన్‌టిఆర్. సంక్రాంతి సినిమాగా మొదటి భాగమైన యన్‌టిఆర్ సినిమా చరిత్రలోని ముఖ్య ఘట్టాలను 'కథానాయకుడు'గా తెరకెక్కించారు. రాజకీయ ప్రస్తానంలోని ముఖ్య ఘట్టాలను 'మహానాయకుడు'గా తెరకెక్కించారు. ఈ రెండు భాగాలూ బాలయ్య కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు దక్కించుకుంటాయని అభిమానులు నమ్మకంతో ఉన్నారు.

ప్రతి సంక్రాంతికీ ఏదోక సినిమాతో ప్రేక్షకుడిని ఎంటర్‌టైన్ చేయడం బాలయ్య స్టయిల్. గడచిన ఏడాది 'జైసింహ'తో వచ్చినా సరైన ఫలితాన్ని అదుకోలేకపోయాడు. ఈసారి 'కథానాయకుడు' నిరాశపర్చదన్న నమ్మకంతో మాత్రం ఉన్నాడు. యన్‌టిఆర్ -కథానాయకుడు జనవరి 9న, మహానాయకుడు ఫిబ్రవరి 7న విడుదలవుతున్నాయి. విఖ్యాత నటుడు, రాజకీయ నేత నందమూరి తారక రామారావు జీవిత కథలోని ముఖ్య ఘట్టాలు కావటంతో ఇప్పటికే సినిమా కోసం ట్రేడ్ వర్గాలు, ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. పైగా ఈ సినిమాలో నటిస్తున్న తారాగణం కూడా ఆసక్తి రేకెత్తించేదే. ఎన్టీఆర్ స్క్రీన్‌లైఫ్‌లోని ముఖ్యమైన సహా పాత్రలను స్టార్లు, సీనియర్లు పోషిస్తుండటం మరింత ఆసక్తి రేకెత్తిస్తోంది. చిత్రానికి దర్శకత్వం వహిస్తున్న క్రిష్ కెవి రెడ్డి పాత్రను పోషి

తెలుగువాళ్లకు సంక్రాంతి పండుగంటే పిండివంటలు.. కోడిపందాలు.. కొత్త సినిమాలే. గత ఏడాది సంక్రాంతికి వచ్చిన రెండు సినిమాలు (అజ్ఞాతవాసి, జైసింహా) ఆడియన్స్‌ని నిరాశపర్చాయి. ఈసారి మూడు (కథానాయకుడు, వినయ విధేయ రామ, ఎఫ్-2) ఎలాంటి వినోదాన్ని అందిస్తాయో చూడాలి.

స్తుంటే, ఎన్టీఆర్ భార్య బసవతారకం పాత్రను బాలీవుడ్ నటి విద్యాబాలన్ పోషిస్తుండటం తెలిసిందే. అక్కినేని మనవడు సుమంత్ ఏయన్నార్‌గా, ప్రకాష్ రాజ్- నాగిరెడ్డి, బ్రహ్మానందం -రేలంగి, సత్యనారాయణ -హెచ్‌ఎం రెడ్డి, శుభలేక సుధాకర్ -పి పుల్లయ్య, ఎస్‌వి కృష్ణారెడ్డి -కమలాకర కామేశ్వర రావు, చంద్రసిద్ధార్థ -దాసరి నారాయణ రావు, ఎన్ శంకర్ -విఠలాచార్య, శ్రీనివాస్ అవసరాల -డివి నరసరాజు, రామజోగయ్య శాస్త్రి -సి నారాయణ రెడ్డి, శివశంకర్ మాస్టర్ -వెంపటి చినసత్యం, కమెడియన్ భద్రం -పేకేటి శివరామ్ కనిపించనున్నారు. ఎన్టీఆర్‌తో జోడీకట్టి సెన్సేషన్ సృష్టించిన ఆనాటి హీరోయిన్ల జాబితాలో సావిత్రిగా నిత్యమీనన్, శ్రీదేవిగా రకుల్‌ప్రీత్ సింగ్, కృష్ణకుమారిగా ప్రణీతా సుభాష్, ప్రభగా శ్రియ, జయప్రదగా హన్సిక, షావుకారు జానకిగా షాలినీ పాండే, జయసుధగా పాయల్ రాజ్‌పుత్.. ఇలా ఒకరేమిటి ఎన్టీఆర్ హీరోయిన్లను వరుస పెట్టి చూసే అవకాశం కలగడం విశేషం.

ఇక రంగస్థలం చిత్రం తర్వాత చరణ్ స్టేచర్ బాగా మారింది. ఆ సినిమా బ్లాక్‌బస్టర్ చిత్రం కావడం ఒకటైతే -అందులో చిట్టిబాబు పాత్ర పోషించిన రామ్‌చరణ్ విమర్శకుల నుంచీ ప్రశంసలు అందుకున్నారు. నటుడిగా నైపుణ్యాన్ని, పరిపూర్ణతను చూపించటంలో కృతకృత్యుడయ్యాడు. అలాంటి సినిమా తరువాత మరో క్లాసిక్ టైటిల్‌తో వస్తున్నాడు రామ్‌చరణ్.

అదే -వినయ విధేయ రామ. దీంతో సినిమాపై ఓ రేంజ్ అంచనాలు పేరుకున్నాయి. మాస్ సినిమాల దర్శకుడిగా పేరుబడిన బోయపాటి -క్లాసిక్ టైటిల్ ఫిక్స్ చేయడం ఒకరకమైన ఆసక్తి అయితే.. పోస్టర్లు, ప్రమోషన్ టీజర్లు, ట్రైలర్లలో లోడెడ్ యాక్షన్ సీన్లు చూపిస్తుండటం మరోరకమైన ఆసక్తి. ఈ కాంట్రాస్ట్ కిక్కు సినిమాపై ఎలాంటి ఇంపాక్ట్ చూపించనుందోనన్న ఆసక్తి అంతకంతకూ పెరుగుతుంది. మరోపక్క గడ ఏడాది మహేష్ చేసిన భరత్ అను నేను చిత్రంలో తెలుగు ఆడియన్స్‌ని మురిపించిన కైరా అద్వానీ -ఈ చిత్రంలో రామ్‌చరణ్‌తో జోడీ కట్టింది. డ్యాన్స్‌ల్లో చరణ్‌ను మెప్పించిన కైరా -అమాయక సీత పాత్రతో కుర్రకారుని కట్టిపడేస్తుందనే అంటున్నారు. మరో ముఖ్యపాత్ర చేస్తున్న వివేక్ ఓబెరాయ్ కూడా చిత్రానికి స్పెషల్ అట్రాక్షన్. వినయ విధేయ రామ సినిమా జనవరి 11న విడుదలవుతోంది. పక్కా ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన చిత్రం భారీగా విడుదలకు సన్నాహాలు చేసేశారు. ఇక అచ్చమైన సంక్రాంతి సినిమా వస్తున్న చిత్రం -ఎఫ్2. మల్టీస్టారర్ చిత్రంగా పండుగ వినోదాన్ని పంచే కామెడీ ఎంటర్‌టైనర్ కావడంతో ఎఫ్-2వైపూ ఆడియన్స్ ఆశగా చూస్తున్నారు. సంక్రాంతి సీజన్‌ను ఎప్పుడూ వదిలిపెట్టని నిర్మాత దిల్‌రాజు బ్యానర్‌లో తెరకెక్కిన చిత్రమిది. విక్టరీ వెంకటేష్, వరుణ్‌తేజ్‌ల కాంబోలో అనిల్ రావిపూడి దర్శకత్వం వహించిన ఎఫ్-2 జనవరి 12న థియేటర్లకు వస్తుంది. పెళ్లికి ముందు -పెళ్లి తర్వాత మగాడి లైఫ్‌పై సెటైరిక్ కాన్సెప్ట్‌తో ఫ్యామిలీ అండ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమాను రూపొందించినట్టు చిత్రబృందం చెబుతోంది. సంక్రాంతి పండుగకు అల్లుళ్లు

(మిగతా 11వ పేజీలో)



కైరా అద్వానీ





అనువాదమే అయినా స్ట్రెయిట్ తెలుగు చిత్రాలతో పోటీ పడేందుకు ఉవ్విళ్లూరుతున్నాయి రెండు సినిమాలు. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో పేటతో సూపర్‌స్టార్ రజనీకాంత్, శివ దర్శకత్వంలో విశ్వాసం చూపించేందుకు అజిత్‌లు పండుగ సినిమాల రేస్‌లోకి దిగడం ఆసక్తికరమే.

మీ వ్యూస్



మార్పు అనివార్యం

సెకెండ్ ఇన్నింగ్స్‌లో కాస్త భిన్నమైన సినిమాలతో హీరోగా నిలదొక్కుకునే ప్రయత్నాలు సుమంత్ చేస్తున్నా, ఫలితమే దక్కడం లేదు. నాలుగేళ్ల గ్యాప్ తరువాత -వద్దవద్దనుకుంటూనే హారర్, థ్రిల్లర్ కథలపై పడిన సుమంత్, ఈమధ్యే చేసిన సుబ్రమణ్యాపురం, ఇదం జగత్ చిత్రాలు కెరీర్‌కు కొత్త టర్న్ ఇవ్వలేకపోయాయి. నిజానికి సవాలుతో కూడుకున్న పాత్రలను సైతం అలవోకగా చేయగలిగే సుమంత్, తనవరకూ చిత్రాలకు న్యాయం చేస్తున్నా, మొత్తంగా ప్రాజెక్టులే నిరుత్సాహపరుస్తున్నాయి. కొత్త కొత్త హీరోయిన్‌లతో ప్రయోగాలు చేస్తున్నా -ఫలితమే కనిపించటం లేదు. సుమంత్ తన పాత స్టయిల్లో సినిమాలు చేస్తేనైనా కెరీర్‌కు ఉపయోగపడే టర్న్ వస్తుందేమో. ఆలోచించాలి.

-సీఆర్ బొల్లిముంత, ఒంగోలు

ఆయన అదోటైపు

గతంలో రామ్‌గోపాల్‌వర్మను ఎందుకు ఎక్కువగా దెయ్యాల చిత్రాల్లో భయంకరమైన సన్నివేశాలు పెడతారని మీడియా అడిగినపుడు జవాబుగా -జనాన్ని భయపెట్టడం ఇష్టమని చెప్పాడు. ఇటీవల తెలంగాణ ఎన్నికల సమయంలో ఎన్నికలపై మీ అభిప్రాయమేంటి? అన్న ప్రశ్నకు -ఓటువేసే ప్రతీ ఒక్కరు బకరా అంటూ సమాధానమిచ్చాడు. అసలు రాంగోపాల్‌వర్మకు సొసైటీపై గాని, రాజకీయాలపై గాని ఏమాత్రం సదభిప్రాయం లేదు. అందుకేనేమో మీడియా ఎప్పుడూ అతన్ని హైలెట్ చేస్తూ ఉంటుంది. సైకియాట్రిస్టులు చొరవతీసుకుని వర్మకు కౌన్సెలింగ్ చేస్తే బాగుంటుందనిపిస్తుంది. మీడియా కూడా వర్మకు దూరంగా ఉండటం ఎంతైనా సమాజానికి శ్రేయస్కరం.

-బి కృష్ణ, హైదరాబాద్

ఆనాటి సినిమాలు

ఆదివారం వెన్నెల ఎప్పటిలాగే అలంకరించబడ్డ పుష్పమాలలా సుగంధం విరజిమ్మే వ్యాసాలతో అలరించింది. మాయమైనారమ్మా మహిళాభిమానులు, శంకర్ సీక్వెల్స్, ఎన్నెన్నో అందాలు -వ్యాసాలు పొద్దన్నే కమ్మని పెరుగన్నం తిన్న భావన కలిగించాయి. .. మహిళాభిమానుల కథనంలో వ్యాసకర్త నుడివినట్టు పాత సినిమాలు తెరమీద చూస్తున్నా, నిత్యజీవిత సంఘటనలేనన్న భావన కలిగిస్తాయి. అందుకే ఆ సినిమాలు, నవ్వించాయి. ఏడిపించాయి, ఈనాటికి నిత్యనూతనంగా వెలసిల్లుతున్నాయి. మాణిక్యేశ్వరి సారంగధర చిత్రం ఫ్లాష్‌బ్యాక్ చదువుతుంటే మరోసారి సినిమా చూస్తున్నట్లునిపించింది.

-ఎన్నారెల్, సికిందరాబాద్

ప్రియాంక ముందుచూపు

సల్మాన్‌ఖాన్ చిత్రం 'భారత్' దర్శకుడు అలీ అబ్బాస్‌కి చాలాసార్లు ప్రియాంకాచోప్రా ఫోన్ చేసి తనకు సల్మాన్‌తో నటించాలని ఉంది అని చెప్పిందట. సల్మాన్ స్నేహితులకూ చెప్పింది. దుబాయ్‌లో నేరుగా సల్మాన్‌కే చెప్పడంతో ఆ చిత్రంలో ఆమెను తీసుకున్నారు. కొన్ని వారాలు గడిచాక ఆమె ఆ చిత్రంనుంచి తప్పుకుంది. అందుకు కారణం ఆమెకు పెళ్లి ఫిక్స్ కావడమేనన్న టాక్ వినిపించింది. అయితే, అసలు కారణం ఇప్పుడు బయటపడింది. ఆ చిత్రంలో తబు, దిశాపటానినీ తీసుకున్నారట. తన స్థాయికి తగినట్టు బాగా ప్రాముఖ్యంవున్న పాత్ర ఇస్తారని ప్రియాంక భావించిందిగాని ముగ్గురు హీరోయిన్లలో ఒక సాధారణ పాత్ర అని తెలిసి తప్పుకుందట.

-ప్రసన్న, పేర్రాజుపేట

అదంతే..

పాత పేరుతో కొత్త సినిమాలు రావడం తెలిసిందే. ఇది చిత్రసీమ కదా. చిత్ర విచిత్రాలు జరుగుతూ ఉంటాయి. పాత సినిమా కథకు రంగులు, మెరుగులుదిద్ది కొత్త సినిమా అని భ్రమింపజేయడం కమర్షియల్ సూత్రమే. ఇటీవలి బహిరంగ ఉదాహరణ పాత మీనా చిత్రం 'అఆ'గా మారడం! అలాగే 'బంగారు పిచుక' చిత్రం 'పెళ్లికొడుకు'గా మారింది. ఆ రెండు చిత్రాలకూ దర్శకుడు బాపూనే. అంతే కాదు ఆయనే ముత్యాలముగ్గును సుందర కాండగా తీర్చిదిద్దాడు. దశాబ్దాల క్రితం బ్రతుకుతెరువు చిత్రం సూపర్‌హిట్ అయింది. దానినే కొడుకు కోడలుగా పునర్నిర్మించారు. రెండింటిలోనూ నాగేశ్వరరావే హీరో! అలాగే సన్నాఫ్ ఇండియా హిందీ చిత్రం మన బాలనాగమ్మకు రీమేక్! అయితే అవి రీమేక్‌లని చెప్పరు!

-సుధీర్, శ్రీనగర్

అక్కడే ఎక్కువ

మన దేశంలో ఆడవారిపై జరుగుతున్న దాడులపై తీవ్రంగా స్పందిస్తూ అమ్మాయిలు దేశం విడిచివెళ్లిపోతే మంచిది అంది ప్రియమణి. అందుకు ఆమె విమర్శలు ఎదుర్కొంటున్నది. కొంతకాలం క్రితం అమీర్‌ఖాన్ కూడా దేశంలో అసహనం పెరిగిపోతున్నది. నా భార్య మరో దేశానికి పోదాం అంటున్నది అని చెప్పగానే 'అలాగే వెళ్లిపొండి'అని విమర్శలు వెల్లువెత్తాయి. నేను భారతీయుడిని. నేనెందుకు వెళ్లిపోతాను అని సర్దుకున్నాడు అమీర్. మన దేశ జనాభా 120కోట్లు దాటేసింది కనుకనే వార్తలు ఎక్కువ సంఖ్యాపరంగా. విదేశాలు స్వర్గధామాలేమీకావు. అక్కడా అత్యాచారాలు, రేప్‌లు, హత్యలు జరుగుతున్నాయి. జనాభాతో నేరసంఖ్యని పోల్చితే అమెరికాలోనే నేరాల శాతం మన కంటే ఎక్కువ. ఆ విషయం తెలిసినా మనకు మోజు తగ్గదు.

-సుభాష్, శ్రీనగర్

అదీ తొలి బయోపిక్

ఒక భారతీయుని జీవితంపై చిత్రం తీసి ప్రపంచాన్నే ఊపేసి ఆస్కార్ అవార్డుల్ని కొల్లగొట్టిన 'గాంధీ' చిత్రాన్ని భారతీయ తొలి బయోపిక్‌గా భావించవచ్చు. అందులోనూ అసత్యాలు, అర్ధసత్యాలూ ఉన్నాయి. స్క్రిప్ట్‌ని ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీకి చూపించి ఆమె సూచనలను పాటించి తీసిన చిత్రం ఇది. స్వార్థం, దురాశ, నిప్పురగిలించి తమాషా చూసే నైజం, విభజించి పాలించే ఎత్తుగడ, బహుక్రూరంగా వ్యతిరేకతను అణచివేయడం లాంటి ఆంగ్లేయుల గుణాలను వైట్‌వాష్ చేసి వారిని పక్కా జంటిల్మన్‌లు లాగ చూపించారు. వంటింటి కుందేలు లాగ బతికిన కస్తూర్బాను చకచకా అందరితో మాట్లాడే మాడర్న్ ఉమన్‌గా చూపించడం మరో లోపం.

-లంబకర్ల, రాజేంద్రనగర్



అదృష్టవంతులు

ఫ్లాష్‌బ్యాక్ @50

కృష్ణా జిల్లా ఊడ్పుగల్లులోని సామాన్య కుటుంబంలో 1922 జూన్ 14న జన్మించారు వీరమాచినేని మధుసూధనరావు (వి మధుసూధనరావు). పునాదిపాడులో హైస్కూలు చదువు, గుంటూరు హిందూ కాలేజీలో ఇంటర్ పూర్తి చేశారు. యల్‌వి ప్రసాద్, కెయస్ ప్రకాశరావు, టి ప్రకాశ్‌రావు, ఆదుర్తి సుబ్బారావు వద్ద ఫిల్మ్ క్రాఫ్ట్‌లోని అంశాలు బాగా అధ్యయనం చేశారు. సతీ తులసి (1959) పౌరాణిక చిత్రంతో దర్శకత్వ బాధ్యతలు స్వీకరించి, తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో 70 చిత్రాలకు పైగా దర్శకత్వం వహించారు. అనేక చిత్రాల విజయాలు సాధించి విక్టరీ మధుసూధనరావుగా ప్రశంసలు అందుకున్నారు. జగపతి సంస్థ తొలి చిత్రం 'అన్నపూర్ణ'కు వీరే దర్శకత్వం వహించారు. తరువాత వారు రూపొందించిన చిత్రాలకు వీరే సారథ్యం వహించటం.. జగపతి, మధుసూధనరావు మైత్రీబంధానికి నిదర్శనం. 'అదృష్టవంతులు' చిత్రానికి మధుసూధనరావు దర్శకత్వం వహించారు.

వీరమాచినేని బాబు రాజేంద్రప్రసాద్ (విబి రాజేంద్రప్రసాద్) కాలేజీ చదువుకునే రోజుల్లో పలు నాటకాల్లో నటించేవారు. అక్కినేనికి వీరాభిమాని. వారి ప్రోత్సాహం, చిత్ర రంగంపట్ల మక్కువతో మద్రాసు వెళ్లి 'జగపతి' నిర్మాణ సంస్థ ప్రారంభించారు. విజయవంతమైన కుటుంబ కథా చిత్రాల నిర్మాతగా, 'దసరా బుల్లోడు' చిత్రం నుంచి దర్శకునిగానూ పేరు పొందిన వ్యక్తి. అ, ఆల క్రమంలో టైటిల్‌తో చిత్రాలు నిర్మించటం ఆనవాయితీగా పెట్టుకున్నారు. అన్నపూర్ణ, ఆరాధన, ఆత్మబలం, అంతస్తులు, ఆస్తిపరులు తరువాత రూపొందించిన చిత్రం అదృష్టవంతులు. 1969 జనవరి 3న ఈ చిత్రం విడుదలైంది. ఈ చిత్రానికి కెమెరా: ఎస్ వెంకటరత్నం, ఎడిటింగ్: ఎన్‌ఎస్ ప్రకాశం, స్టంట్స్: రాఘవులు, నృత్యం: చిన్ని, సంపత్, సంగీతం: కెవి మహదేవన్, కళ: జివి సుబ్బారావు, మాటలు: ఆచార్య ఆత్రేయ, నిర్మాత: విబి రాజేంద్రప్రసాద్, దర్శకత్వం: వి మధుసూధనరావు

అదృష్టవంతులు చిత్రాన్ని 'వన్స్ ఏ థీఫ్' అనే ఆంగ్ల చిత్ర కథ ఆధారంగా రూపొందించటం గమనార్హం.

రఘు (మాస్టర్ ఆదినారాయణ) చిన్నతనంలో జబ్బుతోవున్న తల్లికి మందులు తెస్తుండగా, ఓ దొంగ అతని సంచిలో నగలువేసి పారిపోతాడు. పోలీసులు రఘును అరెస్ట్ చేయడంతో, అతని తల్లి (ఝూన్సీ) ఆవేదనతో మరణిస్తుంది. పోలీసుల నుంచి తప్పించుకున్న రఘు (ఏఎన్నార్) దొంగల గుంపులో చేరి ఆరితేరిన దొంగగా మారతాడు. వారి నాయకుడు దొర (జగ్గయ్య), సహచరులు రాజు (ప్రభాకర్‌రెడ్డి), రజాక్ (ఆనందమోహన్)లతో పలు దోపిడీలు సాగిస్తుంటాడు. ఓరోజు ఓ బిడ్డను తల్లినుంచి దూరం చేసే చోరీలో, తన తల్లి, గతం గుర్తుకొచ్చి బిడ్డను ఆమెకు అందచేసే ప్రయత్నంలో పోలీసులకు దొరికిపోయి ఐదేళ్ల శిక్షను అనుభవిస్తాడు. మంచివాడిగా జీవించాలని నిర్ణయించుకొని, అదే విషయాన్ని ఇన్‌స్పెక్టర్‌కు చెబుతాడు. దొర తిరిగి తనవద్దకు రమ్మని కోరినా తిరస్కరిస్తాడు. జాకీ (పద్మనాభం)తో కలిసి లారీ నడుపుతూ, జయ (జయలలిత)ను పెళ్లి చేసుకుంటాడు. వారికొక పాప బేబి (బేబిరాణి) పుడుతుంది. ప్రశాంతంగా జీవిస్తున్న రఘును పోలీస్ అధికారి మూర్తి (గుమ్మడి) ఒకవైపు, తిరిగి తన దారిలోకి మళ్లించేందుకు దొర మరోవైపు సాగించిన ప్రయత్నాల ఫలితంగా ఏ నేరమూ చేయకనే దొంగగా సమాజం ముద్రవేస్తుంది. రాజు లారీని తగలబెట్టడం, రఘుకు పని లేకపోవటం, జయ క్లబ్ డ్యాన్సర్‌గా కుటుంబాన్ని గడుపుతుంది. తిరిగి పాత జీవితంలోకి వెళ్లాలనుకున్న తన నిర్ణయాన్ని రఘు పోలీసు అధికారికి తెలియజేస్తాడు. ఏమాత్రం అనుమానం రాకుండా ముఠాలోకి వెళ్లి, దొర చెప్పిన దోపిడిని అరికట్టి, నేరస్తులను పోలీసులకు పట్టిచ్చి తన నిజాయితి నిరూపించుకుంటాడు రఘు.

చిత్రంలో పద్మనాభం జంటగా గీతాంజలి, జాకీ తల్లి పెసరట్ల పేరమ్మగా సూర్యాకాంతం, గీతాంజలి తల్లి పుల్లట్ల పుల్లమ్మగా ఛాయాదేవి, వైవి రావు, అతిథి పాత్రలో రేలంగి, లారీ కంపెనీ ఓనరుగా సాక్షి రంగారావు, డబ్బింగ్ జానకి, రామచంద్రరావు నటించారు.

ఒకసారి నేరానికి పాల్పడి శిక్ష అనుభవించిన వ్యక్తిలో పరివర్తన కలిగి మంచివాడుగా మారినా.. సమాజం, పోలీసు వ్యవస్థ అతన్ని ఇంకా నేరస్తుడిగానే భావించి తరిమికొట్టడం, అలాంటి పరిస్థితుల్లో ఏర్పడే మానసిక సంఘర్షణలను తట్టుకొని నిలవటం అన్న విషయాలను ప్రధానాంశంగా ఈ చిత్రంలో రూపొందించారు. కొన్ని సన్నివేశాల రూపకల్పన దర్శకుని ప్రతిభకు అద్దంపట్టినట్టు ఉంటాయి. రఘు తన సహచరులతో కలిసి సినిమా షూటింగ్ ప్లానుతో పబ్లిక్‌గా ధనవంతుని దోచుకోవటం (ఈ సన్నివేశ ఆలోచనను కొద్దిగా అటూ ఇటూ మార్చి చాలా చిత్రాల్లో చూపించారు. కొన్నిచోట్ల నిజంగానూ ఇలాంటి దోపిడీలు జరిగాయి); అలాగే రేలంగిని ఎక్కిళ్లు ఆపొద్దని చెప్పి అతనిచేతే ఇనప్పెట్టె తెరిపించటం; పసివాడిని అపహరించే ప్రయత్నంలో హీరోకి అతని తల్లి గుర్తుకురావటం; హీరోయిన్ జయ మగవేషంతో ప్రవేశించటం, ఒక రాత్రి ఆమె జుట్టు కనపడి రఘుకు నిజం తెలియటంలాంటి సన్నివేశాలు అప్పట్లో క్రియేటివిటీ అనిపించుకున్నాయి. ఈ సన్నివేశంలోనే హీరో సాంగ్ -అయ్యయ్యో బ్రహ్మయ్యా (రచన: సినారె, గానం: ఘంటసాల)లో తొలిసారి అక్కినేనితో వెరైటీ స్టెప్పులు వేయించారు. తరువాత ఏఎన్నార్ అనేక చిత్రాలు ఇలాంటి స్టెప్స్‌తోనే కొనసాగడం గమనార్హం. రెండో దొంగతనం ముగించిన రఘుకు మందు ఇమ్మని దొర సూచించగా విజయలలిత తన బృందంతో, అక్కినేని తమాషా స్టెప్పులతో చిత్రీకరించిన గీతం -ము ము ముద్దంటే చేదా' (రచన: ఆరుద్ర, గానం- ఘంటసాల, పి సుశీల). ఓ హత్య కేసులో నిందితుడు రఘు అని అనుమానించిన పోలీసు అధికారి మూర్తి, అతన్ని పలు గెటప్‌లు, కోటుతో పరీక్షించి విఫలమవటం; దీని కారణంగా రఘును జనం అనుమానించటం లాంటి సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. టెక్నాలజీ ఎంతో అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో చిత్రీకరించే సన్నివేశాల మాదిరే -50ఏళ్ల కిందటే దొర (జగ్గయ్య) తన స్థావరంలోకి వస్తున్నదెవరో ఎదురుగావున్న టీవీ స్క్రీన్‌పై చూడటం లాంటి సన్నివేశాన్ని రూపొందించటం దర్శకుడు ముందు చూపునకు తార్కాణం. పోలీసులకు రఘు ఫోను చేసే విషయం గ్రహించటం, దాన్ని హీరోకు తెలియచేసి దోపిడి ప్లాను మార్చటం, అలాగే పరుగెడుతున్న రైలుమీద తొలిసారి హీరో, విలన్ ఆనందమోహన్‌ల ఫైట్లు చిత్రీకరణ, ఎత్తయిన టవర్‌పై వివిధ భాగాల్లో ప్రభాకర్‌రెడ్డి, ఆనందమోహన్‌లతో ఫైట్ ఎంతో వివరంగా, విపులంగా చిత్రీకరించి, ఉత్సుకత కలిగించారు. చిత్రంలో రఘుగా అక్కినేని నాగేశ్వరరావు ప్రశంసనీయమైన నటన చూపటం, జయలలిత దానికి తగ్గట్టు.. చివరి సన్నివేశంలో భర్త మానసిక స్థితి అర్థం చేసుకుని పాత జీవితానికి వెళ్తాడేమోనని ఆవేదన పడటం లాంటి సన్నివేశాలను నిండుతనంతో చూపించారు. క్లబ్‌లో 'మొక్కజొన్నతోటలో' పాట చిత్రీకరణలో దర్శకుడు ఎంతో థ్రిల్లింగ్‌గా చివర చరణానికి -రఘు, దొర, రాజు రావటం, రఘు జయను లాకెళ్లటం, చిత్రీకరణకు తగినట్టు మహదేవన్ మ్యూజిక్ అందించటం ఆకట్టుకుంటుంది. సూర్యాకాంతం, ఛాయాదేవీల హాస్యం ఇబ్బందికరంగా అనిపించినా, మిగిలిన చిత్రంయొక్క జిగిబిగిలో అది పెద్దగా పట్టించుకోరాదు.

గీతాలు: చిత్రంలోని గీతాలన్నీ ఘంటసాల, సుశీలే ఆలపించారు. పద్మనాభం, గీతాంజలిలపై చిత్రీకరించిన (హిందీ చిత్రం సంగంలోని 'చోర్ రాధా చోర్') చరణం పేరడీ -నా మనసే గోదారి/ నీ వయసే కావేరి (రచన: ఆరుద్ర). విజయలలిత, ఏఎన్నార్ బృందంపై డెన్‌లో చిత్రీకరించిన గీతం -పడిన ముద్ర చెరిగిపోదు రోయి (రచన: ఆరుద్ర). అక్కినేని, జయలలితలపై చిత్రీకరించిన తొలిరేయి గీతం (చల్లని వెన్నెలలో ఆహ్లాదకరంగా సున్నితంగా చిత్రీకరించారు) -కోడి కూసే ఝాముదాకా (రచన: ఆత్రేయ). వీరిరువురిపై ఆరుబయట స్టెప్పులతో సాగే గీతం -చింత చెట్టు చిగురు చూడు (ఆరుద్ర). జయలలిత డాన్స్‌తో చిత్రీకరించిన గీతం -మొక్కజొన్న తోటలో (రచన: కొనకళ్ళ వెంకటరత్నం. ఒరిజినల్ పాటను సినిమా కోసం కొంతమార్చారు). ఈ చిత్ర కథాంశాన్ని తెలియచేస్తూ అక్కినేనిపై చిత్రీకరించిన మరో గీతం 'నమ్మరే, నేను మారానంటే నమ్మరే' (ఆత్రేయ).

చిత్ర గీతాలు, పటిష్టమైన కథ, చిత్రీకరణ, సంగీతం, నటీనటుల అభినయం, అదృష్టవంతులు చిత్రాన్ని విజయపథంవైపు నడిపాయి. సూపర్ హిట్ సాధించిన చిత్రాన్ని హిందీలో 'హిమ్మత్' (1970)గా నిర్మాత పి మల్లిఖార్జునరావు, రవికాంత్ నగాయిచ్ దర్శకత్వంలో నిర్మించారు. 15 ఏప్రిల్ 1970న విడుదలైన హిందీ చిత్రంలో హీరోగా జితేంద్ర, హీరోయిన్‌గా ముంతాజ్ నటించారు. విలన్ దొరగా అనంత్‌నాగ్, అనురులుగా ప్రభాకర్ రెడ్డి, ఆనంద్‌మోహన్ హిందీలోనూ నటించారు.

ఈ చిత్రాన్ని తమిళంలో 'తిరుడన్'గా శివాజీ గణేషన్, కెఆర్ విజయ, జయలలిత, కె బాలాజీ, మేజర్ సౌందర్‌రాజన్, ఎస్‌వి రామదాసు, నగేష్, కాంబినేషన్‌లో ఏసీ త్రిలోకచందర్ దర్శకత్వంలో ఎంఎస్ విశ్వనాథం సంగీతంతో నిర్మించారు. 1969 అక్టోబర్ 17న సినిమా విడుదలై విజయవంతమైంది. ఈ చిత్రాన్ని సింహళంలో 'ఎదత్ సూర్య, అదత్ సూర్యగా' 1972లో రూపొందించారు. 'అదృష్టవంతులు' చిత్ర గీతాలు, చిత్రం నేటికీ వీక్షకులకు, శ్రోతలకు ఆనందాన్ని కలిగిస్తున్నాయంటే ఆ చిత్రం దర్శకుడు, యూనిట్ కృషే.

-సీవీఆర్ మాణిక్యేశ్వరి

రాశిఫలం



గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతి

6-1-2019

మేషం (అశ్విని, భరణి, కృత్తిక 1పా.)
ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణా తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబ సౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు.

వృషభం (కృత్తిక 2, 3, 4పా., రోహిణి, మృగశిర 1, 2పా.)
కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా వుంటాయి. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతారు. నూతన కార్యాలు ప్రారంభించకుండా నుండుట మంచిది. ఆత్మీయుల సహాయ సహకారాలకై సమయం వెచ్చించాల్సి వస్తుంది.

మిథునం (మృగశిర 3, 4 పా., ఆరుద్ర, పునర్వసు 1, 2, 3పా.)
ముఖ్యమైన వ్యక్తులను కలుస్తారు. ఆకస్మిక భయాందోళనలు దూరమవుతాయి. ఋణప్రయత్నాలు ఆలస్యంగా ఫలిస్తాయి. కుటుంబంలో మనశ్శాంతి లోపిస్తుంది. బంధు, మిత్రులతో వైరమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. రహస్య శతృబాధలుండే అవకాశం వుంది.

కర్కాటకం (పునర్వసు 4 పా., పుష్యమి, ఆశ్రేష)
అనారోగ్య బాధలను అధిగమిస్తారు. నూతన కార్యాలకు ఆటంకాలున్నా సత్ఫలితాలు పొందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వృత్తి, వ్యాపార రంగాల్లో ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించాలి. ఆత్మీయుల సహాయ, సహకారాలకై వేచి వుంటారు. దైవదర్శనం లభిస్తుంది.

సింహం (మఖ, పుబ్బ, ఉత్తర 1 పా.)
అనారోగ్య బాధలు అధికమవుతాయి. అకారణంగా కలహాలేర్పడే అవకాశాలుంటాయి. అనవసర భయానికి లోనవుతారు. విద్యార్థులు చంచలంగా ప్రవర్తిస్తారు. వ్యాపార రంగంలోనివారు జాగ్రత్తగా నుండుట మంచిది. స్త్రీలు పిల్లలపట్ల మిక్కిలి శ్రద్ధ వహిస్తారు.

కన్య (ఉత్తర 2, 3, 4పా., హస్త, చిత్త 1, 2 పా.)
నూతన వస్తు, వస్త్ర, వాహన, ఆభరణ, లాభాలను పొందుతారు. ఆకస్మిక ధనలాభయోగముంటుంది. శుభవార్తలు వింటారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. బంధు, మిత్రులతో కలిసి విందులు వినోదాల్లో పాల్గొంటారు. ఒక ముఖ్యమైన కార్యక్రమం పూర్తి అవుతుంది.

తుల (చిత్త 3, 4పా., స్వాతి, విశాఖ 1, 2, 3పా.)
ఆకస్మిక ధనలాభముంటుంది. నూతన వస్తు, ఆభరణాలను పొందుతారు. కీర్తి, ప్రతిష్ఠలు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో సంతోషంగా కాలక్షేపం చేస్తారు. ఇతరులకు ఉపకారం చేయుటకు వెనుకాడరు. ఋణబాధలు తొలగిపోతాయి. శత్రుబాధలుండవు.

వృశ్చికం (విశాఖ 4 పా., అనూరాధ, జ్యేష్ఠ)
కుటుంబ కలహాలు దూరమవుతాయి. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృధా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి.

ధనుస్సు (మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1 పా.,)
సంతోషంగా కాలం గడుపుతారు. శుభవార్త వింటారు. కుటుంబ పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. తోటివారి ప్రశంసలందుకుంటారు. విందులు, వినోదాల్లో పాల్గొనే అవకాశం వుంది. ఆర్థికంగా బలపడతారు. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు.


మకరం (ఉత్తరాషాఢ 2, 3,4పా., శ్రవణం, ధనిష్ఠ 1, 2పా.)
శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధనలాభంలో ఆనందంగా ఉంటారు. ప్రయత్న కార్యాలన్నింటిలో సఫలీకృతులవుతారు. కీర్తి, ప్రతిష్ఠలు అధికమవుతాయి. విందులు, వినోదాల్లో పాల్గొంటారు.

కుంభం (ధనిష్ఠ 3, 4పా., శతభిషం, పూర్వాభాద్ర 1,2, 3పా.)
అద్భుత అవకాశాలు పొందుతారు. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. ముఖ్యమైన శుభవార్తలు వింటారు. ఆత్మీయుల సహాయ సహకారాలు సంపూర్ణంగా లభిస్తాయి. అనుకోకుండా డబ్బు చేతికందుతుంది. నూతన వస్తు, ఆభరణాలు సేకరిస్తారు.

మీనం (పూర్వాభాద్ర 4 పా., ఉత్తరాభాద్ర, రేవతి)
స్థిరాస్తులకు సంబంధించిన సమస్యలు పరిష్కరింపబడతాయి. నూతన గృహ కార్యాలపై శ్రద్ధ వహిస్తారు. ఆకస్మిక ధనలాభంతో ఆనందిస్తారు. బంధు, మిత్రులతో కలిసి విందులు, వినోదాల్లో పాల్గొంటారు. దైవదర్శనం చేసుకుంటారు. భక్తిశ్రద్ధలధికమవుతాయి.

డియర్ ఫ్రెండ్స్.. ఈ క్విజ్ మీ కోసమే...

ఏ సినిమాలో ఎవరు నటించారు? దర్శకుడెవరు? సంగీతం ఎవరిచ్చారు? ఆయా చిత్రాల్లో సన్నివేశాలు, సంక్లిష్టతలు, అవి చూడగానే గుర్తొచ్చే విషయాలే ఈ పజిల్ స్పెషాలిటీ. ప్రశ్నను కాస్త నిదానంగా చదివితే సమాధానం దొరికేసినట్టే. కొత్త పజిల్‌ను ఎంజాయ్ చేయండి. మీ సమాధానాలు కార్డుపైన గానీ, మరే విధంగానైనా గానీ రాసి పంపించవచ్చు. ఎలాంటి కొట్టివేతలు, తుడిపివేతలు లేకుండా జవాబులన్నీ స్పష్టంగా రాయాలి. మా దగ్గరున్న కీ సొల్యూషన్‌తో అన్ని విధాలా సరిపోయే జవాబులు రాసిన వారి పేర్లు ప్రచురిస్తాం.



ఫిలిం క్విజ్ 112

నిర్వహణ: రాణీప్రసాద్

1. పక్కనున్న వర్కింగ్ స్టిల్ ఏ చిత్రానిది?
2. ఏ ఆంగ్ల చిత్రం ఆధారంగా చిరంజీవి 'లంకేశ్వరుడు' క్లైమాక్స్ రూపొందించారు?
3. విలన్ పాత్రలతో ఆకట్టుకున్న దివంగత రఘువరన్ పూర్తి పేరు?
4. శంకరాభరణం చిత్రంలోని బ్రోచేవారెవరురా? కీర్తన రచయిత?
5. 1060లో రేలంగి వెంకట రామయ్య నిర్మించిన చిత్రమేది?
6. జ్యో అచ్యుతానంద చిత్రంలో రెజీనా కాసాండ్రా ముద్దు పేరు?
7. భలేమంచిరోజు చిత్రంలో సుధీర్‌బాబుతో జోడీకట్టిన హీరోయిన్?
8. అసలు పేరు మంగభామ. ఆ నటి ఏ స్క్రీన్ నేమ్‌తో పాపులరైంది?
9. కమలాకర కామేశ్వర రావు 'గుణసుందరి కథ' చిత్రానికి సినిమాటోగ్రాఫర్?
10. ఈ హీరోయిన్‌ను కనిపెట్టండి?



సమాధానాలు- 110

1. వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్
2. వి రామచంద్రరావు 3. మల్లి
4. అలక 5. రమాప్రభ 6. జీవన
7. జెవి రాఘవులు 8. దేవులపల్లి కృష్ణశాస్త్రి 9. రేణుక 10. ఇంద్రజ

సరైన సమాధానాలు రాసిన వారు

సిహెచ్‌ఎన్ రావు, తణుకు
కె శివానంద, బొబ్బిలి
కె నాగిశెట్టి, కర్నూలు
బీవీ రాజు, కందుకూరు
బి రామయ్య, అయినవిల్లి
కృష్ణారెడ్డి జి, సికింద్రాబాద్
కెడి మోహన్, హైదరాబాద్
టి రమ్యదీప్తి, సత్తెనపల్లి
జివిఎం మోహన్, ముచ్చుమిల్లి
ఎల్ మోక్షజ్ఞ, శ్రీకాకుళం
ఎల్ అహమద్, సుల్తానాబాద్
ఎం శంకర్రావ్, డి గన్నవరం
బీర రాజేంద్ర, కర్నూలు
పీవీ శివప్రసాదరావు, అద్దంకి
సీ సత్యలక్ష్మి, నల్గొండ

పూర్తి చేసిన క్విజ్‌ను పంపించాల్సిన మా చిరునామా: ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక 36, సరోజినీదేవి రోడ్, సికిందరాబాద్- 03

ఒక్క పాట చాలు...





ఆడియన్స్‌ని అట్రాక్ట్ చేయాలంటే సినిమాకు ప్రచారమెంత ముఖ్యమో పాటంత ముఖ్యం -అంటాడో నవతరం దర్శకుడు.

హిట్టయిన సినిమాలో ఫ్లాపు పాటలున్నట్టే, ఫ్లాపు సినిమాల్లోనూ హిట్టు పాటలుంటాయి. ఒక్కోసారి అవే బతికిస్తాయి. అందుకే సినిమాతో సమాంతరంగా పాట ప్రాముఖ్యత పెరిగింది, పెరుగుతోంది కూడా -అంటాడో సీనియర్ దర్శకుడు.

కొన్ని పొడి పదాలు వింటే -బాణీ గుర్తుకొస్తుంది. కొన్ని కూనిరాగాలు తీస్తుంటే -పాట పదాలు మెదడు పొరల్లోంచి తన్నుకురావొచ్చు. ఈ రెండూ ఒద్దికగా అల్లుకుంటే -అదే గొప్ప పాట కావొచ్చు. ఒక సినిమా పదికాలాలు గుర్తుండాలంటే -సందర్భోచిత సాంగొకటి చాలన్న విషయాన్ని అనేక సినిమాలు రుజువు చేశాయి, చేస్తున్నాయి.


ఓకే ఒక్క పాట-

లాల పోయొచ్చు. జోల పాడొచ్చు. కదిలించొచ్చు. కరిగించొచ్చు. రగిలించొచ్చు. ఎగిరించొచ్చు. నిలబెట్టొచ్చు. పడగొట్టొచ్చు. కన్నీరు పెట్టించొచ్చు. కల్మషాన్ని తుడిచేయొచ్చు... ఒక్కటేమిటి వేన వేల భావాలను పలికించొచ్చు. మసకబారిన ఆలోచనలను తట్టిలేపడం, ఒంటరితనానికి దూరంగా చిటికెన వేలుపట్టి నడిపించడం.. ఇలాంటివన్నీ పాటకూ సాధ్యమే. అందుకే -సన్నివేశానికి తగిన పద కూర్పుకోసం కవులు కసరత్తు చేస్తే -పదాలకు తగిన స్వరాల కోసం కర్తలు కృషి చేస్తూనే ఉంటారు.

⁂

స్వర్ణయుగం కాలంనాటి చిత్రాల్లో పది పన్నెండు పాటలుండేవి. కృష్ణ, శోభన్‌బాబుల కాలంలో వాటి సంఖ్య తగ్గింది. చిరంజీవి జనరేషన్ మొదలయ్యేసరికి -ప్రతి సినిమాలో పాటల ఫిగర్‌ను ఫైవ్‌కు ఫిక్స్ చేశారు. సంగీత ప్రాధాన్యత కలిగినవి, కొన్ని ప్రత్యేక కథా వస్తువుకు సంబంధించిన సినిమాల్లో తప్ప -ఎక్కువశాతం ఇదే లెక్క కొనసాగింది. చాలకాలంగా ఈ సంఖ్య మరింత తగ్గుతోంది. పాటల్లేని సినిమా అంటూ ప్రచారం చేసుకోదగ్గ సిత్రాలూ వస్తున్నాయి, అది వేరే విషయం. నిజానికి ఎందరో మహానుభావుల (దర్శకులు, నిర్మాతలు, నటులు, సాంకేతిక నిపుణులు..) కృషి ఫలితంగా తెలుగు సినిమా పాట పట్టుబట్టకట్టే స్థాయికి వచ్చింది. అలా సినిమాకంటే సినిమా పాటే జనరంజకమైన స్థితికి చేరింది కూడా. అయితే ఇప్పుడొచ్చే సినిమాల్లో పాటలు తగ్గుతుండటానికి కారణం -ఓ పాటను షూట్ చేయాలంటే మొత్తం బడ్జెట్‌లో ఏడు నుంచి పది శాతం ఖర్చుపెట్టాల్సిన పరిస్థితి రావడం కూడా కారణం. అది వేరే విషయం. ఈ చర్చను కాసేపు పక్కన పెడితే -తెలుగు సినిమాల్లో పాటల రాశి తగ్గుతున్నా వాసి మాత్రం పదునుదేరుతోందనే చెప్పాలి. ఒకప్పటి ఉద్దండ రచయితల స్థాయిని సాహిత్యపరంగా లెక్కిస్తే, మిక్కిలి మించి ఇప్పటి రచయితలు వినోదాన్ని అందించగలుగుతున్నారు. ఇదీ గొప్పగా చెప్పుకోవాల్సిన విషయమే.

కొంతగ్యాప్ తరువాత -గడచిన ఏడాది పాట ప్రజలకు మరింత దగ్గరైందని అనిపిస్తుంది. చిన్న పెద్ద అన్న సినిమా బడ్జెట్ వ్యత్యాసాలు కాసేపు పక్కనపెడితే -అన్ని చిత్రాల్లోని పాటలు ఆడియన్స్‌ని రంజింప చేయడానికి ప్రయత్నించిన పాటల్లాగే తోస్తాయి. 2018లో సుమారుగా 150 తెలుగు స్ట్రెయిట్ చిత్రాలు వచ్చాయనుకుంటే -సుమారుగా 450 వరకూ పాటలు పురుడుపోసుకున్నాయనే చెప్పాలి. కలం తిరిగిన సీనియర్, జూనియర్ రచయితలు తమ సృజనాత్మక ఆలోచనా పరిధిని సన్నివేశానికి అనుగుణంగా మలిచి అద్భుతమైన పాటలే అందించారు. ఆ సవాల్‌కు సంగీత దర్శకులూ తక్కువేం చేయలేదు. అద్భుతమైన బాణీలను అందించి పాట సూటిగా జనంలోకి వెళ్లగలిగేలా చేయడంలో కృతకృత్యులయ్యారు. అయితే, అన్ని పాటలనూ ప్రస్తావించలేం కనుక -జనరంజక గీతాల్లో 'స్థాయి పులాక న్యాయం' ప్రకారం ఎన్నదగిన పాటల్ని గుర్తు చేసుకుందాం. విజయ్ దేవరకొండ, ప్రియాంక జవాల్కర్ జోడీగా రాహుల్ సాంకృత్యన్ తెరకెక్కించిన 'టాక్సీవాలా' చిత్రంలోని 'మాటె వినదుగా' పాట జనాల్లోకి సూటిగా వెళ్లిపోయింది. కృష్ణకాంత్ రాసిన ఈ పాటను సిద్ శ్రీరాం ఆలపించిన తీరు ఒక ఎత్తయితే, జేక్స్ బిజోయ్ కట్టిన బాణీ మనసు పొరల్లో నిక్షిప్తమైపోయింది. ఇక సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో శంకర్ తెరకెక్కించిన రోబో సీక్వెల్ 2.ఓ కోసం అనంత శ్రీరాం కలం అద్భుతాన్ని సృష్టించింది. 'యంతరలోకపు సుందరివే' అంటూ సాగిన పాటకు సిద్ శ్రీరామ్, షాషా తిరుపతి తమ గాత్రంతో ప్రాణంపోస్తే, ఏఆర్ రెహమాన్ క్రియేటివ్ ట్యూన్‌తో పాటను మరో లోపకంలోకి తీసుకుపోయాడు. ఇక పడి పడి లేచె మనసు చిత్రం కోసం విశాల్ చంద్రశేఖర్ డిజైన్ చేసిన టైటిల్ సాంగ్‌ను అర్మన్ మాలిక్, సింధూరి విశాల్ పాడిన తీరును మర్చిపోలేం. తాజాగా సంక్రాంతికి విడుదలవుతున్న ఎన్టీఆర్ బయోపిక్ తొలి భాగం 'కథానాయకుడు' టైటిల్ సాంగ్ కోసం ఖైలాష్‌ఖేర్ గొంతు ఖంగుమంది. కె శివదత్తా, డాక్టర్ కె రామకృష్ణ రచించిన పాటకు ఎంఎం కీరవాణి చేసిన ట్యూన్ -మనల్ని వెంటాడుతూనే ఉంటుంది. ఇక 'హుషారు'గా వచ్చిన కుర్రాళ్ల చిత్రంలో కిట్టూ విస్సాప్రగడ 'ఉండిపోరాదే' అంటూ గుండెను మెలితిప్పే గీతాన్ని అందించాడు. రథన్ అందించిన అద్భుత బాణీని అంతే చక్కగా ఆలపించి సిద్ శ్రీరాం తన ఊపు ప్రదర్శించాడు. హలో గురూ ప్రేమకోసమే చిత్రం కోసం 'మై వరల్డ్ ఈజ్ ఫ్లయింగ్' అంటూ దేవీశ్రీ ప్రసాద్, శ్రీమణి చేసిన సృజన -ప్రతి క్షణం గాళ్‌ఫ్రెండ్‌లా గుర్తుకొస్తూనే ఉంటుంది. యు టర్న్ చిత్రం కోసం అనురుథ్ రవిచందర్ బాణీలో శ్రీ సాయికిరణ్ రాసిన 'ది కర్మ థీమ్', అంతరిక్షం చిత్రం కోసం అనంత్ శ్రీరామ్ అందించిన సమయమా పాటను ప్రశాంత్ ఆర్ విహారి అద్భుతంగా బాణీకడితే హరిని, యాజిన్ నజీర్ ఆకట్టుకునేలా ఆలపించారు. గీత గోవిందం చిత్రం కోసం -ఇంకేం ఇంకేం ఇంకేంకావాలే అంటూ అనంత్ శ్రీరామ్ ఒకింత హాయిని పాటగా మలిస్తే, గోపీసుందర్ బాణీని సిద్ శ్రీరామ్ తన ప్రత్యేక గాత్రంతో పీక్స్‌కి తీసుకెళ్లాడు. అంతేకాదు గాలివాలుగా (అజ్ఞాతవాసి), చూసీ చూడంగానే (చలో), నిన్నిలా (తొలి ప్రేమ) ఇలా చెప్పుకుంటూపోతే -ఎన్నో గొప్ప పాటలు. చివరిగా ఈ ఏడాది సెన్సేషనల్ హిట్లుగా చెప్పుకోదగ్గ పాటల్నీ ఇక్కడ ప్రస్తావించాలి. మంచి పాట, గొప్ప పాట, హిట్టు పాటలాంటి విశేషణాలను ఏమీ చేర్చకుండా, వీటిని 'పాట' అనాలంతే. ఆనందం, ఆదరణలాంటి కోణాల్లో ఈ పాటలకు ఎవరికి వారే పట్టంగట్టాలంతే. అందులో మొదటిది రామ్‌చరణ్, సమంత జోడీగా వచ్చిన రంగస్థలం చిత్రంలోని -యెంత సక్కగున్నావే. అన్నీ కలిసొచ్చిన అద్భుతమైన పాటిది.




యేరుశనగ కోసం మట్టిని తవ్వితే/ ఏకంగా తగిలిన లంకె బిందెలాగ -ఎంత సక్కగున్నావే.. లచ్చిమి ఎంత సక్కగున్నావే.

సింత సెట్టుయెక్కి సిగురు కోయబోతే/ చేతికి అందిన సందమామలాగ -ఎంత సక్కంగున్నావే.. లచ్చిమి ఎంత సక్కగున్నావే... /మల్లెపూల మద్దె ముద్ద బంతిలాగ -ఎంత సక్కగున్నావే.. /ముత్తైదువ మెళ్లొ పసుపు కొమ్ములాగ -ఎంత సక్కగున్నావే../ సుక్కలసీర కట్టు-కున్న యెన్నెల్లాగ ఎంత సక్కాగున్నావే..

అచ్చమైన పల్లెభావాన్ని పదాల్లోకి ఒలికించి చంద్రబోస్ పాట రాస్తే -బాణీకట్టిన దేవీశ్రీ ప్రసాదే మార్ధవంతో కూడిన జీర గొంతుతో పాటకు ప్రాణం పోశాడు. ఇక హీరో నాని చిత్రం శ్రీకృష్ణార్జున యుద్ధంలో పెంచల్‌దాస్ రాసి పాడిన 'దారి చూడు దుమ్ము చూడు మామ/ దున్నపోతుల బైరే చూడు' అన్న పాట ఒక ఊపు ఊపేసింది. కొద్దికాలం పాటు ఏనోటనైనా, ఏచోటనైనా ఇదే పాట వినిపించిందంటే -అది ఎంతటి ప్రభావం చూపించిందో అర్థం చేసుకోవచ్చు. ఈ కోవలో మరికొన్ని పాటలూ లేకపోలేదు. సో, గడచిన ఏడాదిలో సినిమా పాట కొత్త పంథాను అందుకుంది. ఈ ఏడాదీ అలాంటి పాటలు మరిన్నిగా ఆడియన్స్‌ని రంజింప చేస్తాయని ఆశిద్దాం.

-రాణీప్రసాద్





....హౌస్ ఫుల్!

(9వ పేజీ తరువాయి)

వస్తున్నారంటూ ఇప్పటికే ప్రచార దుమారం లేపింది. ట్రైలర్‌కూ అనూహ్య రెస్పాన్స్ రావడంతో, పండగ సినిమాపై భారీ అంచనాలే నెలకొన్నాయి. మొత్తంమ్మీద సంక్రాంతి సీజన్‌లో ఈ మూడు తెలుగు స్ట్రెయిట్ చిత్రాలూ ఎలాంటి ఆనందాన్ని పంచుతాయో చూడాలి.

భారీ బడ్జెట్ చిత్రాలు కావడంతో -ప్రమోషన్ విషయంలో ఎవరి దుమ్ము వాళ్లు దులిపేశారు. పండుగ ఆనందాన్ని పంచి, ఆడియన్స్‌ని ఎంటర్‌టైన్ చేయడంలో ఎవరు ముందు నిలుస్తారో చూడాలి. సంక్రాంతి సినిమాలు థియేటర్లనుంచి కదలగానే, బరిని బర్తీ చేయడానికి మరికొన్ని సినిమాలు క్యూలో ఉన్నాయి.

తొలి రెండు ప్రాజెక్టులు నిరాశపర్చడంతో కొంత గ్యాప్ తరువాత జనవరి సీజన్‌లో వస్తున్నాడు అక్కినేని చిన్నోడు అఖిల్. మిస్టర్ మజ్నుగా ఆడియన్స్‌ని పలకరించేందుకు వస్తున్న అఖిల్ సినిమా కోసం అక్కినేని అభిమానులూ ఎదురు చూస్తున్నారు. ఎలాగైనా హిట్టు కొట్టేందుకు అఖిల్ తనవంతు కష్టపడ్డాడని చిత్ర బృందం చెబుతోంది. అలాగే హీరో నిఖిల్ సైతం బాక్సాఫీస్ వద్ద తనదైన 'ముద్ర' వేయడానికి సిద్ధమవుతున్నాడు. నిజానికి గత ఏడాది చివరి చిత్రంగా 'ముద్ర' రావాల్సి ఉన్నప్పటికీ, పెద్ద చిత్రాల అడ్డుతో దారి తప్పుకోవడం తెలిసిందే. సో, కొత్త ఏడాదిలో నిఖిల్ తన అదృష్టంపై ఎలాంటి 'ముద్ర' వేస్తాడో చూడాలి. ఇక మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ జీవిత కథతో తెరకెక్కిన 'యాత్ర' కూడా ప్రేక్షకులను, అటు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతోంది. మలయాళ సూపర్‌స్టార్ మమ్ముట్టి టైటిల్ పాత్రలో నటించడంతో ట్రేడ్‌వర్గాల్లో ఓ రేంజ్ బజ్ క్రియేటైంది. వీటితో




పాటు అల్లు శిరీష్ 'ఏబీసీడీ' చిత్రం కూడా లైన్‌లో ఉంది.

ఇక అనువాద చిత్రాలుగా సంక్రాంతి రేసులో రెండు పెద్ద చిత్రాలు నిలిచాయి. స్టైయిల్ తెలుగు చిత్రాల హీరోలను మించి క్రేజ్ తెచ్చుకున్న అనువాద హీరోలిద్దరూ పండుగపై ఎలాంటి ప్రభావం చూపిస్తారోనన్న ఆసక్తి లేకపోలేదు. అందులో ఒకటి సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా నటిస్తున్న 'పేట'. ఈనెల 10న రజనీ థియేటర్లలో సందడి చేయడానికి వస్తున్నాడు. దాదాపు 24ఏళ్ల తరువాత తెలుగు సంక్రాంతికి వస్తున్న రజనీ సినిమా ఇది. అప్పట్లో బాషా చిత్రంతో సంక్రాంతి బరిలోకి వచ్చిన రజనీ -తరువాత వరుస హిట్లు అందుకుని తన రేంజ్‌ని ప్రదర్శించాడు. అరుణాచలం, చంద్రముఖి, రోబోలాంటి హిట్లతో తన స్టయిల్ ప్రతాపం చూపించాడు. అదే ఊపుతో తరువాత వచ్చిన చిత్రాలు కొచ్చాడయాన్, కబాలి, కాలాలాంటి చిత్రాలు తెలుగు ఆడియన్స్‌ని మెప్పించలేకపోయాయి. అందుకే సెంటిమెంట్‌గా మరోసారి తన సత్తా చాటేందుకు ఇప్పుడు సంక్రాంతి రేసులోకి దిగాడు రజనీ. ఇక శివ దర్శకత్వంలోని ప్రాజెక్టుతో తెలుగు ప్రజల అభిమానంపై తన 'విశ్వాసాన్ని' చూపించడానికి వస్తున్నాడు స్టార్ హీరో అజిత్. దాదాపు ఆరేళ్ల తరువాత అజిత్‌తో జోడీకట్టింది స్టార్ హీరోయిన్ నయనతార. 2013లో ఆరంభం తరువాత -వీళ్లిద్దరి కాంబినేషన్‌లో వస్తున్న చిత్రమిది. ఇది కాకుండా పండుగ రేస్‌లోకి బాలీవుడ్‌నుంచీ ఓ సినిమా వస్తోంది. అది పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న బయోపిక్ -ది యాక్సిడెంటల్ మన్మోహన్. జనవరి 11 ఈ సినిమా థియేటర్లకు రానుంది. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ రాజకీయ జీవితంలోని ముఖ్య ఘట్టాల సమాహారంగా రూపొందిన చిత్రమిది. ట్రైలర్ విడుదల తరువాత చిత్రం వివాదాస్పదం కావడంతో విడుదలపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. మన్మోహన్ ప్రతిష్టకు మచ్చతెచ్చే విధంగా ఈ సినిమాను రూపొందించారంటూ కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికే కత్తులు నూరుతున్నారు. న్యాయబద్ధంగా సినిమాను అడ్డుకునే ప్రయత్నాల్లో తలమునకలై ఉన్నారు. విడుదలకు సిద్ధమైన క్షణంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న 'ది యాక్సిడెంటల్ ప్రైమ్ మినిస్టర్' చిత్రంలో ఏం చూపించబోతున్నారోనన్న ఆసక్తి ఆడియన్స్‌లో మొదలైంది. ఇక జనవరి సీజన్‌లోనే బాలీవుడ్ నుంచి వస్తోన్న మరో చారిత్రక బయోపిక్ మణికర్ణిక. బాలీవుడ్ క్వీన్ కంగనా రనౌత్ నటించి, కొంత భాగానికి దర్శకత్వం వహించిన చిత్రం కావడంతో ఈ ప్రాజెక్టువైపూ ఆడియన్స్ ఆసక్తిగా చూస్తున్నారు.

ఎఫ్-2



మిస్టర్ మజ్ను



కంగన.. మళ్లీ క్వీనే



బాలీవుడ్‌లో క్వీన్ చిత్రంతో సెన్సేషన్ సృష్టించిన కంగనా రనౌత్.. ఆకారంలో పెద్ద ఎత్తులేకున్నా ప్రతిభలో ఆకాశమంత ఎత్తుకెదిగి మణికర్ణికతో మరోసారి క్వీన్ అయ్యిందంటూ ప్రశంసలు అందుకుంది. కంగనా రనౌత్ టైటిల్ పాత్రలో నటించిన చిత్రం 'మణికర్ణిక'. జీ స్టూడియోస్, కమల్‌జైన్ నిర్మాణంలో జాగర్లమూడి క్రిష్, కంగనా రనౌత్ దర్శకత్వం వహించారు. జనవరి 25న విడుదలవుతున్న సందర్భంగా హైదరాబాద్‌లో మీడియా సమావేశం నిర్వహించాు. కార్యక్రమంలో తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ 'భారతదేశమే కాదు.. ప్రపంచమంతా ప్రశంసించిన బాహుబలి సినిమాకు కథ అందించిన విజయేంద్రప్రసాద్ ఎప్పటికప్పుడూ రికార్డులు బద్దలుకొట్టే కథలను అందిస్తున్నాడన్నారు. అదే ఒరవడిలో ఇప్పుడు మణికర్ణికకు ఆయన ప్రాణం పోశారన్నారు. లీడ్ రోల్ పోషించిన కంగనా రనౌత్ పెద్దఎత్తు లేకపోయినా.. నటనపరంగా ఆకాశమంతా ఎత్తుకెదిగిందని ప్రశంసించారు. ప్రతి సినిమాకూ ఫ్రెష్‌గా కనిపించటం ఆమెలోని ప్రతిభకు తార్కాణమన్నారు. నెల రోజుల వ్యవధిలో దర్శకుడు క్రిష్‌నుంచి మూడు సినిమాలు వస్తున్నాయని, అందులో మణికర్ణిక ఒకటన్నారు. అయితే క్రిష్ వదిలిన బాణాన్ని కంగనా పూర్తిచేసిందని అంటూ, ప్రాజెక్టు పెద్ద విజయం అందుకోవాలని ఆకాంక్షించి, యూనిట్‌కు అభినందనలు తెలిపారు.

కంగనా రనౌత్ మాట్లాడుతూ తెలుగులో ట్రైలర్ ఇంతకుముందే చూశానని, సౌండింగ్ డిఫరెంట్‌గా అనిపించిందన్నారు. అలాగే పాత్రలకు గాత్రదానం చేసిన ఆర్టిస్టులంతా న్యాయం చేశారన్నారు. ట్రైలర్ వర్క్‌లో కథకుడు విజయేంద్రప్రసాద్ సహకారం కూడా తీసుకున్నామన్నారు. తెలుగులో ఓ పవర్ ఉంటుంది. అందుకే నేను బాహుబలిని తెలుగు, హిందీలోనూ చూశానన్నారు. ఈ సినిమాను డైరెక్ట్ చేయడమనేది ప్లానింగ్ ప్రకారం జరగలేదని, యాక్సిడెంటల్‌గా జరిగిందన్నారు. ఆగస్ట్‌లో రావాల్సిన సినిమాను అనుకున్న సమయంలో పూర్తిచేయలేకపోయామని, ఆ టైంలో క్రిష్‌కు మరో ప్రాజెక్ట్ ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. సినిమాను జనవరిలో పూర్తి చేయాలన్న సంకల్పంతో మిగిలిన భాగానికి తాను దర్శకత్వం వహించినట్టు చెప్పుకొచ్చారు. క్రిష్ సినిమాను గొప్పగా తెరకెక్కించారని, డైరెక్షన్‌లో ఆయన్ని ఫాలో అయ్యానంతేనన్నారు. టీం సహకారంతో సినిమాను పూర్తిచేశాను. తదుపరి కూడా నేను డైరెక్ట్ చేయాలనుకుంటున్నాను. ఆ సినిమాకూ విజయేంద్రప్రసాద్‌నే కథ అందించమని అడిగానని, తప్పకుండా మేం కలిసి పనిచేస్తామన్నారు. రెండు నెలలు సినిమాకోసం చాలా కష్టపడ్డామని, మనం కోసం రక్తం ధారపోసిన వారి గురించి పట్టించుకోవడం లేదు. వారు మన చరిత్ర. అలాంటి వారికి గౌరవమివ్వాలి. అలా చరిత్ర మరుగున పడిపోయిన ఎందరో వీరులున్నారు. ఆ స్ఫూర్తితోనే ఝాన్సీ కథను సినిమాగా చేయాలనుకున్నట్టు చెప్పారు. మేకింగ్‌లో చాలా సమస్యలను ఫేస్ చేశానని, షూటింగ్ ప్రారంభంలోనే నుదుటికి గాయమైన విషయాన్ని గుర్తు చేసుకున్నారు.

అదీ సంగతి

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్ అందంతోపాటు ప్రతిభ ఉన్న నటి. అయితే కంగనాతో సినిమా అంటే దర్శకుడికి పెద్ద టాస్క్ అట. కారణం.. దర్శకత్వంలో వేలు పెట్టడం. 'క్వీన్' నుండి తాజా 'మణికర్ణిక' వరకు ఈమె దర్శకత్వంలో వేలుపెడుతూనే వచ్చింది. మణికర్ణిక విషయంలో ఇన్వాల్వ్‌మెంట్ ఎక్కువవ్వడంతో క్రిష్ తప్పుకున్నాడన్న టాక్ లేకపోలేదు. తాజాగా మణికర్ణిక విడుదల నేపథ్యంలో కంగనా హైదరాబాద్‌లో ప్రమోషన్స్‌కు హాజరైంది. భవిష్యత్‌లో తన సినిమాల దర్శకత్వ శాఖల్లో ఇన్వాల్వ్‌మెంట్ ఉంటుందన్న విషయాన్నీ ఇక్కడ ప్రకటించింది. సొంతంగా దర్శకత్వంపై ఆసక్తి లేదని చెప్పుకురావడం విశేషం. గతంలో షార్ట్‌ఫిల్మ్‌లకు దర్శకత్వం చేసిన అనుభవంతోనే క్రియేటివ్ విషయాల్లో జోక్యం చేసుకుంటానని, తనకున్న అవగాహనతోనే సినిమా మేకింగ్‌లో జోక్యం చేసుకుంటానని కూడా చెబుతోంది. నా సినిమా విషయంలో నేను జోక్యం చేసుకోకుంటే ఎలా? అంటూ కంగనా ముక్తాయింపు నివ్వడం కొసమెరుపు.







హీరోయిన్లు గ్లామర్‌కేనా?

సినిమాలో నేను ఎంతసేపు స్క్రీన్‌పై కనిపిస్తాను అనేకన్నా, కనిపించినంతేపు నేను పోషించిన పాత్రకి ప్రాముఖ్యత, నాణ్యత ఉందా లేదా? నా ప్రెజెన్స్‌ని ఆడియెన్స్ ఫీలయ్యారా లేదా అనే ఆలోచిస్తా. అంతే తప్ప సినిమా మొత్తం నేనే ఉండాలనుకోను -ఇదీ ఓ హీరోయిన్ స్టేట్‌మెంట్. నిజానికి ఇప్పటి హీరోయిన్లకు ఇంత సీన్ ఉందా? ఉంటుందా? అన్నదే పెద్దడౌటు. ఈ సినిమాలో కథకు కీలకం, మలుపునకు కారణం నేనేనంటూ ప్రమోషన్స్ టైంలో హీరోయిన్ల చేత చెప్పించినా -సినిమా చూశాక ఆడియన్‌కే అర్థమవుతుంది గ్లామర్ డాల్ మాత్రమేనన్న విషయం. అప్పటి హీరోయిన్లతో పోల్చకపోయినా, కనీస ప్రాధాన్యత ఇప్పటి బ్యూటీలకు దక్కుతుందా? అన్నది మిలియన్ డాలర్స్ క్వొశ్చన్. కాదంటారా?





సినిమాలలో కథాపరంగా హీరోలకు ఎంత ప్రాధాన్యత ఉంటుందో హీరోయిన్లకు అంతే ప్రాధాన్యత ఉంటుంది. అవసరాలు అలాగే ఉంటాయి. టాకీల తొలి దశలో చిత్ర నిర్మాణాలన్నీ పౌరాణికాలే కాబట్టి స్త్రీపురుష పాత్రలు కథలో అవసరాన్నిబట్టి సమాన ప్రాధాన్యత కలిగి ఉంటాయి. అదీకాక అప్పటి నటీనటులకు స్టార్ వేల్యూ, ఇమేజ్‌లాంటివి ఉండేవికావు. సాంఘిక చిత్రాల నిర్మాణం, జోరుపెరగటం మొదలైన దగ్గర్నుంచి సినిమాలలో హీరోల తోపాటు హీరోయిన్లకూ స్టార్ వాల్యూ, ఇమేజ్ పెరుగుతూ వచ్చింది. హీరోయిన్‌లకు నటనా సామర్థ్యంతోపాటు అంద చందాలు, మేని వంపుసొంపు, లావణ్యం సమాన స్థాయిలో కావాలి. అంతకుముందైతే గ్లామర్‌కన్నా సమర్థతకే ప్రాముఖ్యతనిస్తే -సాంఘిక చిత్రాల నిర్మాణాలు 1950 దశకం ప్రారంభంనుంచి జోరందుకోవడం ప్రారంభమైననుండి నాటి చిత్రాలలో హీరోలకు, హీరోయిన్లకు నటన, టాలెంట్ తోపాటు కాస్త ఎక్కువగా గ్లామర్ అవసరమైంది.

మొదటినుండి సినిమా రంగంలో హీరోలే ఎక్కువ కాలం అంటే పాతిక, ముప్ఫై యేళ్లు కొనసాగుతుంటారు. ఇప్పటికీ ఇదే పద్ధతి. తొలి దశలో ఆనాటి హీరోయిన్లు దాదాపుగా అందరూ ఇంచుమించు ఇరవై ఏళ్లు కొనసాగుతూ వచ్చారు. ఇప్పటి హీరోయిన్లు ఎవ్వరైనా ఐదారేళ్లకే కనుమరుగవుతున్నారు. పట్టుమని పాతిక సినిమాలుచేస్తే గొప్ప. ఒక హిట్‌వస్తే టాలెంట్ లేకున్నా గ్లామర్‌కు భారీ పారితోషికం డిమాండ్ చేయటం, ఆంక్షలు పెట్టడం మామూలే. మార్కెట్‌కోసం ఆరంభంలో తీసుకొంటారు. భరించలేనివారు కొత్తవారిని వెతుక్కొంటారు. అదీకాక ఇప్పుడు వస్తున్నవారు స్టార్ వాల్యూ రాగానే సీనియర్స్‌ని ఒప్పుకోవటం లేదు. యువ హీరోలే కావాలంటారు. అందుకే స్టార్ హీరోలకు హీరోయిన్ల ఎంపిక కత్తిమీద సాములా మారింది.

1950 ఆరంభంలో అంతకుముందు చిత్తూరు నాగయ్య లాంటి ముప్ఫై అయిదు దాటిన హీరోలు, కొత్తగా వచ్చిన ఎన్టీఆర్, కొంత సీనియారిటీ వున్న అక్కినేని నాగేశ్వరరావు లాంటి పాతిక దాటిన హీరోల ధాటికి క్యారెక్టర్ పాత్రలకు పరిమితమయ్యారు. ఇంకా జగ్గయ్య, కాంతారావు, హరనాథ్, రామశర్మ లాంటి కొత్తవారి రాక ఒరవడిగా సాగుతుంటే హీరోయిన్లు కూడ శ్రీరంజని, కన్నాంబ, మాలతి, శాంతకుమారి, భానుమతి లాంటి మూడుపదులు దాటిన వారిని దాటుకుంటూ కొత్త అందాలు, నటన మేళవించిన యువ హీరోయిన్లు రాకమొదలైంది. అలా అంజలీదేవి, సావిత్రి, షావుకారు జానకి, కృష్ణకుమారి, జి.వరలక్ష్మి, యస్.వరలక్ష్మి, జమున, దేవిక, గిరిజ తొలి తరం వారుకాగా బి.సరోజాదేవి, ఇ.వి.సరోజ, రాజసులోచన, వాసంతి, రాజశ్రీ లాంటివారు యాభై దశకం చివరలో వచ్చినవారు, 60 దశకం ఆరంభంలో శారద, జయంతి, ఎల్.వి.విజయలక్ష్మి, వహీదారెహ్మాన్, అమ్మాజీ, పద్మిని, జయశ్రీ, 65-70 ప్రాంతాలలో వచ్చిన విజయనిర్మల, జయలలిత, విజయలలిత, చంద్రకళ, వాణిశ్రీ, లక్ష్మి, కె.ఆర్.విజయ, షీలా, భారతి, కాంచన, శుభ, శ్రీవిద్య, మంజుల, గీతాంజలి, జ్యోతిలక్ష్మి, జయమాలిని, హలం, రమాప్రభ, 75 తర్వాత వచ్చినవారు జయసుధ, జయప్రద, జయచిత్ర, సంగీత, సరిత, మాధవి, లత, కె.విజయ, కవిత, వై.విజయ, శ్రీదేవి 1980లో వచ్చిన విజయశాంతి, రాధ, సుహాసిని, రాధిక, సుమలత, భానుప్రియ, రమ్యకృష్ణ, 1990 దశకంలో వచ్చినవారు సౌందర్య, ఆమని, రోజా, రవళి, రంభ, మీనా, నగ్మా, రజని, శోభన, శ్రీప్రియ, దివ్యభారతి, సిమ్రాన్, రేవతి, గౌతమి, 2000నుండి ఇప్పటివరకు సంఘవి, చార్మి, కాజల్, రచన, ఇంద్రజ, ఆమని, టబూ, రవీనాటాండన్, ప్రియమణి, ఇలియానా, హన్సికా, శృతిహాసన్, అశ్విని, నయనతార, త్రిష, రాశి, రాశీప్రియ, మెహ్రీన్‌కౌర్, పూజాహెగ్డే, జెనీలియా, ఆర్తి అగర్వాల్, కల్యాణి ఇలా చెప్పుకుంటూపోతే చాంతాడంత లిస్టు. వీళ్ళంతా ఎంతోకొంత ఇమేజ్ సంపాదించి సినీ ప్రేక్షకుల్ని అలరించి రెండుమూడేళ్లు పేరులోవుండి మెల్లగా తెరమరుగైన వారే! వీళ్ళలో పదేళ్లువరకు పరిశ్రమలో వెలిగిన, మెలిగినవారిని వేళ్లపై లెక్కించొచ్చు

1950 దశకంలో సంపాదనకన్నా నటనపై అభిరుచితో పరిశ్రమలోకి మహిళలు వచ్చేవారు. నటించటానికి తపన పడేవారు. ఆరోజులలో నటీమణిగా ప్రవేశించినవారు ఏకంగా హీరోయిన్‌గా రాలేదు. రెండు మూడు చిత్రాలలో చిన్నచిన్న పాత్రలతో తమ టాలెంట్ నిరూపించుకొంటేగానీ దర్శక నిర్మాతలు హీరోయిన్‌గా అవకాశం యిచ్చేవారుకాదు. అలా వచ్చిన అంజలీదేవి, సావిత్రి, కృష్ణకమారి, జమున.. 1970వరకు నిరాటంకంగా హీరోయిన్లుగా కొనసాగారు. వీరు అప్పటి టాప్ హీరోలు అక్కినేని, నందమూరిలతోపాటు జగ్గయ్య, కాంతారావు లాంటి హీరోలతో చిన్న తేడా లేకుండా అందరితో హీరోయిన్‌గా చేసేవారు. 30 ఏళ్లపైగా అగ్ర హీరోలుగా వెలిగిన ఎన్టీఆర్, ఎఎన్‌ఆర్‌లతో ఒక్కోరు యిరవై పాతిక చిత్రాల వరకు హీరోయిన్‌గా నటించారు. అదే స్థాయిలో వారిని ప్రేక్షకులు అధిక విజయాలతో ఆదరించారు. రెండో తరంలో వచ్చిన రాజసులోచన, బి.సరోజాదేవి, రాజశ్రీలు కూడా ఎన్టీఆర్, ఎన్నార్‌లతో పది చిత్రాలకు పైగా చేశారు. అగ్రనటి వాణిశ్రీ అయితే హాస్య నటి, క్యారెక్టర్ నటిగా ఐదారేళ్ల చేసిన తరువాత 1967లో హీరోయిన్ స్థాయికి ఎదిగారు. ఆ సమయంలో వచ్చిన రెండోతరం అగ్ర హీరోలు కృష్ణ, శోభన్‌బాబు, హరనాథ్, కృష్ణంరాజుల తోపాటు ఎన్టీఆర్, ఎన్నాఆర్‌లతో కూడ యిరవై చిత్రాలకు పైగా హీరోయిన్‌గా నటించారు. వాణిశ్రీ కూడ 25 యేళ్లు హీరోయిన్‌గా కొనసాగి పునఃప్రవేశంతో క్యారెక్టర్ పాత్రలలో కొన్నాళ్లు సాగి రిలాక్స్ అవుతున్నారు.



వాణిశ్రీ కంటే ముందుగా కాంచన, సుకన్య, జయంతి, శారద, చంద్రకళ, గీతాంజలి, ఎల్.విజయలక్ష్మి తదితరులు హీరోయిన్లుగా, ఓవైపు చెల్లెలు, హాస్య, క్యారెక్టర్ పాత్రలలో రాణించారు. 75 దశకంలో వచ్చిన జయసుధ, జయప్రద, శ్రీదేవి ఆ టైంలో స్టార్ ఇమేజ్‌తో రాకెట్‌లా దూసుకుపోయారు.

తర్వాత వచ్చిన రాధ, విజయశాంతి, సుహాసిని, కృష్ణ, శోభన్‌బాబులతో అప్పుడే కొత్తగా వచ్చిన మెగాస్టార్ చిరంజీవితో వీరు ఒక్కొక్కరు 20 చిత్రాలవరకు జోడిగా నటించారు. శ్రీదేవి కూడ 5 చిత్రాలు చేసింది. రాధ, విజయశాంతి, సుహాసిని కూడ బాలకృష్ణతో 10 చిత్రాలవరకు చేశారు. రమ్యకృష్ణ కూడ వీరితోపాటు మోహన్‌బాబు, రాజశేఖర్, రాజేంద్రప్రసాద్ లాంటి వారితో చేస్తూ పదేళ్ళుపైగా హీరోయిన్‌గా కొనసాగారు. 1960లో వచ్చిన హరనాథ్‌తో జమున దాదాపు 10 చిత్రాలలో నటించింది. 1995 ప్రాంతాలలో వచ్చిన సౌందర్య కూడ 2003 మరణించేవరకు జగపతిబాబు, రాజశేఖర్, మోహన్‌బాబు, వెంకటేష్, శ్రీకాంత్, కృష్ణ, రాజేంద్రప్రసాద్ లాంటి హీరోలతో ఎక్కువగా నటించారు.

ఆమని, శోభన, అశ్వని, కవిత, మీనా, నగ్మా, అమల, వాణివిశ్వనాథ్, భానుప్రియ, రోజా, రతి, కుష్బు లాంటివారు నాలుగైదు ఏళ్లు హీరోయిన్లుగా ఆనాటి హీరోలతో ఓ వెలుగు వెలిగారు. 'చంద్రముఖి'తో పరిచయమైన నయనతార, శృతిహాసన్, కాజల్, సమంత, త్రిష, జెనిలియా, శ్రియా లాంటివారు ఓ పదేళ్ళనుండి హీరోయిన్స్‌గా చేస్తూ సీనియర్స్‌గా మారిపోయారు. ఇప్పటి మెహ్రీన్‌కౌర్, పూజాహెగ్డే, తమన్నా, అనుపమా పరమేశ్వరన్, అనూ ఇమ్మాన్యుయల్, రాశీఖన్నా, రకుల్‌ప్రీత్‌సింగ్, హన్సికలాంటి ఎందరో నవ యువ తారలు నటనకన్నా గ్లామర్ పాత్రలతో నేటి యువతరాన్ని ఆకర్షించేందుకు రాణించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక ఆఖర్న అనుష్క టాలెంట్ ఉన్న నటిగా గ్లామర్ హీరోయిన్‌గా ఈనాటి అగ్రహీరోలతో జతగాచేసి అరుంధతి, బాహుబలి, భాగమతి లాంటి చిత్రాలలో లేడీ హీరోయిజంతో నేడు టాప్‌స్టార్‌గా ఉన్నారు. అనుష్క కంటే ముందు విజయశాంతి గ్లామర్ రోల్స్‌తో కర్తవ్యం, ఆశయం, పోలీస్‌లాకప్, ఒసే రాములమ్మ లాంటి చిత్రాలలో డైనమిక్, పోలీస్ పాత్రలతో ఒక టైంలో చరిత్ర సృష్టించారు.

ఇప్పుడు వస్తే హీరోయిన్స్ గ్లామర్ పాత్రలకే తప్ప నటనకు పదునుపెట్టే పాత్రలు చేయలేకపోతున్నారు. ప్రస్తుతం వున్నవారంతా ఉత్తరాది భామలే! నయనతార, సమంత, కీర్తిసురేష్ లాంటి హీరోయిన్లు నటనకు అవకాశముండే పాత్రలు అడపాదడపా చేస్తున్నారు. ఆనాటి హీరోయిన్లు మాదిరిగా ఈనాటి హీరోయిన్ల నుంచి అలాంటి చిత్రాలు ఆశించగలమా. ఒకవేళ అవకాశం వస్తే చేయగలరా! అన్నేళ్లు మనగలరా? డౌటే.


-పీవీఎస్పీ

సీత చెప్పేసింది

బెల్లంకొండ శ్రీనివాస్ కాజల్ జంటగా 'కవచం' తర్వాత మరోసారి వీరిద్దరు కలిసి నటిస్తున్నారు. తేజ దర్శకత్వంలో తెరకెక్కడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రానికి మొదటినుండి కూడా సీత అనే టైటిల్ ప్రచారం జరుగుతుంది. కాని ఇప్పటివరకు చిత్ర యూనిట్ సభ్యులు మాత్రం ఆ విషయమై క్లారిటీ ఇవ్వలేదు. తేజ శ్రీనివాస్‌ల కాంబో మూవీ 'సీత' అంటూ వార్తల్లో వస్తున్న విషయాన్ని తాజాగా కాజల్ పొరపాటున కన్ఫర్మ్ చేసింది. గతంలో హీరోలు మరియు ఇతర టెక్నీషియన్స్ సినిమాల పేర్లు పొరపాటున రివీల్ చేసిన సందర్భాలు ఉన్నాయి. అదే విధంగా తాజాగా కాజల్ కూడా తన తదుపరి చిత్రం టైటిల్ విషయంలో క్లారిటీ ఇచ్చింది. తిరుపతిలో జరిగిన ఒక కార్యక్రమంలో కాజల్ పాల్గొంది. ఆ సందర్భంగా ప్రస్తుతం తాను తేజ దర్శకత్వంలో శ్రీనివాస్‌తో కలిసి 'సీత' చిత్రంలో నటిస్తున్నట్లుగా చెప్పుకొచ్చింది. అది విషయం.

నాకు నచ్చిన సినిమా

కథానాయకుడు



ప్రముఖ దర్శకుడు కె.హేమంబరధరరావు స్వీయ నిర్మాణ, దర్శకత్వంలో నిర్మించిన చక్కని ప్రభోధాత్మక రాజకీయ చైతన్య చిత్రం -కథానాయకుడు. ఎన్టీఆర్, జయలలిత హీరో హీరోయిన్లు. తొమ్మిది కేంద్రాల్లో ఘన విజయం సాధించిన చిత్రమిది. సంఘంలో పెద్దమనుషులుగా వ్యవహరించే ముగ్గురి వ్యక్తుల అవినీతి జీవితాల్ని బట్టబయలుచేసే సామాన్య మధ్యతరగతి యువకుడి సాహస కథ. వాహినీవారి 'పెద్దమనుషులు' స్ఫూర్తితో ఆ కథాంశాన్నే మార్పులుచేసి నిర్మించారు.

చిత్రంలో పెద్దమనుషులు ముగ్గురిగా నాగభూషణం, మిక్కిలినేని, అల్లు రామలింగయ్యలు సమర్థవంతంగా నటించారు. ఇక 'కథానాయకుడు' సారథిగా ఎన్.టి.ఆర్, జోడిగా జయలలిత జామపండ్లు అమ్మే సామాన్య పేదరాలి యువతిగా నటించారు. ఆమె అన్నగా ప్రభాకర్‌రెడ్డి, ఎన్టీఆర్ అన్నగా ధూళిపాళ, నాగయ్య, పద్మనాభం, రాజబాబు, కాకరాల, రావికొండలరావు, రమాప్రభ, రాధాకుమారి, సంధ్యారాణి తదితరులు పాత్రోచితంగా నటించారు. టీవీ రాజు సంగీత సారథ్యంలో పాటలన్నీ (మచ్చుకు -కొసరాజు రాసిన 'వినవయ్యా రామయ్యా ఏమయ్య భీమయ్యా' దాశరథి ఇచ్చిన 'ఇంతేనయా తెలుసుకోవయా ఈలోకం ఇంతేనయా) ప్రజాదరణ పొందాయి. చిత్రమంతా చురుకైన కథనం, చక్కని సన్నివేశాలతో సాగుతూ, ముగ్గురి విలన్ల నాగభూషణం, అల్లు, మిక్కిలినేనిల మధ్య కామెడీ సంభాషణలతో, యింకా రాజబాబు, పద్మనాభం, రమాప్రభ వారి కుటుంబాలమధ్య వచ్చే కామెడీ సన్నివేశాలతో విసుగులేకుండా సాగుతుంది. అందరి మెప్పుపొంది చిత్రం ఆర్థిక విజయం కూడా సాధించింది. ఎన్.టి.ఆర్., జయలలితల జంట చిత్రమంతా అలరిస్తుంది. వారు బాగా ప్రజాదరణ పొంది దాదాపు పది చిత్రాలపైగా నటించారు. ఈ చిత్రంలో వీరికి 'డ్యూయెట్ సాంగ్' లేకపోయినా ఈ జంట చక్కని అభినయం ప్రదర్శించారు. 'కథానాయకుడు' టైటిల్ ఎంతో ఆదరణ పొందింది. ఈ టైటిల్‌తోనే ఎన్.టి.ఆర్ తనయుడు బాలకృష్ణ నటించిన చిత్రం విజయవంతమైనది. రజనీకాంత్ ద్విభాషా చిత్రం ఒకటి 'కథానాయకుడు' పేరుతోనే చిత్రం వచ్చి ఏవరేజ్‌గా నిలిచింది. ప్రస్తుతం ఎన్.టి.ఆర్ జీవిత చరిత్రను బయోపిక్‌గా మొదటి భాగంగా 'కథానాయకుడు' పేరుతో జనవరిలో రిలీజయ్యే విధంగా నిర్మాణం చేస్తున్నారు. రెండు భాగాలుగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈతరం ప్రేక్షకులూ ఈ చిత్రం ఎప్పుడైనా టీ.విలో వస్తుంటే, ఎక్కడైనా ఆడుతుంటే చూడండి.

-శివప్రసాదరావు, అద్దంకి

నాకు నచ్చిన పాట

నేను పుట్టాను..



ఆప్యాయత అందుకోలేనివాడు, అభిమానం పొందలేనివాడు అనురాగం దక్కనివాడు, చాలా దురదృష్టవంతుడు. మనసు చంపుకు బ్రతుకుతాడు. మనసును బుజ్జగించి ఓదార్చుతాడు. మత్తును మింగి మైకంలో ఉండిపోతాడు. ఆలోచనల్ని నిద్రపుచ్చుతాడు. ప్రేమను పొందలేని జీవి ఎలా బ్రతుకుతాడో, పాడతాడో అలాంటి పలుకులు కూర్చి నేను పుట్టాను రాసాడు ఆత్రేయ. ఆత్రేయ పాటలు రాసినా, మాటలు రాసినా వాటిలో క్లుప్తత, ఆప్తత, ఆర్ద్రత కనిపిస్తాయి. నేను పుట్టాను లోకం మెచ్చింది/ నేను ఏడ్చాను లోకం నవ్వింది/ నేను నవ్వాను ఈ లోకం ఏడ్చింది/ నాకింకా లోకంతో పని ఏముంది.. డోన్ట్‌కేర్... -వ్యతిరేక లోకాన్ని లెక్కచేయనంటారు హీరో.

నేను తాగితే కొందరి కళ్ళు గిరగిర తిరిగాయి/ నేను పాడితే అందరి నోళ్ళు వంతలు పాడాయి/ నేను ఆడితే అందరి కాళ్ళు నాతో కలిసాయి/ తెల్లవారితే వెనకన చేరి నవ్వుకుంటాయి.

లోకం తీరుపై ఆత్రేయ సెటైర్. ఇంతకంటే గొప్పగా ఏముంటుంది? ఆత్రేయ మాటలే పాటలు. పాత్ర చిత్రణే ముఖ్యం ఆయన రచనకు.

మనసును దాచేటందుకె పైపై నవ్వులు ఉన్నాయి/ మనిషికి లేని అందంకోసమే రంగులు ఉన్నాయి/ ఎరుగక నమ్మిన వాళ్ల నెత్తికె చేతులు వస్తాయి/ ఎదుటి మనిషికి చెప్పేటందుకే నీతులు ఉన్నాయి.. డోన్ట్ కేర్...

తన అనుభవాలను పాత్ర పేరుతో మనకు ఇలా పంచాడు ఆత్రేయ.

ఈ పాట 'ప్రేమనగర్' చిత్రంలోది. ఘంటసాల పాడారు. అక్కినేని నాగేశ్వరరావు నటించారు. ఆత్రేయ రాసారు. చిత్రంలో పాట సందర్భం, దానికి తగ్గట్టుగా కెవి మహదేవన్ సంగీతం కుదర్చటం, భావార్థాలు అన్నీ సమపాళ్లలో కుదరటంతో చిరకాలం గుర్తుండిపోయే పాట అయ్యింది. ఈ పాట నాకు నచ్చిన పాట. ప్రేమనగర్ చిత్రానికి ఈ పాట ఓ హైలెట్. 1971లో ఈ సినిమా విడుదలైంది. ఇప్పటికీ ఈ పాట, ఆనోట ఆచోట వినపడుతూనే వుంటుంది. దర్శకత్వం కె సూర్యప్రకాశరావు, నిర్మాత డి రామానాయుడు, కథ, కోడూరి కౌసల్యాదేవి.

-తాడినాడ భాస్కరరావు, తణుకు

వెన్నెల రచయితలకు సూచన

వెన్నెలకు రచనలు పంపాలనుకునే వారు ఈ కింది విషయాలను గమనించగలరు

- ప్రతి ఆదివారం వెలువడే వెన్నెలకు రచనలు శుక్రవారంలోపు చేరాల్సి వుంటుంది.
- రచనల్లో కొత్తదనం ముఖ్యం
- తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో వచ్చే కొత్తసినిమాలను పరిశీలించే ఆసక్తి వున్న వారు, సంబంధిత వ్యాసాలు పంపితే అవీ ప్రచురణార్హమే.
- ఇంతవరకు ఎక్కడా ప్రచురితం కాని, అపురూప చిత్రాలువుంటే పంపొచ్చు.
- రచనలను ఈ మెయిల్‌లో స్కాన్ లేదా పిడిఎఫ్ ఫార్మాట్‌లో vennela@deccanmail.comకు మెయిల్ చేయగలరు.
- ప్రచురించిన (మీ వ్యూస్ మినహా) ప్రతి వ్యాసానికి గుర్తింపు వుంటుంది.

మా చిరునామా :
ఎడిటర్, వెన్నెల, ఆంధ్రభూమి దినపత్రిక
36, సరోజినీదేవి రోడ్ , సికింద్రాబాద్- 03